

ప్యాసింజర్ రైలు, గూడ్స్ ఢీ

8 మంది మృతి.. 14 మందికి గాయాలు **2**

ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ వద్ద ప్రమాదం

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 5-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 239 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: పౌర్ణమి రా. 6:49 తదుపరి పాడ్యమి, నక్షత్రం: అశ్విని ఉ.9:40 తదుపరి భరణి, వర్జ్యం: శేషం ఉ. 7:33, రా. 6:01-7:25, దుర్ముహూర్తం: ఉ.11:36-12:21, అమృతఘడియలు: రా.2:23-3:46, రాహుకాలం: ఉ.12:00-1:30, సూర్యోదయం: 6:19, సూర్యాస్తమయం: 5:38 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా!?



అన్నీ 'సెవెన్' సీటర్ ఆటోలు! కానీ.. ఒక్కో ఆటోలో పరిమితికి మించి.. కిక్కిరిసిన విద్యార్థులు! రయ్యిమని వెళుతున్నది రాంగ్ రూట్‌లో! అందులోనూ.. జాతీయ రహదారిపై! జరగరాని ఘోరం జరిగితే ఎలా? రాంగ్ రూట్‌లో దూసుకెళ్లే 'ప్రాణాల'కు పూచీ ఎవరిది? కర్నూలు జిల్లా ఓర్వకల్లు నుంచి నంద్యాల వైపు వెళ్లేందుకు ఒక కిలోమీటరు దూరం వెళ్లి... రాక్ గార్డెన్ వద్ద యూటర్న్ తీసుకోవాలి. కానీ.. విద్యార్థులను తీసుకెళ్లే ఆటోలు, వాహనాలు దాదాపు అర కిలోమీటరు మేర రాంగ్‌రూట్‌లో వెళ్లి, హైవేలో అటువైపు కలుస్తున్నాయి. జైరాజ్ ఇస్పాత్ స్టీల్‌ప్లాంట్‌కు ముడి సరుకును సరఫరా చేసే భారీ వాహనాలదీ ఈ 'తప్పుడు' దారే! ఇదో నిత్య కృత్యం! ఈ వాహనాలు పోలీసు స్టేషన్ ముందు నుంచే రాంగ్ రూట్‌లో వెళ్తున్నా పట్టించుకునే వారు లేరు. వరుస ప్రమాదాల్లో పెద్దసంఖ్యలో ప్రాణాలు పోతున్నా అప్రమత్తత కనిపించడం లేదు.

- ఓర్వకల్లు, ఆంధ్రజ్యోతి

మరో ట్రావెల్ బస్సు దూకుడు!

మితిమీరిన వేగంతో వ్యాన్‌ను ఢీకొని బోల్తా


మహిళా టెకీ దుర్మరణం.. 8 మందికి గాయాలు

శ్రీసత్యసాయి జిల్లాలో ఘోర ప్రమాదం

చెన్నేకొత్తపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వరుస ప్రమాదాలు జరుగుతున్నా ప్రైవేటు ట్రావెల్ బస్సుల దూకుడుకు మాత్రం కళ్లెం పడడం లేదు. తాజాగా శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం దామాజిపల్లి సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై ప్రైవేటు ట్రావెల్ బస్సు ఐషర్ వ్యాన్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో ఓ మహిళా టెకీ మృతి చెందారు. మరో

మిగతా 14వ పేజీలో...

క్షణాల్లో తల్లి లేని బిడ్డగా..



మృతిచెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సురక్ష.. కూతురు నిధితో భర్త వినీత్

జగన్ 'షో'.. జనం పాట్లు

రైతుల పరామర్శ పేరిట వైసీపీ బల ప్రదర్శన

- టపాసుల మోత.. సైలెన్సర్ తీసిన బైకుల రొద
- విజయవాడ - మచిలీపట్నం ఎన్‌హెచ్ 65పై అనుమతుల్లేకుండా 70 కార్లతో భారీ రోడ్డు షో
- భారీగా డబ్బు ఖర్చు చేసి జన సమీకరణ
- తీవ్ర ఇక్కట్లుపడ్డ ప్రయాణికులు, వాహనదారులు
- పోలీసులపై పదే పదే విరుచుకుపడ్డ వైసీపీ నేతలు
- సీఐలపై మాజీ ఎమ్మెల్యే కైలే, పేర్ని కిట్టు దుర్భాషలు
- కాన్వాయ్‌లోని వాహనాలు ఢీ.. పలువురికి గాయాలు
- దమ్ముంటే అడ్డుకోండంటూ జగన్ మీడియాలో వైసీపీ నాయకుల బహిరంగ సవాళ్లు

పంటబీమా చెల్లించకపోవడంవల్లే రైతులకు కష్టాలని జగన్ ఆరోపణలు

విజయవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల సందర్శన, రైతుల పరామర్శ పేరుతో కృష్ణాజిల్లాలో వైసీపీ అధినేత జగన్ మరోసారి బలప్రదర్శన యాత్రను నిర్వహించారు. తుఫానుకు దెబ్బతిన్న పంటపొలాల పరిశీలన కోసమంటూ అనుమతులు తీసుకుని, నిబంధనలకు విరుద్ధంగా భారీ కాన్వాయ్‌లతో, తరలించిన జనాలతో విజయవాడ - మచిలీపట్నం ఎన్‌హెచ్ 65పై రోడ్డు షో

మిగతా 13వ పేజీలో...



కృష్ణా జిల్లా నిడుమోలులో రోడ్ షో నిర్వహిస్తూ అభివాదం చేస్తున్న జగన్

పంటల బీమాపై జగన్ ప్రగల్భాలు!

- ఐదేళ్ల పాలనలో మూడేళ్లు ఎగనామం
- రైతు వాటా కింద నయా పైసా చెల్లించలేదు
- పార్లమెంట్ సాక్షిగా వెల్లడించిన కేంద్ర మంత్రి
- అయినా అన్నీ మర్చిపోయి ఉత్తుత్తి గొప్పలు
- అప్పట్లో ఎరువులు, పురుగు మందులు వైసీపీ నేతల సిఫారసులు ఉన్నరైతులకే
- ఇప్పుడు సహకార సంఘాల ద్వారా పంపిణీ
- అయినా బ్లాక్ మార్కెట్ అంటూ జగన్ గగ్గోలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి) రైతుల్ని సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారంటూ గుండెలు బాదుకున్న మాజీ సీఎం జగన్.. తన పాలనలో ఉచిత పంటల బీమాను పక్కాగా అమలు చేశామని ప్రగల్భాలు పలికారు. మంగళవారం కృష్ణా జిల్లాలో తుఫాను ప్రభావంతో దెబ్బ తిన్న పంటలను పరిశీలించిన సందర్భంగా ఆయన ఇలాంటి ఉత్తుత్తి

మిగతా 13వ పేజీలో...



లండన్‌లో ఐవోడీ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు స్వీకరిస్తున్న భువనేశ్వరి. చిత్రంలో సీఎం చంద్రబాబు, సంస్థ ప్రతినిధులు

ప్రజా సేవకు దక్కిన గౌరవం

- విశిష్ట ఫెలోషిప్ అవార్డు స్వీకరించిన భువనేశ్వరి **13**
- హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ హోదాలో గోల్డెన్ పీకాక్ అవార్డు కూడా..

లండన్‌లో ప్రదానం చేసిన ఐవోడీ

విజన్ ఉంటేనే అభివృద్ధి

"ప్రపంచ మార్పులకు అనుగుణంగా మనమూ మారుతూ ఉండాలి. ప్రస్తుతం కేవలం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సరిపోదు.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కూడా అవసరమే.

భవిష్యత్ సవాళ్లను అధిగమించేలా, యువత నైపుణ్యం సాధించేలా విద్యాసంస్థలు, పారిశ్రామిక వర్గాలు, ప్రభుత్వం కలిసి పరస్పరం సహకరించుకోవాలి.

- సీఎం చంద్రబాబు"

ఏఐ టెక్నాలజీదే భవిష్యత్.. దీనికనుగుణంగానే మా ప్రణాళికలు: సీఎం

- ముందుచూపు ఉంటేనే ఏ రంగంలోనైనా పురోగతి
- రేపటి తరం భవిష్యత్ కోసం సరైన వేదికలను సిద్ధం చేయాలి
- ఆ బాధ్యత పాలకులు, పారిశ్రామికవేత్తలదే
- ప్రభుత్వాలు, ప్రైవేటు కలిసి పనిచేయాలి
- ఏడాదిలో రాష్ట్రానికి 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించాం
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సదస్సులో చంద్రబాబు కీలకోపన్యాసం

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముందుచూపు ఉంటేనే ఏ రంగంలోనైనా అభివృద్ధి సాధ్యమని, రేపటి తరం భవిష్యత్ కోసం సరైన వేదికలను సిద్ధం చేయాల్సిన బాధ్యత పాలకులు, నేటి తరం పారిశ్రామికవేత్తలపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. లండన్‌లో ప్రతిష్ఠాత్మక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐవోడీ) సంస్థ ఆయన సతీమణి భువనేశ్వరికి మంగళవారం రెండు అవార్డులు అందించింది. ఈ కార్యక్రమంలో చంద్రబాబు కీలక ప్రసంగం చేశారు. ఐవోడీ సంస్థ కార్పొరేట్ ప్రపంచానికి 35 ఏళ్లుగా సేవలందిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ప్రపంచంలో రకరకాల మార్పులు వస్తున్నాయని, దానికి అనుగుణంగా ప్రభుత్వాలు గానీ, సంస్థలు గానీ తమ ప్రణాళికల్లో

మిగతా 13వ పేజీలో...

1.03 లక్షల కోట్ల పెట్టుబడులు.. 83 వేల ఉద్యోగాలు

- కంపెనీల ప్రతిపాదనలకు ఎస్‌ఐపీసీ ఆమోదం
- ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో భారీగా పెట్టుబడులు
- 22,976 కోట్లతో ఇండిచిప్ సెమీ కండక్టర్ ప్లాంట్
- 7న ఎస్ఐపీబీ ముందుకు

వివేకా హత్య కేసులో.. తదుపరి దర్యాప్తు జరపాల్సిందే!

- ఏ-2 సునీల్ యాదవ్ సంచలన కౌంటర్
- సునీతారెడ్డి పిటిషన్‌పై దాఖలు
- వివేకా సంబంధాలు, అవినాశ్‌రెడ్డితో కక్షలను దర్యాప్తు సంస్థ పట్టించుకోలేదు
- ఎన్ఐఏ సాయంతో పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశాలివ్వాలి: సునీల్ **14**

గోపీచంద్ హిందూజా కన్నుమూత **2**



లండన్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన హిందూజా గ్రూప్ చైర్మన్

నా బెంచ్‌ను తప్పించుకొనే ఎత్తుగడ!

విచారణ చివరిలో విస్తృత ధర్మాసనాన్ని కోరడమా?



- కేంద్రంపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ఆగ్రహం
- వాదనలు ముగించాకే నిర్ణయం తీసుకుంటానని స్పష్టీకరణ
- ట్రైబ్యునల్స్ సంస్కరణల చట్టంపై విచారణ 7కు వాయిదా

న్యూఢిల్లీ, నవంబరు 4: కేంద్ర ప్రభుత్వం తన ధర్మాసనం నుంచి తప్పించుకోవాలని చూస్తోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. కేసు తుది వాదనలు వినడానికి సిద్ధమైన తర్వాత కేంద్ర ప్రభుత్వం ఐదుగురు సభ్యుల విస్తృత ధర్మాసనం విచారణను కోరుకోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం-2021 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లో పిటిషనర్ వాదనలు విన్న తర్వాత విస్తృత ధర్మాసనాన్ని కోరడమంటే ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తప్పించుకొనే ఎత్తుగడేనని అభిప్రాయపడ్డారు. జస్టిస్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం మద్రాస్ బార్ అసోసియేషన్ దాఖలు చేసిన కేసులో వాదనలు వింది. ఈ సందర్భంగా అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి విస్తృత ధర్మాసనాన్ని కోరుతూ దరఖాస్తు చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి ఎత్తుగడలకు పాల్పడుతుందని

మిగతా 2వ పేజీలో...



నచ్చితే ఎంతైనా!

- ఓపీజీడబ్ల్యూ టెండరు ధర 16.77 కోట్లు పెంచేశారు
- నచ్చిన వారి కోసం ట్రాన్స్‌కోలో రూ.కోట్లలో పందేరం
- కేబుళ్ల సరఫరా, ఏర్పాటుకు గతేడాది 84 కోట్లతో టెండరు
- పనులు అప్పగించకుండా ఏడాది జాప్యం
- అర్ధంతరంగా పాతది రద్దు..101 కోట్లకు పనుల అప్పగింత

ఏపీ ట్రాన్స్‌కోలో అక్రమాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఒక పనికి టెండరు పిలుస్తారు. తమకు కావాల్సిన వారికి టెండరు దక్కకుంటే దాన్ని రద్దు చేసేస్తారు. అదే పనికి రీటెండరు పిలుస్తారు. ఈసారి పని విలువ గతానికన్నా రూ.కోట్లలో పెరిగిపోతుంది. అయినవారికి పని దక్కుతుంది. స్టాండర్డ్ షెడ్యూల్ ధరల్లో(ఎస్ఎస్ఆర్) ఎలాంటి మార్పూ లేకున్నా టెండరు విలువ ఎందుకు పెరిగిందని అడిగేవారే ఉండరు. ఎవరైనా సమాచార హక్కు చట్టం ద్వారా అడిగినా అది వ్యాపార రహస్యం అని ట్రాన్స్‌కో అధికారులు సెలవిస్తారు. ఓపీజీడబ్ల్యూ (ఆప్టికల్ గ్రౌండ్ వైర్) టెండర్లలో జరిగిందిదే..! **14**

ప్రివిలేజ్ కమిటీ నోటీసులపై.. జోక్యం చేసుకోలేం

- అపరిపక్వ దశలో కోర్టును ఆశ్రయించారు: హైకోర్టు
- సాక్షి ఎడిటర్, చీఫ్ రిపోర్టర్ వ్యాజ్యాలు కొట్టివేత
- షోకాజ్ నోటీసు వివిధ దశలను అధిగమించాలి
- వారి వివరణ తీసుకుని విచారణ ముగించాలని శాసనసభకు కమిటీ సిఫారసు చేయొచ్చు
- వారు చూపే ఆధారాలను బట్టి విచారణను ముగించే స్వాతంత్ర్యం సభకు ఉంటుంది
- కమిటీ నిర్ణయంపై న్యాయసమీక్ష జరపొచ్చు
- తీర్పులో న్యాయమూర్తి వెల్లడి **14**



ఎందుకంత జాప్యం?

- రిటైర్మెంట్ ప్రయోజనాల చెల్లింపుల తీరుపై హైకోర్టు అసంతృప్తి
- టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లించడం దాతృత్వం కాదు
- గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పొందడం ఉద్యోగుల హక్కు
- పిటిషనర్లకు 10 శాతం వడ్డీతో ప్రయోజనాలు చెల్లించండి
- కేడీసీసీ బ్యాంకును ఆదేశించిన ధర్మాసనం **12**

గ్రామీణ రోడ్ల నాణ్యతలో రాజీ వద్దు



- గుంతలు పడితే అధికారులదే బాధ్యత **8**
- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టీకరణ

పంచాయతీల ప్రక్షాళన.. 4 విభాగాలుగా పాలన.. అభివృద్ధి అధికారిగా కార్యదర్శి **12**

అగ్రవర్ణాల గుప్పిట్లో సైన్యం



- 10 శాతం ఉన్నవారు.. సైన్యాన్నీ నియంత్రిస్తున్నారు
- ఎన్నికల ప్రచారంలో రాహుల్ వివాదాస్పద వ్యాఖ్యలు
- గతంలోనూ సైన్యంపై వ్యాఖ్యలతో సుప్రీం చీవాట్లు
- మోదీది నకిలీ డిగ్రీ.. ప్రచారంలో రాహుల్ విమర్శలు **2**

పేదలను ఓటేయనీయొద్దు



- పోలింగ్ బూత్ వరకు రాకుండా అడ్డుకోండి
- జేడీయూ నేత, కేంద్ర మంత్రి లలన్ సింగ్ వ్యాఖ్యలు
- సోషల్ మీడియాలో వైరల్.. పోలీసు కేసు నమోదు
- వివరణ ఇవ్వాలంటూ కేంద్ర మంత్రికి ఈసీ నోటీసులు **2**

పేదలను పోలింగ్ బూత్ వరకు రానీయొద్దు

▸ కేంద్ర మంత్రి లలన్ సింగ్ వ్యాఖ్య.. పోలీసు కేసు నమోదు




పట్నా, నవంబరు 4: పేదలను ఓటు వేయనీయకండి అంటూ కేంద్ర మంత్రి, జేడీ(యూ) నాయకుడు రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ చేసిన వ్యాఖ్య వివాదాస్పదమయింది. మొకామాలో జరిగిన ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ ఎన్నికలు జరిగే రోజున పేదలు పోలింగ్ స్టేషన్ వరకు రాకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. లాలు ప్రసాద్‌కు చెందిన ఆర్జేడీ పార్టీ దీనిపై హిందీలో ట్వీట్ చేస్తూ లలన్ సింగ్..ఎన్నికల కమిషన్ అధికారాన్ని బహిరంగంగా సవాలు చేస్తున్నారని విమర్శించింది. ఎన్నికల కమిషన్ ఛాతీపై నుంచి బుల్డోజర్‌ను పంపించారని వ్యాఖ్యానించింది. దీనిపై ఇతర పార్టీలు కూడా విమర్శలు చేయడంతో పట్నా జిల్లా పోలీసులు స్పందించి కేసు నమోదు చేశారు. వివరణ ఇవ్వాలంటూ ఎన్నికల కమిషన్ కూడా నోటీసులు పంపించింది.

పంట నష్టం కింద రైతుకు పరిహారం రూ. 2.30

▸ ఖాతాలో పడాల్సింది లక్షన్నరకు పైగానే.. అవాక్కయిన బాధిత రైతు.. మహారాష్ట్రలో ఘటన

ముంబై, నవంబరు 4: అకాల వర్షాలతో 6.5 ఎకరాల్లో వేసిన పంట తుడిచిపెట్టుకుపోవడంతో ప్రభుత్వం నుంచి పరిహారం కింద వచ్చే మొత్తంతో పెట్టుబడి ఖర్చులైనా మిగులుతాయని ఆ రైతు ఆశించాడు. అయితే ఆ రైతు ఖాతాలో ప్రభుత్వం వేసిన మొత్తమెంతో తెలుసా? కేవలం రెండు రూపాయల ముప్పై పైసలు! మహారాష్ట్రలోని శిలోత్తర్ గ్రామానికి చెందిన మధుకర్ బాబూరావు అనే రైతుకు ఎదురైన దిగ్భ్రాంతికరమైన అనుభవమిది. బాబూరావు.. 'పీఎం ఫసల్ బీమా యోజన' కింద తాను వేసిన పంట కోసం జూలై 16న రూ.1148 ప్రీమియం కట్టారు. ఇటీవల అకాల వర్షాలతో ఆయన వేసిన పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. 6.5 ఎకరాల్లో పంట నష్టాన్ని లెక్కగట్టిన వ్యవసాయాధికారులు బాబూరావుకు పరిహారం కింద రూ.1,53,110 వస్తాయని తేల్చారు. అయితే అక్టోబరు 31న ఖాతాలో మాత్రం రూ.2.30 మాత్రమే వేశారు. అవాక్కయిన బాబూరావు.. అధికారులను సంప్రదించగా పొరపాటైందంటూ నాలుక్కరుచుకున్నారు. 2023లోనూ బాబూరావుకు పంట నష్టం జరిగింది. అప్పట్లో ఆయనకు పరిహారం కింద రూ. 72,466 రావాలి. అయితే రూ.72,463.70 మాత్రమే ఖాతాలో వేశారు. అప్పట్లో ఆ మిగిలిన రూ.2.30ను ఇప్పుడు ఇచ్చారన్నమాట! సాంకేతిక సమస్య వల్లే అలా జరిగినట్లు అధికారులు అంగీకరించారు.

లోకం తీరు



బయోమెట్రిక్ హాజరు ఏర్పాటుకు ఉద్యోగుల సమ్మతి అవసరం లేదు

▸ వారిని సంప్రదించనంత మాత్రాన అది చట్టవిరుద్ధం కాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టడానికి ఉద్యోగుల సమ్మతి అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఉద్యోగులను సంప్రదించనంత మాత్రాన బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ చట్ట విరుద్ధం కాదని పేర్కొంది. ఒడిశాలోని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్(ఏ అండ్ ఈ) కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించింది. 2013 జూలై 1, అక్టోబర్ 22, నవంబర్ 6 తేదీల్లో సిబ్బందికి బయోమెట్రిక్ హాజరును అమలు చేస్తామంటూ ఆ శాఖ సర్క్యులర్లు జారీ చేసింది. ఈ సర్క్యులర్లను ఉద్యోగులు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో సవాలు చేశారు. తమ అనుమతి లేకుండా ఈ నిర్ణయాన్ని తీసుకున్నారని, ఇది మాన్యువల్‌లో పేర్కొన్న నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఆ పిటిషన్‌ను ట్రిబ్యునల్ డిస్మిస్ చేసింది. ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించగా అనుకూలంగా తీర్పు వచ్చింది. హైకోర్టు తీర్పును కేంద్రం సుప్రీంలో సవాల్ చేసింది. కాగా, నిబద్ధతతో పనిచేసేవాళ్లకు బయోమెట్రిక్‌తో ఇబ్బందేంటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. హైకోర్టు తీర్పును కొట్టివేసింది.

ఛత్తీస్‌గఢ్‌లో గూడ్స్, ప్యాసింజర్ రైళ్ల ఢీ

▸ ఎనిమిది మంది మృతి.. 14మందికి గాయాలు

బిలాస్‌పూర్, నవంబరు 4: ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో ప్యాసింజర్ రైలు, గూడ్స్ ట్రైను ఢీకొన్నాయి. మంగళవారం సాయంత్రం 4గంటల సమయంలో బిలాస్‌పూర్ రైల్వే స్టేషన్ సమీపంలో లాల్ ఖండ్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్యాసింజర్ రైలు గూడ్సును వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో, ప్యాసింజర్ ముందుభాగం గూడ్స్ ట్రైను బోగీల మీదకు దూసుకువెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది మంది చనిపోయారు. 14మంది గాయపడ్డారు. రెండు రైళ్లకు సంబంధించిన కొన్ని బోగీలు పట్టాలు తప్పాయి. ప్రమాదం కారణంగా బిలాస్‌పూర్-హావ్‌డా మార్గంలో రైల్వే సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. కాగా, మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు, తీవ్రంగా గాయపడినవారికి రూ.5లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ.1లక్ష చొప్పున పరిహారం ప్రకటించారు.

భారతీయ విద్యార్థులకు కెనడా మొండిచెయ్యి!

న్యూఢిల్లీ, నవంబరు 4: భారతీయ విద్యార్థులకు కెనడా మొండిచెయ్యి చూపించింది. ఆ దేశంలోని విద్యాసంస్థల్లో చదువుకోవడానికి విద్యార్థి వీసా కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి నలుగురిలో ముగ్గురి దరఖాస్తులను ఇమిగ్రేషన్ అధికారులు తిరస్కరించారు. అధికారిక లెక్కల ప్రకారం... ఈ ఏడాది ఆగస్టులో దాదాపు 74% మంది భారత విద్యార్థుల వీసా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. 2023లో ఈ తిరస్కరణ రేటు 32% ఉంది. కాగా, గతేడాది చైనీయుల స్టడీ పర్మిట్లను 24 శాతం తిరస్కరించగా, అన్ని దేశాల వీసా దరఖాస్తులు కలిపి దాదాపు 40 శాతం నిరాకరించారు. మరోవైపు, భారత్ నుంచి కెనడా వెళ్లడానికి దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్యా తగ్గిపోయింది. 2023 ఆగస్టులో 20,900 మంది దరఖాస్తు చేసుకోగా, ఈ ఆగస్టులో వీరిసంఖ్య 4,515కు పరిమితమైంది.

ఇంగ్లీష్‌లో ఫెయిలైనందుకు అమెరికాలో 7,248 ట్రక్కు డ్రైవర్లకు ఉద్వాసన

న్యూఢిల్లీ, నవంబరు 4: అమెరికా రహదారుల భద్రతకు ప్రాధాన్యమిస్తున్న ట్రంప్ అడ్మినిస్ట్రేషన్.. ఇంగ్లీష్ భాష పరీక్షలో ఫెయిలైన 7,248 మంది ట్రక్కు డ్రైవర్లను గత నెలలో నిషేధించింది. 'ఇంగ్లీష్ మాట్లాడటంతోపాటు అర్థం చేసుకునే వారిని మాత్రమే వాణిజ్య ట్రక్కుల డ్రైవర్లుగా నియమించుకోవాలి' అని అమెరికా రవాణాశాఖ మంత్రి సియాన్ డఫ్ఫీ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ ఏడాది ఆగస్టు వరకూ 1,500 మంది ట్రక్కు డ్రైవర్లను తొలగించగా, గత నెలలో 7,000 దాటింది. భారతీయ డ్రైవర్ల వల్ల వరుసగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ట్రక్కర్ల సంఘం అంచనా ప్రకారం అమెరికా ట్రక్కు డ్రైవర్లలో 1.30-1.50 లక్షల మంది భారతీయులుంటారు. తాజాగా ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ తెచ్చిన కొత్త నిబంధనతో చాలా మందిపై ప్రతికూల ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ఆయన్ను అమెరికా నుంచి డీపోర్ట్ చేయొద్దు

▸ చేయని నేరానికి 43 ఏళ్లుగా జైల్లో మగ్గిపోతున్న వేదం సుబ్రహ్మణ్యానికి యూఎస్ కోర్టుల ఊరట

న్యూయార్క్, నవంబరు 4: తాను చేయని హత్యా నేరానికి అమెరికాలో 43 సంవత్సరాలపాటు జైల్లో మగ్గిపోయి, చివరికి నిర్దోషిగా విడుదలై.. ఇప్పుడు దేశ బహిష్కరణ ముప్పును ఎదుర్కొంటున్న భారత సంతతి వ్యక్తి వేదం సుబ్రహ్మణ్యానికి ఎట్టకేలకు ఉపశమనం లభించింది. ఆయన్ను దేశం నుంచి పంపించేయాలన్న 'బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్' ప్రయత్నాలకు రెండు న్యాయస్థానాలు చెక్ పెట్టాయి. ఇమ్మిగ్రేషన్ అప్పీళ్ల బ్యూరో ఆయన కేసును పరిశీలించాలా లేదా అని నిర్ణయించేదాకా ఆయన్ను డీపోర్ట్ చేయొద్దని ఆదేశించాయి. వేదం సుబ్రహ్మణ్యం వయసు ప్రస్తుతం 64 సంవత్సరాలు. భారతదేశంలో జన్మించిన ఆయన.. 1962లో 9నెలల వయసులో తల్లిదండ్రులతోపాటు అమెరికా వెళ్లారు. స్కూల్లో చదివేటప్పుడు.. టామ్ కిన్సెర్ అనే మరో పిల్లాడితో ఆయనకు స్నేహం కుదిరింది. 1980 డిసెంబరులో టామ్ ఉన్నట్టుండి కనపడకుండా పోయాడు. 1981 సెప్టెంబరులో టామ్ శవం దొరికింది. అతడి పుర్రె భాగంలో ఒక తూటాను గుర్తించారు. టామ్ చివరిసారి మాట్లాడింది సుబ్బుతోనేనని దర్యాప్తులో తెలియడంతో పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేశారు. ఎలాంటి సాక్ష్యాలూ లేకుండానే.. 1983 ఫిబ్రవరిలో కోర్టు ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అప్పట్నుంచీ ఆయన పెన్సిల్వేనియా జైల్లోనే ఉన్నారు. కానీ.. అన్యాయంగా జైలుపాలైన అమాయకులను విడిపించడానికి కృషి చేసే 'పెన్సిల్వేనియా ఇన్నోసెన్స్ ప్రాజెక్ట్' అనే స్వచ్ఛంద సంస్థ 2022లో ఆయన కేసును స్వీకరించడంతో అంతా మారిపోయింది. ఈ స్వచ్ఛంద సంస్థకు చెందిన లాయర్ల బృందం ఈ కేసు విచారణ సమయంలో పోలీసులు దాచిపెట్టిన నిజాన్ని బయటకు తీయడంతో ఆగస్టులో కోర్టు ఆయన శిక్షను రద్దు చేసింది. అక్టోబరు 3న సుబ్రహ్మణ్యం విడుదల కావాల్సి ఉంది. కానీ.. యూఎస్ ఇమ్మిగ్రేషన్ అధికారులు.. టామ్ హత్య కేసులో అరెస్టుకు ముందు ఆయనపై నమోదైన డ్రగ్స్ కేసునొకదాన్ని బయటకు తీసి ఆయన్ను దేశం నుంచి బహిష్కరించే(డీపోర్టేషన్) ప్రయత్నం చేశారు. కానీ, ఆయన సోదరి సరస్వతి న్యాయ పోరాటంతో.. యూఎస్ ఇమ్మిగ్రేషన్ కోర్టు, పెన్సిల్వేనియాలోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు కూడా ఆయన డీపోర్టేషన్ ప్రక్రియను నిలిపివేశాయి.

అల్లుడితో కేఈ ప్రభాకర్‌కు ఆస్తి వివాదం

▸ గాల్లోకి కాల్పులు జరిగినట్టు వార్తలు

▸ హైదరాబాద్‌లో కేసు.. నేను కాల్పులు జరపలేదు : ప్రభాకర్

రాయదుర్గం, కర్నూలు, నవంబరు4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో కాల్పుల అంశం మంగళవారం తీవ్ర సంచలనంగా మారింది. కర్నూలుకు చెందిన మాజీ మంత్రి కేఈ ప్రభాకర్‌కు, ఆయన అల్లుడికి మధ్య ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వ్యవహారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కేఈ ప్రభాకర్ కుమార్తెతో హైదరాబాద్‌లోని పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ కుమారుడు అభిషేక్‌గౌడ్‌కు 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ రెండు కుటుంబాల మధ్య వివాదం చోటు చేసుకోవడంతో వేర్వేరుగా ఉంటున్నారు. మణికొండలోని పంచవటి కాలనీలో ఉన్న రూ.2 కోట్ల విలువైన ఆస్తి విషయంలో గత నెల 25వ తేదీన మామ, అల్లుడి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ వివాదం నేపథ్యంలో గాలిలోకి కాల్పులు జరిగినట్టు వార్తలు వచ్చాయి. అయితే, అక్కడ కాల్పులు జరిగినట్టు ఆధారాలు లభించలేదని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మరోవైపు కేఈ ప్రభాకర్ ఈ వివాదంపై స్పందిస్తూ... తాను ఎలాంటి కాల్పులు జరపలేదని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

నా బెంచ్‌ను తప్పించుకునే ఎత్తుగడ!

(మొదటి పేజీ తరువాయి)



మేం ఊహించలేదు అని మరో 20 రోజుల్లో పదవీ విరమణ చేస్తున్న సీజేఐ అన్నారు. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం వాదనలు విని, విచారణను ముగిస్తామని, ఆ తర్వాతే విస్తృత ధర్మాసనానికి ఇవ్వాలా? వద్దా? అన్న నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పిటిషనర్ల న్యాయవాది అరవింద్ డాటర్ వాదనలు వినిపిస్తూ, ఐటాట్, క్యాట్ లాంటి ట్రిబ్యునళ్ల నియామకాలకు సంబంధించి ఎన్నోసార్లు వడపోతలతో ప్రతిభావంతుల జాబితా సిద్ధమైన తర్వాత హఠాత్తుగా జాబితాను పక్కన బెడుతున్నారని, తాజా ఎంపికలకు ఆదేశిస్తున్నారని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కొన్నిసార్లు కొత్త ప్రతిభావంతుల జాబితాను తయారు చేయకుండా వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న వారితో నింపేస్తున్నారని వెల్లడించారు. ప్రతిభావంతుల జాబితాలో చేర్చిన తర్వాత చాలా మంది బాధ్యతలు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారని, అందువల్లే ప్రతిభావంతుల జాబితా విషయంలో స్థిరంగా ఒకే విధానం అవలంబించడం కుదరడంలేదని అటార్నీ జనరల్ వివరించారు. ఇందులో ఐదుగురు సభ్యుల విస్తృత ధర్మాసనానికి నివేదించాల్సిన అవసరం ఏముందని సీజేఐ ప్రశ్నించారు. తమకు తప్పించుకొనే ఉద్దేశం లేదని, చట్టంలోని లొసుగులను, దానివల్ల జరిగిన కొన్ని తప్పులను ఆధారంగా చేసుకొని మొత్తం చట్టాన్నే కొట్టేయడం సరికాదని అటార్నీ జనరల్ స్పష్టం చేశారు. చట్టాన్ని కొనసాగనిస్తే పిటిషనర్లు లేవనెత్తిన సాంకేతిక లోపాలను కాలక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. ట్రిబ్యునల్ లో నియామకానికి 50 ఏళ్ల కనీస వయో పరిమితిని పెట్టడాన్ని సీజేఐ తప్పుబట్టారు. తాను 42వ ఏటే హైకోర్టు జడ్జిని అయ్యానని గుర్తు చేసుకున్నారు. హైకోర్టులకు, ట్రిబ్యునళ్లకు ఒకే అర్హత నిబంధనలు సరికాదని, రెండింటికీ భిన్నమైన అనుభవం అవసరమని అటార్నీ జనరల్ బదులిచ్చారు. సీజేఐ తదుపరి వాదనలు ఏడవ తేదీకి వాయిదా వేశారు. ట్రిబ్యునళ్ల సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2020-21 మధ్యకాలంలో పలు ఆర్డినెన్స్‌లను తెచ్చింది. వాటికి న్యాయస్థానాలు కొట్టేశాయి. దాంతో 2021లో అవే నిబంధనలతో చట్టం చేసింది. ఆర్డినెన్స్‌లోని అంశాలతో రూపొందించిన చట్టం కాబట్టి సుప్రీంకోర్టు దీన్ని కూడా కొట్టేస్తుందనే అనుమానాలున్నాయి. ఈ నేపథ్యంలోనే విస్తృత ధర్మాసనం విచారణను కేంద్ర ప్రభుత్వం కోరుకుంటోంది.

అమెరికాలో విమానాల 'షట్‌డౌన్'!

వాషింగ్టన్, నవంబరు 4: అమెరికాలో పౌర విమానయానానికి 'షట్‌డౌన్' దెబ్బతగిలింది. రోజూ వందల సంఖ్యలో విమాన సర్వీసులు రద్దవుతుండటం, వేల సంఖ్యలో విమానాలు ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. విమానాశ్రయాల్లో భారీగా క్యూలు నిలిచిపోతున్నాయి. గత మూడు రోజుల్లో ఏకంగా 2,282 విమానాలు రద్దయ్యాయని, 16,700 విమానాలు చాలా ఆలస్యంగా నడిచాయని అమెరికా విమానాల రాకపోకలను పరిశీలించే ఫ్లైట్ అవేర్ సంస్థ ప్రకటించింది. అధ్యక్షుడు ట్రంప్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సెనేట్ ఆమోదించకపోవడంతో 33 రోజులుగా 'ప్రభుత్వ ప్రతిష్టంభన' నెలకొంది. దీనితో ప్రభుత్వ ఉద్యోగులకు రెండో నెల కూడా వేతనాలు అందలేదు. దీనితో చాలా మంది అమెరికా ఫెడరల్ ఏవియేషన్ విధులకు డుమ్మా కొడుతున్నారు.

అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు చెనీ కన్నుమూత



వాషింగ్టన్, నవంబరు 4: అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు, రిపబ్లికన్ మాజీ నేత డిక్ చెనీ(84) కన్ను మూశారు. న్యుమోనియాతోపాటు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చెనీ.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు. జార్జ్ డబ్ల్యూ బుష్ హయాంలో ఉపాధ్యక్షుడిగా పనిచేసిన చెనీ.. బలమైన సంప్రదాయవాదిగా, అమెరికా చరిత్రలో శక్తివంతమైన ఉపాధ్యక్షుడిగా పేరు పొందారు. 9/11 ఉగ్రదాడులకు వ్యతిరేకంగా అమెరికా చేపట్టిన 'వార్ ఆఫ్ టెర్రర్'కు ప్రధాన రూపకర్తగా చెనీకి గుర్తింపు ఉంది. 2003లో ఇరాక్‌పై అమెరికా దాడులు చేయడంలోనూ చెనీదే కీలక పాత్ర. కాగా, అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై తీవ్ర విమర్శలు చేయడం ద్వారా డిక్ చెనీ మరోసారి వార్తల్లోకెక్కారు. దేశానికి ట్రంప్ అతిపెద్ద ముప్పు అని, ప్రజలు ఆయనను తిరస్కరించినా హింస ద్వారా అధికారంలో కొనసాగాలని చూశారని చెనీ ఆరోపించారు. దీంతో రిపబ్లికన్ పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు.

హిందూజా గ్రూప్ ఛైర్మన్ గోపీచంద్ కన్నుమూత



లండన్, నవంబరు 4: హిందూజా గ్రూపు ఛైర్మన్ గోపీచంద్ పి హిందూజా(85) మృతి చెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన లండన్‌లో చికిత్స పొందుతూ చనిపోయినట్లు గోపీచంద్ సన్నిహితులు తెలిపారు. వ్యాపార వర్గాల్లో జీపీగా పేరు గడించిన గోపీచంద్.. బ్రిటన్‌లోని అత్యంత సంపన్న కుటుంబానికి చెందినవారు. నలుగురు హిందూజా సోదరులలో రెండోవారైన గోపీచంద్ తన అన్న శ్రీచంద్ 2023లో చనిపోయిన తర్వాత హిందూజా గ్రూప్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 1959లో ముంబైలోని జైహింద్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ఆయన.. తర్వాత వ్యాపార రంగంలోకి ప్రవేశించారు. హిందూజా గ్రూపునకు చెందిన అశోక్ లేలాండ్ సంస్థ వాణిజ్య వాహనాల తయారీలో ప్రపంచంలోనే పేరుగాంచినది. గోపీచంద్ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సంతాపం ప్రకటించారు.

అగ్రవర్ణాల గుప్పిట్లో సైన్యం

▸ 10 శాతం ఉన్న వారే సైన్యాన్నీ నియంత్రిస్తున్నారు

▸ ఎన్నికల ప్రచారంలో రాహుల్ వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, నవంబరు 4 : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరో వివాదానికి తెర తీశారు. బిహార్‌లోని ఔరంగాబాద్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. దేశ జనాభాలో 10% ఉన్నవారి(అగ్రవర్ణాలు) గుప్పిట్లో సైన్యం ఉందని వ్యాఖ్యానించారు. వారికే కార్పొరేట్ రంగం, బ్యూరోక్రసీ, న్యాయ వ్యవస్థలో అవకాశాలు దక్కుతున్నాయని, ఆఖరికి సైన్యాన్ని కూడా వారే నియంత్రిస్తున్నారని వ్యాఖ్యానించారు. జనాభాలో 90 శాతం ఉన్న వెనుకబడిన వర్గాలు, దళితులు, షెడ్యూలు తెగలు, మైనారిటీలు వీటిలో ఎక్కడా కనిపించరని చెప్పారు. కుల గణనతోనే ఈ వాస్తవాలు వెలుగులోకి వస్తాయని రాహుల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ తొలిసారిగా సైన్యాన్ని ఉద్దేశించి కుల ప్రస్తావన తెస్తూ వ్యాఖ్యలు చేశారు. అయితే గతంలోనూ సైన్యంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. గత ఆగస్టు నెలలో అరుణాచల్‌ప్రదేశ్‌లో మన సైనికులను చైనా సైనికులు తరిమేసి 2000 చదరపు కి.మీ. భూభాగం ఆక్రమించారని వ్యాఖ్యానించి సుప్రీంకోర్టు నుంచి చీవాట్లు తిన్నారు. కాగా దేశ యువత రీల్స్ చేస్తూ కాలం గడిపేయాలని ప్రధాని మోదీ భావిస్తున్నారని బిహార్‌లోని ఔరంగాబాద్, గయాజిలలో నిర్వహించిన బహిరంగసభల్లో రాహుల్ వ్యాఖ్యానించారు. చదువు, ఉద్యోగాల గురించి యువత ప్రశ్నించకుండా వారు సోషల్ మీడియాలో మునిగిపోవాలని మోదీ కోరుకుంటున్నారన్నారు. మరో బహిరంగ సభలో మాట్లాడుతూ.. ప్రధానిది నకిలీ డిగ్రీ అని ఆరోపించారు.

రెండో దశలో 415 మంది నేరచరితులు

న్యూఢిల్లీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బిహార్ అసెంబ్లీ రెండో విడతలో పోటీ చేసేవారిలో 32% మంది నేరచరితులే. అభ్యర్థుల్లో 415 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. బిహార్ అసెంబ్లీకి రెండో దశలో 122 నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనుండగా అన్ని రాజకీయ పార్టీల నుంచి, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం కలిపి 1,302 మంది పోటీ చేస్తున్నారు. వీరిలో 1,297 మంది సమర్పించిన అఫిడవిట్లను ఏడీఆర్ విశ్లేషించి ఒక నివేదికను రూపొందించింది. మంగళవారం, విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం.. అభ్యర్థులలో 341(26%) మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులున్నాయి. హత్య కేసులు 19 మందిపై, హత్యాయత్నం కేసులు 79 మందిపై, మహిళలపై దాడులకు సంబంధించి 52 మందిపై కేసులు ఉన్నాయని ఏడీఆర్ నివేదిక వెల్లడించింది.

మొదలైన 'సర్' 2.0.

నిరసనగా కోల్‌కతాలో రోడ్డెక్కిన మమత

ఈసీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న తమిళనాడు, బెంగాల్, కేరళ



సర్‌ను వ్యతిరేకిస్తూ కోల్‌కతాలో మమత నేతృత్వంలో భారీ నిరసన ప్రదర్శన

న్యూఢిల్లీ, నవంబరు 4: దేశంలోని తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో (యూటీలు) ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) రెండో విడత కార్యక్రమం మంగళవారం మొదలైంది. ఇందులోభాగంగా నెలరోజులపాటు దాదాపు 51 కోట్లమంది ఓటర్లకు ఎన్యుమరేషన్ ప్రక్రియను ఈసీ అధికారులు చేపడతారు. ఈ ప్రక్రియలో భాగం అవుతున్న రాష్ట్రాల్లో తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళల్లోని అధికార పార్టీలు 'సర్'ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీంతో ఆ రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ వ్యతిరేకతల మధ్యనే ఈ ప్రక్రియను ఈసీ ప్రారంభించాల్సి వచ్చింది. 'సర్'ను వ్యతిరేకిస్తూ తమిళనాడులోని అధికార డీఎంకే పార్టీ సుప్రీంకోర్టును ఇప్పటికే ఆశ్రయించింది. డీఎంకే పిటిషన్ ఈ నెల 6 లేక 7 తేదీల్లో విచారణకు రానుంది. పశ్చిమ బెంగాల్‌లో 'సర్' ప్రక్రియపై టీఎంసీ అధినేత్రి, ఆ రాష్ట్ర సీఎం మమతాబెనర్జీ కోల్‌కతాలో రోడ్డెక్కారు. అర్హుడైన ఒక్క ఓటరు పేరును జాబితానుంచి తొలగించినా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని హెచ్చరించారు. దీనిని రాజకీయ ప్రేరేపిత సవరణ ప్రక్రియగా ఆమె దుయ్యబట్టారు. తన పార్టీ కార్యకర్తలతో కలిసి ఆమె మంగళవారం కోల్‌కతాలో 'సర్'కు వ్యతిరేకంగా భారీ నిరసన ప్రదర్శనను నిర్వహించారు. మైనారిటీలకు, వెనుకబడిన వర్గాలకు ఈ ప్రక్రియ వ్యతిరేకమైనదన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలనే ఈసీ ఎంచుకోవడం వెనుక ఉద్దేశాన్ని ఆమె ప్రశ్నించారు. చివరిగా 2002లో బెంగాల్‌లో 'సర్' కార్యక్రమం నిర్వహించారు. అప్పట్లో రెండేళ్లపాటు ఈ ప్రక్రియను సాగించిన ఈసీ ఈసారి కేవలం నెలరోజులకే పరిమితం చేయడం ఏంటని నిలదీశారు.

విమాన టికెట్ల రద్దుకు చార్జీలుండవ్!

▸ బుకింగ్ చేసిన 48 గంటల్లోపు రద్దు చేసుకుంటే మొత్తం రీఫండ్?

న్యూఢిల్లీ, నవంబరు 4: విమాన ప్రయాణికులకు శుభవార్త..! విమాన టికెట్ల రద్దు విషయంలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డీజీసీఏ తాజాగా ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసింది. దీని ప్రకారం ప్రయాణికులు బుక్ చేసుకున్న 48 గంటల్లోపు తమ టికెట్లను రద్దు చేసుకోవచ్చు లేదంటే తమ ప్లాన్‌ను సవరించుకోవచ్చు. ఇందుకు ఎలాంటి అదనపు చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. దీనికోసం టికెట్ బుక్ చేసుకున్న 48 గంటలపాటు విమానయాన సంస్థలు 'లుక్ ఇన్ ఆప్షన్'ను అందించాల్సి ఉంటుంది. ఐదు లేదా అంతకంటే ఎక్కువ రోజులు ముందుగా బుక్ చేసుకున్న దేశీయ విమానాలు, 15 లేదా అంతకంటే ఎక్కువ రోజులు ముందుగా బుక్ చేసుకున్న అంతర్జాతీయ విమానాలకు ఈ నిబంధన వర్తిస్తుంది' అని డీజీసీఏ ముసాయిదా మార్గదర్శకాల్లో తెలిపింది. వీటికి ఆమోదం లభిస్తే అత్యవసర పరిస్థితుల్లో తమ ప్లాన్‌ను మార్చుకోవాలనుకునే లేదా టికెట్లను రద్దు చేసుకోవాలనుకునే ప్రయాణికులకు ప్రయోజనం కలగనుంది. రద్దు చేసుకున్న టికెట్ల డబ్బుని విమానయాన సంస్థలు నిర్ణీత గడువులోగా చెల్లించాలని డీజీసీఏ సూచించింది. దీని ప్రకారం క్రెడిట్ కార్డుతో చెల్లించిన వారికి 7రోజుల్లోగా రిఫండ్ చెల్లించాలి. కౌంటర్లలో నగదు చెల్లించి టికెట్లు కొనుగోలు చేసిన వారికి వెంటనే రిఫండ్ చెల్లించాలి. ట్రావెల్ ఏజెంట్ లేదా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా టికెట్ కొనుగోలు చేసిన వారికి 21 పని దినాల్లోగా చెల్లించాలి.

రెండో పెళ్లిని రిజిస్టర్ చేసే ముందు మొదటి భార్య వాదన వినండి

▸ ముస్లిం వివాహాలపై కేరళ హైకోర్టు సూచన

కోచి, నవంబరు 4: ముస్లిం పురుషులు మొదటి భార్య ఉండగానే రెండో వివాహం చేసుకోవాలని భావించినప్పుడు అనుసరించాల్సిన విధానంపై కేరళ హైకోర్టు స్పష్టత ఇచ్చింది. రెండో వివాహాన్ని రిజిస్టర్ చేయడానికి ముందు మొదటి భార్య వాదనను తప్పకుండా వినాలని సూచించింది. మొదటి భార్యతో వివాహ బంధాన్ని కొనసాగిస్తుంటే ఆమె అభిప్రాయాన్ని తప్పకుండా తెలుసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. మొదటి భార్య బతికి ఉండగా ఆమెకు తెలియకుండా వేరే మహిళతో సంబంధం పెట్టుకోవడాన్ని ఖురాన్‌గానీ, ముస్లిం చట్టాలుగానీ అనుమతిస్తాయని అనుకోవడం లేదని న్యాయమూర్తి జస్టిస్ పి.వి.కున్హికృష్ణన్ అన్నారు. ముస్లిం పర్సనల్ చట్టం ప్రకారం పురుషుడు రెండో వివాహాన్ని చేసుకోవచ్చని, దాన్ని రిజిస్టర్ చేసుకోవాలంటే మాత్రం రాజ్యాంగపర చట్టాలను అనుసరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుత కేసులో ఓ వివాహితుడు మరో మహిళను పెళ్లి చేసుకున్నాడు. రెండో వివాహాన్ని రిజిస్టర్ చేయాలని స్థానిక అధికారులను కోరగా, మొదటి భార్య సమ్మతిలేదంటూ ఆ వినతిని తిరస్కరించారు.

ప్రియుడిపై దాడి చేసి యువతిపై గ్యాంగ్ రేప్

▸ కోయంబత్తూరులో దారుణం.. ముగ్గురు నిందితుల అరెస్టు

▸ తప్పించుకోబోయిన దుండగుల కాళ్లపై పోలీసుల కాల్పులు

కోయంబత్తూరు, నవంబరు 4: ప్రేమికుడితో కలిసి కారులో ఉన్న ఓ యువతిపై ముగ్గురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ప్రియుడిపై దాడి చేసి ఆమెను ముళ్ల పొదల మాటుకు ఈడ్చుకెళ్లి అఘాయిత్యం చేశారు. తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన ఈ దారుణ ఘటనలో నిందితులను పోలీసులు ఒక్కరోజులోనే అరెస్టు చేశారు. పారిపోవడానికి ప్రయత్నించిన నిందితుల కాళ్లపై కాల్పులు జరిపి అదుపులోకి తీసుకున్నారు. కోయంబత్తూరుకు చెందిన 23 ఏళ్ల యువకుడు, డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 21 ఏళ్ల యువతి గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఆదివారం రాత్రి 11 గంటలకు కోయంబత్తూరు ఎయిర్‌పోర్ట్ వెనుకవైపునకు వీరిద్దరూ కారులో షికారుకు వెళ్లారు. మద్యం మత్తులో మోటారుసైకిల్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు.. కారు అద్దాన్ని పగులగొట్టి యువకుడిపై తీవ్రంగా దాడి చేశారు. అతను స్పృహ తప్పాక, ఆ యువతిని పక్కనే ఉన్న ముళ్లపొదల్లోకి ఈడ్చుకెళ్లి సామూహిక అత్యాచారం చేసి పారిపోయారు. సోమవారం ఉదయానికి స్పృహలోకి వచ్చిన ఆ యువకుడు మొబైల్ ఫోన్‌తో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 5 గంటలపాటు గాలించగా.. ముళ్ల పొదల్లో స్పృహలేకుండా నగ్నంగా పడిఉన్న యువతిని గుర్తించారు. శరీరమంతా దాడికి గురైన గాయాలతో పాటు ముళ్లు గుచ్చుకుని రక్తమోడుతున్న ఆమెను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ముగ్గురు నిందితులను వెల్లకినార్‌లో అదుపులోకి తీసుకున్నారు. నిందితులను కురుప్పసామీ అలియాస్ సతీశ్ (30), అతని సోదరుడు కాళీశ్వరన్ అలియాస్ కార్తీక్ (21), వీరి దూరపు బంధువు గుణ అలియాస్ థవసి (20)గా గుర్తించామని పోలీసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి టెన్నిస్‌లో భాష్యం విద్యార్థిని సత్తా


జోషితను అభినందిస్తున్న జడ్‌ఈవో శివ తదితరులు

గుంటూరు(విద్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీల్లో భాష్యం విద్యార్థిని గోలి జోషిత బంగారు పతకం సాధించినట్టు సంస్థ ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఈ నెల 1, 2, 3 తేదీల్లో శ్రీకాళహస్తిలో నిర్వహించిన 69వ ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఆమె ఉత్తమ ప్రతిభ చూపినట్టు మంగళవారం ఒక ప్రకటనలో వివరించారు. వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 15 వరకు ఢిల్లీలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ టీమ్‌కు కెప్టెన్‌గా జోషిత ఎంపికైనట్టు వెల్లడించారు. జోషితను వైస్ ఛైర్మన్ హనుమంతరావు, డైరెక్టర్ సాకేత్ రామ్, జడ్‌ఈఓ శివ, ప్రిన్సిపాల్ కిషోర్ తదితరులు అభినందించారు.

9న బీసీ సంఘం విస్తృత సమావేశం: కేసన

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 9న ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. గుంటూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా జనగణనతో పాటే సమగ్ర కుల గణనను శాస్త్రీయంగా నిర్వహించి, ఆపై జనాబా దామాషా మేరకు బీసీల రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని కోరారు.

విద్యార్థినులతో కాళ్లు పట్టించుకున్న హెచ్‌ఎం సస్పెన్షన్


విద్యార్థినులతో కాళ్లు పట్టించుకుంటున్న ప్రధానోపాధ్యాయురాలు

మెళియాపుట్టి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులతో కాళ్లు పట్టించుకున్న ప్రధానోపాధ్యాయురాలిని అధికారులు సస్పెండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం బందపల్లి ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం వై.సుజాత ఫోన్‌లో మాట్లాడుతూ కొంత మంది విద్యార్థినులతో తరచూ కాళ్లు పట్టించుకుంటూ ఉండేవారు. అంతేకాకుండా కాళ్లు కుర్చీలో పెట్టుకుని మొబైల్ ఫోన్ చూస్తుండేవారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మంగళవారం ఆమెను సస్పెండ్ చేసినట్టు సీతంపేట ఐటీడీఏ పీవో పవర్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. కొన్ని రోజులు క్రితమే ఈ పాఠశాలలో తరచూ గొడవలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు రావడంతో డీడీ అన్నదొర విచారణ జరిపారు. సుజాతపై ఓ రిపోర్టును ఉన్నతాధికారులకు పంపారు. దీంతో గత నెల 24న ఆమెకు చార్జి మెమో ఇచ్చారు. ఇంతలో కాళ్లు పట్టించుకుంటున్న వీడియో వైరల్ కావటంతో మంగళవారం ఆమెను సస్పెండ్ చేశారు. టెక్కలి ఆర్డీవోతో పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తున్నట్టు ఐటీడీఏ పీవో తెలిపారు.

వరిని మింగిన 'మొంథా'

అత్యధికంగా నేలకొరిగిన వరి పైరు

1,29,635 హెక్టార్లలో రైతన్నలకు దెబ్బ


పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురంలో నేలకొరిగిన వరి (ఫైల్ ఫొటో)

ఎన్యూమరేషన్ ఇలా..

- 24 జిల్లాలు
- 396 మండలాలు
- 3,855 గ్రామాలు
- 4,92,611 వ్యవసాయ క్షేత్రాలు

పంటల వారీగా నష్టం(హెక్టార్లలో)

వరి	1,29,635
పత్తి	14,284
మొక్కజొన్న	6,555
మినుము	5,196
సజ్జ	1,413
వేరుశనగ	364
కంది	163
ఇతర పంటలు	331

- తర్వాతి స్థానంలో పత్తి.. మొక్కజొన్న
- మరింతగా పెరిగిన నష్టం అంచనాలు
- మొత్తంగా 1,57,941 హెక్టార్లలో నష్టం
- తుఫాను బాధిత రైతులు 3,10,784 మంది

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంట నష్టం అంచనా మంగళవారానికి మరింత పెరిగింది. మొంథా తుఫాన్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా 1,38,391 హెక్టార్లలో పంటలు నీట మునిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేయగా, ఆరు రోజుల ఎన్యూమరేషన్‌లో ఈ నష్టం 1,57,941 హెక్టార్లకు పెరిగినట్టు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. మొత్తంగా 3,10,784 మంది రైతులు నష్టపోయినట్లు నిర్ధారించామన్నారు. కాగా, వరి పండించిన రైతులకే ఎక్కువగా నష్టం జరిగిందని 1,29,635 హెక్టార్లలో వరి నీట మునిగడం, వాలిపోవడం వంటివి జరిగాయన్నారు. తర్వాతి స్థానాల్లో పత్తి, మొక్కజొన్న పంటలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాల వారీగా కోనసీమలో 29,554, కృష్ణాలో 27,613, కాకినాడలో 21,301, తూర్పుగోదావరిలో 14,990, ప్రకాశంలో 12,347, బాపట్లలో 11,772, నంద్యాలలో 11,454, పశ్చిమగోదావరిలో 8,861, ఏలూరులో 5,559, ఎన్టీఆర్ జిల్లాలో 4,900, గుంటూరులో 2,059, కడపలో 1,756, పల్నాడులో 1,719, శ్రీకాకుళం జిల్లాలో 1,428 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు వివరించారు. పంట నష్టపోయిన రైతుల జాబితాలపై అభ్యంతరాలు, విజ్ఞప్తులను రైతు సేవా కేంద్రాల్లో స్వీకరిస్తున్నట్టు తెలిపారు.

సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్కేంద్రంలో మొరాయించిన ఇన్‌టేక్ వాటర్ గేట్

- 4 రోజులుగా ఆగిన విద్యుదుత్పత్తి
- కొనసాగుతున్న ఇంజనీర్ల మరమ్మతులు


విద్యుత్ ప్రాజెక్టులో మరమ్మతులు చేస్తున్న సాంకేతిక నిపుణులు

రెంటచింతల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సత్రశాలలో కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన ఇన్‌టేక్ వాటర్ గేట్ మొరాయించింది. నాలుగు రోజులుగా విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. ఒక యూనిట్ ద్వారానే ఉత్పాదన జరుగుతోంది. ఇంజనీర్లు శ్రమిస్తున్నా మరమ్మతులు ఇంకా కొలిక్కి రాలేదు. మంగళవారం రాత్రి కూడా పనులు కొనసాగాయి. స్టాప్ లాక్ గేట్ అమర్చడానికి నెల్లూరు నుంచి వచ్చిన వాటర్ డైవింగ్ బృందం శ్రమిస్తూనే ఉంది. గేట్ మొరాయించడంతో డ్యాం మీద రాకపోకలు నిలిచిపోయాయి. వాటర్‌గేట్ పనిచేయని విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, విద్యుత్ మంత్రి కూడా అయిన గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌లో చెప్పారు. విద్యుదుత్పత్తికి సానుకూల పరిస్థితులున్న తరుణంలో గేట్ పనిచేయకపోవడం బాధాకరమన్నారు.

'కొల్లేరు' నిర్వహణ అథారిటీ ఏర్పాటు

- సమన్వయంతో నిబంధనల అమలుకు నిర్దేశం

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సిఫారసు మేరకు ప్రభుత్వం కొల్లేరు సరస్సు నిర్వహణకు అథారిటీని ఏర్పాటు చేసింది. కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్యం నిర్వహణ, చిత్తడి నేలల స్థిరమైన నిర్వహణ దీని లక్ష్యం. ఇందులో అన్ని కీలక విభాగాలకూ ప్రాతినిధ్యం కల్పిస్తూ అటవీశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అథారిటీ చైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైస్‌చైర్మన్‌గా అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సభ్యులుగా రెవెన్యూ, మత్స్య, వ్యవసాయ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, జలవనరులశాఖ కార్యదర్శులతో పాటు అటవీ ముఖ్య దళాధికారి, వన్యప్రాణి విభాగం ముఖ్య వార్డెన్, వ్యవసాయ, మత్స్య, పంచాయతీరాజ్, పర్యాటక శాఖల డైరెక్టర్లు, పీసీబీ, ఇతర అధికారులతో కలిపి 26 మందితో అథారిటీని నియమించారు. ఈ అథారిటీ సమన్వయంతో పని చేస్తూ, కనీసం మూడు నెలలకోసారి సమావేశమై, సరస్సు పరిరక్షణపై సమీక్షించాలని నిర్దేశించారు. భవిష్యత్ ప్రయోజనాల కోసం దీర్ఘకాలిక వ్యూహాన్ని తయారు చేయడం, రామ్‌సర్ సైట్ కోసం సమగ్ర నిర్వహణ ప్రణాళికల తయారీ, ప్రభుత్వ విభాగాలతో పాటు సరస్సు చుట్టూ నివసిస్తున్న వారి సహకారంతో బహుళ క్రమశిక్షణ కార్యకలాపాల అమలు వంటివి ఈ నిబంధనల్లో ఉన్నాయి.

గిరిజన శాస్త్రవేత్తపై వేధింపుల పర్వం

- విచారణ పేరుతో కమిటీ సభ్యుల దూషణలు
- వీసీపై ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి
- గుండెపోటుతో ఆస్పత్రి పాలైన ప్రొఫెసర్ శ్యాంరాజ్
- ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీలో అరాచకం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రొఫెసర్ శ్యాంరాజ్

గుంటూరు సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'నువ్వో జోకర్‌వి... అయినా నువ్వు తెలుగు మీడియం... నీకు అసలు ఇంగ్లిష్ రాదు కదా? మరి ఇంగ్లిష్‌లో ఎలా ఫిర్యాదు తయారు చేశావ్..? నువ్వేమైనా దేశోద్ధారకుడివా? వీసీపై ఫిర్యాదు చేసి చాలా తప్పు చేశావు. వెంటనే ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలి. లేకపోతే నీ బతుకు రోడ్డుపాలే'... ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న గిరిజన ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్తకు విచారణ పేరుతో ఎదురైన వేధింపులు ఇవీ. పత్రికల్లో రాయడానికి వీలులేని పదాలతో విచారణ పేరుతో తోటి ప్రొఫెసర్లు దూషించడంతో తీవ్ర మానసిక వేదన చెందిన బాధితుడు గుండెపోటుతో ఆస్పత్రి పాలయ్యారు. సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని, వాటిపై విచారణ నిర్వహించాలని అక్కడ పని చేస్తున్న ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ శ్యాంరాజ్ ఆగస్టు 30న గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. గత రెండేళ్లుగా ఫైనాన్స్ కమిటీని ఏర్పాటు చేయకుండానే రూ.వందల కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నారని, బదిలీలు, పదోన్నతులకు భారీగా నగదు వసూలు చేస్తున్నారని, తన బదిలీకి కూడా డబ్బులు డిమాండ్ చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వీసీపై విచారణకు గవర్నర్ కార్యాలయం ఇన్‌చార్జి ఆదేశించడంతో సెప్టెంబరు 21న వ్యవసాయ శాఖ ఎక్స్‌అఫిషియో కార్యదర్శి విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ శాఖ డైరెక్టర్‌ను కమిటీ అధ్యక్షుడిగా నియమించారు. ఇంతలో సదరు డైరెక్టర్ బదిలీ కావటంతో విచారణ ముందుకు సాగలేదు. ఈలోగా ఇన్‌చార్జి వీసీపై విచారణ జరిపించాలని అక్టోబరు 21న సీఎంవో నుంచి లేఖ రావడంతో వ్యవసాయ శాఖ మరో కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వీసీపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించడం వివాదంగా మారింది. వ్యవసాయ శాఖ ఎక్స్‌అఫిషియో కార్యదర్శి ఇచ్చిన ఆదేశాల ఆధారంగానే వీసీపై ఫిర్యాదు చేసిన శ్యాంరాజ్‌ను విచారించేందుకు ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ముందు హాజరు కావాలని ఆయనకు అక్టోబరు 31న వీసీ నోటీసులు జారీ చేశారు. విచారణ ఈ నెల 3న విచారణ జరగ్గా.. ముగ్గురు సభ్యుల బృందం ఫిర్యాదుదారుడిని మాటలతో తూలనాడటంతో పాటు ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని ఒత్తిడికి గురిచేసినట్టు తెలిసింది. కమిటీ సభ్యుల వేధింపులతో తాను తీవ్ర అనారోగ్యానికి లోనయ్యానంటూ గవర్నర్‌కు బాధితుడు మరో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం గుంటూరులోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్యాంరాజ్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

సీఎంవోకు శాస్త్రవేత్తల ఫిర్యాదు

వ్యవసాయ వర్సిటీ పరిధిలోని శాస్త్రవేత్తలు, ముఖ్య అధికారులు మంగళవారం ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లారు. విచారణ పేరుతో గిరిజన శాస్త్రవేత్తను వేధిస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇప్పటికే వర్సిటీ పరువు, ప్రతిష్ఠలు గంగపాలయ్యాయని ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సీఎంవో అధికారులను కోరినట్లు తెలిసింది.

సీఐ నిత్యబాబు నెట్టివేయడంతో కిందపడిన మహిళ



చిత్తూరు తాలుకా సీఐ దాష్టీకం

- సీతమ్స్ కాలేజీలో విద్యార్థి ఆత్మహత్య
- చూసేందుకు వెళ్లిన బంధువులను తోసేసిన సీఐ
- సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

చిత్తూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు తాలుకా సీఐ నిత్యబాబు ఓ మహిళను తోసేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. చిత్తూరు నగరంలోని సీతమ్స్ కాలేజీలో మంగళవారం రుద్ర అనే బీటెక్ స్టూడెంట్ ప్రేమ విఫలమైందన్న బాధతో మూడో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ విద్యార్థి తల్లి, బంధువులు ఈ విషయం తెలుసుకుని కాలేజీ వద్దకు చేరుకున్నారు. కాలేజీ యాజమాన్యాన్ని అడగడానికి లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారు. గేటు వద్ద ఉన్న సీఐ నిత్యబాబు వారిని అడ్డుకున్నారు. రుద్ర పిన్ని లోపలికి వెళ్లే ప్రయత్నం చేయగా, ఆమెను తోసివేయడంతో ఒక్కసారిగా మెట్లపై నుంచి కింద పడిపోయింది. బిడ్డ చనిపోయిన బాధలో వెళ్లిన ఆమెకు సాంత్వన ఇవ్వకపోగా, నిర్దాక్షిణంగా ప్రవర్తించిన సీఐ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ చిత్తూరు మేయర్ అముద పట్ల ఓ కార్యక్రమంలో సీఐ దురుసుగా ప్రవర్తించిన విషయాన్ని చిత్తూరు వాసులు గుర్తు చేసుకుంటున్నారు.

సత్యసాయి శత జయంతికి 200 ప్రత్యేక బస్సులు

- ప్రైవేటు వాహనాల దోపిడీ నుంచి భక్తులను కాపాడతాం: ఆర్టీసీ ఎండీ

పుట్టపర్తి టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి వేడుకలకు రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఎస్ ఆర్టీసీ 200 ప్రత్యేక బస్సులు నడుపుతుందని ఆ సంస్థ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి మంగళవారం వచ్చిన ఆయన, ప్రశాంతి నిలయంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ప్రతినిధులతో శత జయంతి ఏర్పాట్ల గురించి చర్చించారు. పుట్టపర్తి ఆర్టీసీ డిపో, బస్టాండును అధికారులతో కలిసి పరిశీలించారు. డిపోలో ఆయన మాట్లాడారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం పుట్టపర్తి రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. బస్సుల పార్కింగ్ కోసం ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రైవేటు వాహనాల దోపిడీ నుంచి భక్తులను కాపాడుతామని అన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రోదసీలో ఆత్మనిర్భరత

ఇస్రో చరిత్రలో అత్యంత బరువైన నాలుగువేల నాలుగు వందల పదికిలోల కమ్యూనికేషన్ శాటిలైట్ నిర్దేశిత కక్ష్యలోకి దిగ్విజయంగా ప్రవేశించింది. భారత నౌకాదళ సమాచార అవసరాలు తీర్చడానికి ఉద్దేశించిన ఈ అత్యాధునిక ఉపగ్రహాన్ని జియో సింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి ప్రవేశపెట్టడానికి ఎప్పటిలాగానే బాహుబలి రాకెట్ వాహనమైంది. చంద్రయాన్ 3లో వాడిన లాంచ్ వెహికల్ మార్క్–3ని సాంకేతికంగా మరిన్ని మెరుగులు దిద్ది, శక్తిని సైతం మరో పదిశాతం పెంచి ఈమారు వినియోగించారు. నలభైమూడున్నర మీటర్ల ఎత్తున్న ఈ వాహక నౌకకు ఇది ఐదో ప్రయాణం. రాబోయే రోజుల్లో మానవసహిత అంతరిక్ష యాత్రలకు ఈ రాకెట్‌నే వాడబోతున్నందున ఈ ప్రయోగం అనేక కారణాల రీత్యా కీలకమైనది. అత్యంత బరువైన ఉపగ్రహాల ప్రయోగానికి ఇతరదేశాల ప్రైవేటు సంస్థలపై ఆధారపడుతున్న నేపథ్యంలో ఈ ఆత్మనిర్భరత ప్రశంసనీయమైనది.

పన్నెండేళ్ళక్రితం ఫ్రెంచ్ గయానానుంచి ప్రయోగించిన జీశాట్ 7 కాలపరిమితి ముగియడంతో దానిస్థానంలో మరింత ఆధునికమైన, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ కొత్త ఉపగ్రహం వచ్చి చేరింది. మరో పదేళ్ళపాటు సువిశాల భారతీయ తీరప్రాంతాన్ని కాపలాకాయడంలో మన నౌకాదళానికి తన సమర్థవంతమైన, వేగవంతమైన సేవలతో సహకరించబోతోంది. భారీ ఉపగ్రహాన్ని భద్రంగా దాచుకున్న ఓ అతిభారీ రాకెట్ శ్రీహరికోట సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ నుంచి నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకుపోయిన ఈ దృశ్యాలు చూసినవారికి 1960లలో మన శాస్త్రవేత్తలు సైకిల్ మీద ఒక రాకెట్ విడిభాగాన్ని మోసుకుపోతున్న అలనాటి బ్లాక్ అండ్ వైట్ చిత్రం గుర్తుకు వచ్చేవుంటుంది. 1963లో తిరువనంతపురం సమీపంలోని తుంబా ప్రయోగక్షేత్రం నుంచి ఏడువందల పదమూడు కేజీల బరువున్న రాకెట్ ఓ ముప్ఫైకేజీల పేలోడ్‌ని రెండువందల ఏడు కిలోమీటర్ల ఎత్తు వరకూ మోసుకుపోవడంతో ఈ ప్రయాణం ఆరంభమైంది. చిన్నచిన్న అడుగులతో ప్రస్థానం కొనసాగి జీఎస్ఎల్వీవంటి భారీ రాకెట్‌తో, తరువాత దానిని సైతం పలు రీతుల్లో ఆధునికీకరించుకుంటూ దేశం చేసిన సాహసాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

ఎడ్లబండి మీద ఉపగ్రహాన్ని తీసుకుపోయిన కాలంనుంచి అంతరిక్షకేంద్రం నిర్మాణానికి నడుంబిగించడం వరకూ సాగిన 'ఇస్రో' ప్రస్థానం మనసు పులకింపచేస్తుంది. బడ్జెట్ కేటాయింపుల్లో పాలకులు ప్రదర్శించే కాపీనాన్నీ తట్టుకొని నిలిచి, తనకు ఇచ్చినదానితోనే అనేకానేక ప్రయోగాలు చేసింది. ఆంగ్లచిత్రాలకంటే తక్కువ ఖర్చుతో అంతరిక్షయాత్రలు చేసివస్తోంది. గగనయానాలు, చంద్రయానాలు, సూర్యనమస్కారాలు, అంగారక అధ్యయనాలతో ప్రపంచాన్ని ఆశ్చర్య పరుస్తోంది. ఒకేమారు వంద ఉపగ్రహాలను విభిన్నమైన కక్ష్యల్లోకి వెదజల్లగలిగే సమర్థతను పెంచుకుంది. శతాధిక రాకెట్ ప్రయోగాలతో ఐదువందల యాభై ఉపగ్రహాలను నింగికి చేర్చింది. విదేశీ ఉపగ్రహ ప్రయోగ వ్యాపారం చేస్తూ దేశానికి సంపాదించిపెడుతోంది. అంతరిక్షంలో రెండుఉపగ్రహాలను అనుసంధానించి, మళ్ళీ విడదీసిన స్పేడెక్స్ ప్రయోగం సాంకేతిక అద్భుతమే కాదు, అంతరిక్ష కేంద్రం నిర్మాణం కలను సాకారం చేయడంలో మరో అడుగు. నేడు అగ్రరాజ్యాల సరసన దేశం తలెత్తుకొని నిలబడటంలో సోవియట్ యూనియన్ సహకారం విస్మరించలేనిది. తదనంతరం ఆ సహకారానికీ, పరిజ్ఞానం బదలాయింపుకీ అడ్డుపడిన అమెరికా మనను పెట్టిన కష్టాలు ఎప్పటికీ విస్మరించలేనివి.


భారతదేశం నుంచి రోదసీలోకి వెళ్ళబోతున్న గగన్‌యాన్ వ్యోమగాములు నలుగురిని ప్రధాని మోదీ గత ఏడాది దేశానికి పరిచయం చేస్తూ, నలభైయేళ్ళ తరువాత భారతీయులు అంతరిక్షంలోకి వెడుతున్నారు అని ఓ మాటన్నారు. మంచి గతాన్ని స్మరించడం మోదీకి ఇష్టం ఉండదు కానీ, ప్రజలకు మాత్రం రాకేశ్ శర్మ అంతరిక్షయానం, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రశ్నకు 'సారే జహాఁసే అచ్ఛా' అంటూ అతడిచ్చిన సమాధానం గుర్తుకొచ్చాయి. నలుగురు వీరులను అంతరిక్ష యాత్రకు సిద్ధం చేసే క్రమంలో మొన్న జూన్‌లో శుభాంశు శుక్లా రోదసిలో కాలూనిన రెండవ భారతీయుడుగా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో అడుగిడిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించాడు. 'నాసా'కు ఆరువందలకోట్లు చెల్లించి మరీ ఈ యాక్సియం4 యాత్రలో పాలుపంచుకున్న శుక్లాకు లభించిన అనుభవం, నైపుణ్యం భారత భవిష్యత్ అంతరిక్ష యాత్రలకు ఉపకరిస్తుంది. మరో పదేళ్ళలో సొంత అంతరిక్ష కేంద్రం కట్టుకోవాలని, మరో పన్నెండేళ్ళకు చంద్రుడిమీద మన వ్యోమగాములు కాలూనాలని లక్ష్యాలు పెట్టుకొని దేశాన్ని స్పేస్ సూపర్‌పవర్‌గా తీర్చిదిద్దుతున్నందుకు ఇస్రోను అభినందించాలి.

క్వాంటమ్ వ్యాలీ ఓ గేమ్ చేంజర్

దేశంలోనే మొట్టమొదటి క్వాంటమ్ వ్యాలీని అమరావతిలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం గేమ్ చేంజర్‌గా చరిత్ర సృష్టించనుంది. ఈ క్వాంటమ్ వ్యాలీ అందుబాటులోకి వస్తే టెక్నాలజీ రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు జరిగే అవకాశం ఉంది. మన దేశ సైబర్ సెక్యూరిటీ వ్యవస్థ ఎవరూ ఛేదించలేనంత పటిష్ఠంగా మారుతుంది. వైద్యరంగంలో నయం కాని ఎన్నో రోగాలకు వ్యాక్సీన్లు, మందులు అందుబాటులోకి వస్తాయి. వాతావరణంలోని మార్పులను, ప్రకృతి వైపరీత్యాలను కూడా ముందే పసిగట్టడంతో పాటు దేశరక్షణ కోసం శక్తిమంతమైన ఆయుధాలనూ అభివృద్ధి చేయవచ్చు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1990–2000 దశాబ్దంలో ఐటీ సెక్టార్ ఎవరూ ఊహించలేనంత అభివృద్ధిని అందుకుంది. ప్రస్తుతం క్వాంటమ్ ఇండస్ట్రీలో కూడా ఆ అభివృద్ధిని తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. దీనికోసం అమరావతిలోని 50 ఎకరాలలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు ఇప్పటికే భూమిని కేటాయించారు. ఈ వ్యాలీని ముందుకు నడిపించేది క్వాంటమ్ కంప్యూటర్. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు కలిసి త్వరలో భారతదేశ చరిత్రలోనే అత్యంత శక్తిమంతమైన క్వాంటమ్ కంప్యూటర్‌ను తయారు చేయబోతున్నాయి. క్వాంటమ్ సిస్టమ్–2గా భావిస్తున్న ఈ కంప్యూటర్ 156 క్యూబిట్ల సామర్థ్యం ఉండే హెరాన్ ప్రాసెసర్ ద్వారా పనిచేస్తుంది.

2025–26 విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్, సంప్రదాయ డిగ్రీ కళాశాలల్లో క్వాంటమ్ టెక్నాలజీస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో మైనర్ ప్రోగ్రామ్‌లను ప్రవేశపెడుతూ సమగ్ర పాఠ్య ప్రణాళికను ఉన్నత విద్యామండలి రూపొందించింది. దీని కోసం నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (NEP), 2020తో పాటు 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్' (AICTE) మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దిష్టమైన పాఠ్య ప్రణాళికా చట్రాన్ని ప్రత్యేక నిపుణుల కమిటీ రూపొందిస్తుంది. దాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో... విశ్వవిద్యాలయాలు, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలకు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశాం. క్వాంటమ్ టెక్నాలజీని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు వీలుగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాం. క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాథమిక అంశాలను, వాటి బోధనా ప్రాముఖ్యంపై విద్యార్థులకు మరింత అవగాహన కల్పించేందుకు వీలుగా 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్–2025' కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం.



కంప్యూటర్ నిర్మాణంతోపాటు, డేటా సెంటర్లు, రిసెర్చ్ ఇంక్యుబేటర్లు, టెక్ పార్కులను ప్రభుత్వం నిర్మించనుంది. అమెరికా, చైనా వంటి దేశాలకు దీటుగా మన అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేయనుండడం సీఎం చంద్రబాబు మార్క్ పాలనకు ప్రతీక.

క్వాంటమ్ కంప్యూటర్ అసాధ్యం అనుకున్న ప్రాజెక్టులను కూడా సుసాధ్యం చేయగలదు. ఇది చూపించే పరిష్కారాలతో కొత్త వ్యాక్సీన్లు, ఔషధాలను కనుగొనేందుకు వీలవుతుంది. రాబోయే ప్రకృతి విపత్తులను వంద శాతం కచ్చితత్వంతో అంచనా వేయగలదు. స్టాక్ మార్కెట్‌లో రిస్క్‌ను తగ్గించడం, ఏఐ వంటి కొత్త టెక్నాలజీని తయారు చేయడం, రవాణాలో ఖర్చు తక్కువయ్యే మార్గాలను కనుగొనడంలో ఇది సహాయపడగలదు. సైబర్ సెక్యూరిటీ, కమ్యూనికేషన్, రక్షణ రంగం, క్రిప్టోగ్రఫీ.. ఇలా ఎన్నో రంగాల్లో క్వాంటమ్ టెక్నాలజీ విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదు.

ప్రస్తుతం అమెరికా, చైనా, ఫ్రాన్స్, కెనడా, ఫిన్లాండ్ వంటి అతికొద్ది దేశాలు మాత్రమే క్వాంటమ్ టెక్నాలజీపై పనిచేస్తున్నాయి. ఈ టెక్నాలజీతో ప్రపంచ దేశాలను తనవైపు తిప్పుకునే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. దీనికోసం చేపట్టిన 'నేషనల్ క్వాంటమ్ మిషన్'లో భాగంగా అమరావతిలో నిర్మించబోయే క్వాంటమ్ వ్యాలీ 2026 జనవరి 1 నాటికి అందుబాటులోకి రానుంది. కంప్యూటర్ నిర్మాణంతోపాటు, డేటా సెంటర్లు, రిసెర్చ్ ఇంక్యుబేటర్లు, టెక్ పార్కులను ప్రభుత్వం నిర్మించనుంది. అమెరికా, చైనా వంటి దేశాలకు దీటుగా మన అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేయనుండడం సీఎం చంద్రబాబు మార్క్ పాలనకు ప్రతీక.

క్వాంటమ్ వ్యాలీతో అద్భుతాలు ఆవిష్కృతమవుతాయి. క్వాంటమ్ కంప్యూటర్‌లోని అసాధారణ కంప్యూటింగ్ పవర్ ప్రపంచంలోని ఎంతటి క్లిష్టమైన సమస్యనైనా పరిష్కరించగలదు. ప్రస్తుతం మన దగ్గరున్న గొప్ప సూపర్ కంప్యూటర్ అయినా సరే ఒక సమస్య వచ్చిందంటే.. దాన్ని పరిష్కరించడానికి ఒక్కో సమాధానాన్ని ఒకదాని తర్వాత ఒకటి సరిచూసుకుంటూ వెళ్తుంది. దీనికి చాలా సమయం పడుతుంది. కానీ, క్వాంటమ్ కంప్యూటర్స్ మాత్రం దాని క్వాంటమ్ సెర్చ్‌లో సరైన సమాధానం కోసం కోటానుకోట్ల మార్గాలను ఒకేసారి అన్వేషించి వాటిలో నుంచి సరైన సమాధానాన్ని పసిగడుతుంది. ఉదాహరణకు ఒక బలమైన పాస్‌వర్డ్‌ను క్రాక్ చేయడానికి ఇప్పుడున్న సూపర్ కంప్యూటర్లకు కొన్ని సంవత్సరాలు పడితే.. క్వాంటమ్ కంప్యూటర్ మాత్రం దానికి ఉన్న ప్రాసెసింగ్ స్పీడ్‌తో ఈ పాస్‌వర్డ్‌ను కేవలం ఏడు సెకన్లలోనే క్రాక్ చేస్తుంది. ఇది ప్రపంచంలోని ఎంత స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌నైనా సరే కొన్ని సెకన్లలోనే క్రాక్ చేయగలదు. కానీ, ఇది సృష్టించే ఎన్‌క్రిప్షన్‌ను బ్రేక్ చేయాలంటే మాత్రం శత్రుదేశ హ్యాకర్లకు ఒక జీవితకాలం సరిపోదు. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన క్వాంటమ్ టెక్నాలజీని అందిపుచ్చుకుని.. విద్యా ప్రగతిని సాధించడానికి వర్తమాన అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నాను.

● ప్రొ. కొత్త మధుమూర్తి
ఏపీ ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

జేపీ, లోహియా ప్రభావం కోల్పోని బిహార్



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

ఒకరు తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని అక్బర్‌పూర్‌కు చెందిన బనియా. మరొకరు తూర్పు ఉత్తరప్రదేశ్, బిహార్‌ల మధ్య ఉండే సితాబ్దియారాకు చెందిన కాయస్తుడు. ఇద్దరూ 20వ శతాబ్ది ప్రథమార్థంలో విదేశాలకు వెళ్లి చదువుకున్నారు. తిరిగి వచ్చి కాంగ్రెస్ గొడుగు క్రింద స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ శిష్యులుగా కాంగ్రెస్‌లోని సోషలిస్టు శిబిరంలో కొనసాగారు. ఇరువురూ తర్వాత నెహ్రూకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ఒకరు రామ్ మనోహర్ లోహియా, మరొకరు జయప్రకాశ్ నారాయణ్.

లోహియా జర్మనీలో చదువుకున్నారు. అమెరికాలోనూ, యూరప్‌లోనూ జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు. వెనుకబడిన వర్గాలకు రాజకీయ అధికారం, పాలనలో 60 శాతం వాటా కావాలని ఆయన అప్పుడే ప్రతిపాదించారు. పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకించారు. మార్క్సిజమూ ఆయనకు నచ్చలేదు. దేశీయ సోషలిజాన్ని అన్వయించుకుని సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం పోరాడారు. ప్రభుత్వాలు ప్రజలకు పాలకులుగా కాకుండా సేవకులుగా ఉండాలన్నారు. అధికార వికేంద్రీకరణ కోరుకున్నారు. ఇంగ్లీషును సామ్రాజ్యవాద భాషగా అభివర్ణించారు. గోవా విముక్తికై పోరాడి అరెస్టయ్యారు. సోషలిస్టు పార్టీ సభ్యుడిగా లోక్‌సభలో రైతుల సమస్యలపై గళమెత్తారు. కోట్లాది భారతీయులు కేవలం మూడణాల ఆదాయంపై జీవిస్తున్నారని ఎలుగెత్తారు. ఆయన కృషి వల్లే 1967లో ఏడు ఉత్తరాది రాష్ట్రాల్లో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. జయప్రకాశ్ నారాయణ్ ఉన్నత విద్యాభ్యాసానికి అమెరికాలోని విస్కాన్సిన్ విశ్వవిద్యాలయానికి వెళ్లారు సామాజిక శాస్త్రాలను అధ్యయనం చేశారు. మార్క్స్, ఎంగెల్స్ సిద్ధాంతాలను అధ్యయనం చేసి కమ్యూనిస్టుగా మారారు. భార్య ప్రభావతి ప్రభావంతో గాంధేయవాదిగా మారి కాంగ్రెస్ కార్యకలాపాల్లో పాలు పంచుకున్నారు. 1970లలో పోటెత్తిన కాంగ్రెస్ వ్యతిరేక ప్రభంజనంలో ఆయన కాంగ్రెసేతర శక్తులన్నిటికీ నాయకుడుగా మారి సంపూర్ణ విప్లవానికి పిలుపునిచ్చారు. ఎమర్జెన్సీ అనంతరం తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం అధికారంలోకి రావడం ఆయన ఉద్యమ స్ఫూర్తి వల్లే సాధ్యమయింది.

లోహియా, జయప్రకాశ్ ఇరువురూ అధికారానికి వెంపర్లాడలేదు. ఎన్నడూ ఏ మంత్రి పదవినీ ఆశించలేదు. సోషలిస్టు సమాజ స్వప్నం నెరవేరకుండానే లోహియా 1967లో మరణించారు. తాను కారకుడైన కాంగ్రెసేతర జనతా ప్రభుత్వం అధికార కుమ్ములాటల్లో కుప్పకూలిపోతుంటే జయప్రకాశ్ విషాదగ్రస్తుడై మరణించారు. బిహార్‌లోనూ, ఉత్తరప్రదేశ్‌లోనూ ఇవాళ వెనుకబడిన వర్గాల ప్రాబల్యం విస్మరించలేని స్థానంలో ఉండేందుకు లోహియా, జేపీ నిర్మించిన పునాదులే కారణం. లాలూప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్ ఆ మహానాయకుల ప్రభావంతో ఎదిగిన వారే. ఆ ఇరువురు లోహియా స్కూలులో చదువుకుని జేపీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ పొందారని సంకర్షణ్ ఠాకూర్ అనే సీనియర్ జర్నలిస్టు 'బ్రదర్స్ బిహారీ' అనే పుస్తకంలో రాశారు. దేశ రాజకీయాల్లో లాలూ, నితీశ్ నిర్వహించిన పాత్ర తక్కువేమీ కాదు. బిహార్‌లో కాంగ్రెస్‌ను దెబ్బతీసే క్రమంలో ఇరువురూ కీలకపాత్ర పోషించారు. జాతీయ స్థాయిలో సంకీర్ణ ప్రభుత్వాలు తమ మద్దతు లేకుండా ఏర్పడని పరిస్థితి కల్పించారు. లాలూతో విభేదాల వల్ల నితీశ్ వేరుపడి బీజేపీతో చేతులు కలిపినప్పటికీ ఇరువురూ బిహార్ రాజకీయాల్లో ఇప్పటికీ తమ ప్రాబల్యం కోల్పోలేదు.

భారతీయ జనతా పార్టీ ఇవాళ కేంద్రంలో నితీశ్ మద్దతుపై ఆధారపడి కొనసాగుతుండడమే కాక బిహార్‌లో ఆయన లేకుండా పోటీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. నితీశ్ తన మనుగడ కోసం బిహార్‌లో బీజేపీ ప్రవేశానికి చేయూతనిస్తే, లాలూప్రసాద్ యాదవ్ బిహార్‌లో ఆ పార్టీ ప్రవేశాన్ని, ప్రభావాన్నీ అడ్డుకునేందుకు తీవ్ర యత్నం చేశారు. కేంద్రంలో పది సంవత్సరాలు యూపీఏ ప్రభుత్వం కొనసాగేందుకు దోహదం చేశారు. ఇప్పుడు తన కుమారుడు తేజస్వి వెనుక ఒక కొండలా నిలుచున్న లాలూ ప్రభావాన్ని తక్కువ అంచనా వేసేందుకు వీలు లేదు. ఒక రకంగా చెప్పాలంటే లాలూ, నితీశ్ ఇద్దరూ బిహార్‌లో వెనుకబడిన వర్గాలు రాజకీయ ప్రాభవం కోల్పోకుండా, జాతీయ పార్టీలు తమ మీద ఆధారపడి ఉండేందుకు కారణమవుతున్నారు. అంతే కాదు, ఎన్నికల అనంతరం ఆర్‌జేడీ, జేడీ(యు) చేతులు కలిపితే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగిన పరిస్థితి దాదాపు ప్రతి ఎన్నికల ఫలితాల అనంతరం కనపడుతుంది. ఆ రకంగా లోహియా, జేపీల వారసత్వాన్ని కొనసాగిస్తున్నట్లేనని అర్థమవుతోంది. నిజానికి వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే నితీశ్‌ను గుర్తించి ఆయనను ముఖ్యమంత్రిగా చేసేందుకు వీలు కల్పించారు. ఆ పరిస్థితి లాలూకు వీపీ సింగ్ హయాంలోనే లభించింది. 29వ ఏట లోక్‌సభ సభ్యుడైన అయిన లాలూ 42 సంవత్సరాల వయస్సులో ముఖ్యమంత్రి అయ్యారు.

మధుబనిలో మోదీ కండువా ఊపినా, బెగుసరాయ్ చెరువులో రాహుల్ దూకినా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ కలిపి వంద సీట్లు అధిగమిస్తాయో లేదో చెప్పలేని పరిస్థితి. సిద్ధాంతాలకు అతీతంగా వెనుకబడిన, మైనారిటీ వర్గాల మనసుల్లో ఆలోచనలను ప్రతిఫలింపజేసే ఏకైక రాష్ట్రం బిహార్. ఆ ఘనత లోహియా, జేపీలకే దక్కుతుందనడంలో అతిశయోక్తి లేదు.



ఈ నేపథ్యంలో 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికలను అర్థం చేసుకోవల్సి ఉంటుంది. నితీశ్, లాలూ పార్టీలు తమ ప్రాధాన్యాన్ని అదే విధంగా కొనసాగిస్తారా లేదా అన్నదే ఈ ఎన్నికల ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. 74 సంవత్సరాల నితీశ్ సంపూర్ణ ఆరోగ్యంతో లేకపోవచ్చు గానీ, ఆయన ప్రాధాన్యం కోల్పోయిన నాయకుడు ఎంతమాత్రం కాదు. మెజారిటీ పరిశీలకులు ఆయన ప్రభుత్వం పట్ల ప్రజా వ్యతిరేకత లేదని విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు అత్యధిక సంఖ్యలో మద్దతునిస్తున్నారు. విద్యార్థినులకు సైకిల్ పంపిణీ పథకం ఆయనకు మంచి పేరు తెచ్చింది. నితీశ్ ఆరోగ్యం పట్ల ఏ వ్యతిరేక ప్రచారం జరిగినా, ఆయనను ఈ సారి బీజేపీ ముఖ్యమంత్రి చేయబోదన్న అభిప్రాయం వ్యాప్తి చెందినా అది ఆయన పట్ల సానుభూతికే దారితీస్తున్నదని ఒక అంచనా. ఏ విధంగానైనా తాను పోటీ చేసిన సీట్లలో కనీసం సగం సీట్లు, అంత కంటే ఎక్కువ సీట్లు గెలుచుకునే శక్తి నితీశ్‌కు ఉన్నదని చెప్పేందుకు ఆస్కారం ఉన్నది. ఇక ఆర్‌జేడీ పట్ల కూడా గడచిన రెండు ఎన్నికల్లో వ్యతిరేకత అంతగా కనపడలేదు. 2015లో 80, 2020లో 75 సీట్లు గెలుచుకున్న ఆర్‌జేడీ అన్ని పార్టీల కంటే ముందంజలోనే ఉన్నది. ఈ సారి కూడా దాదాపు అన్నే సీట్లు, లేదా అంతకంటే ఎక్కువ సీట్లు వచ్చే అవకాశాలు లేకపోలేదని చెబుతున్నారు. పైగా గతంలో కంటే ఇప్పుడు తేజస్వి ప్రాబల్యం, ఆదరణ పెరిగిందని పార్టీ వర్గాల భావిస్తున్నాయి. ఈ రీత్యా ఇప్పుడు కూడా అసెంబ్లీలో మెజారిటీ సీట్లు జేడీ(యు), ఆర్‌జేడీలే గెలుచుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంటే బిహార్‌లో ఈ ఎన్నికల్లో కూడా వెనుకబడిన వర్గాల ప్రాధాన్యత పెద్దగా తగ్గకపోవచ్చు. అయితే లాలూ, నితీశ్ పార్టీలలో దేనికి ఎక్కువ సీట్లు లభిస్తాయన్నదే కోటి రూకల ప్రశ్న.

ఈ ఎన్నికల్లో బిహార్‌లోని 243 సీట్లలో బీజేపీ 101 సీట్లకు, కాంగ్రెస్ 61 సీట్లకు మాత్రమే పోటీ చేస్తున్నాయి. దీన్నిబట్టి ఆ రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్‌ల ప్రాధాన్యత ఎంత మేరకు ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రధాన లక్ష్యం బిహార్‌లో బీజేపీ పోటీ చేసిన సీట్లలో మెజారిటీ సీట్లు సాధించడమే. జేడీ(యు), ఆర్‌జేడీలు సాధించిన వాటి కంటే ఎక్కువ సీట్లు సాధించి ప్రథమ స్థానం సాధించేందుకు బిహార్‌లో ఆయన విస్తృతంగా పర్యటిస్తున్నారు. గత ఎన్నికల్లో ఆయన బీజేపీని 74 సీట్లతో తన లక్ష్యానికి దాదాపు చేరువలోకి తీసుకువచ్చేందుకు కారకుడయ్యారు. ఇప్పుడు బిహారీ ప్రజలు బీజేపీని ఎంతవరకు ఆదరిస్తారనే విషయమై విస్తృతంగా చర్చ జరుగుతోంది. అక్కడ బీజేపీని గెలిపించేందుకు పలుకుబడి గల స్థానిక నాయకుడు ఎవరూ లేరు. ప్రతి సీటులోను బీజేపీ గెలుపు మోదీపైనే ఆధారపడి ఉంటుంది. రాష్ట్ర అధికార యంత్రాంగం ఆయనకు అండగా ఉన్నది. 2020 ఎన్నికల్లో దాదాపు 52 సీట్లు కేవలం వేయి ఓట్ల తేడాతో నిర్ణయమయ్యాయి. వీటిలో అత్యధిక సీట్లు ఎన్డీఏ కూటమికి చెందినవే. అంతేకాక ఈ సారి దాదాపు 15 సీట్లలో స్వతంత్ర అభ్యర్థులు గెలిచే అవకాశాలున్నాయి. వీరిలో అన్ని పార్టీలకు చెందిన తిరుగుబాటు అభ్యర్థులు ఉన్నారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం ఏర్పాటులో వీరు కీలక పాత్ర పోషించవచ్చు.

కాంగ్రెస్ 61 సీట్లకు పోటీ చేస్తున్నప్పటికీ దాదాపు 9 సీట్లలో స్నేహపూర్వక పోటీ జరుగుతున్నందువల్ల 52 సీట్లలోనే పోటీ చేస్తున్నట్లు లెక్క. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ సభలకు జనం హాజరవుతున్నప్పటికీ వాటిని ఓట్లుగా మార్చే యంత్రాంగం కాంగ్రెస్‌కు లేదనే చెప్పుకోవాలి. దళితుడిని బిహార్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిని చేయడం ద్వారా దళిత ఓట్లను ఆకర్షించే ప్రయత్నం చేశామని, ముస్లింల ఓట్లను తమ వైపు తిప్పుకునేందుకు బలమైన ప్రయత్నాలు చేశామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అందువల్ల ఈ సారి సగం సీట్లయినా కాంగ్రెస్ గెలుచుకోగలిగితేనే ఆ పార్టీ తన ప్రభావం నిలుపుకోగలుగుతుంది. విచిత్రమేమంటే మొదటి దశ పోలింగ్‌కు ప్రచార ఘట్టం ముగిసినప్పటికీ మహాఘట్‌బంధన్, ఎన్డీఏల మధ్య గట్టి పోటీ కొనసాగుతోందని. ప్రజలు ఎటు వైపు మొగ్గుతున్నారో తేలని పరిస్థితి ఉన్నదని నివేదికలు చెబుతున్నాయి. మధుబనిలో మోదీ కండువా ఊపినా, బెగుసరాయ్ చెరువులో రాహుల్ దూకినా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ కలిపి వంద సీట్లు దాటుతాయో లేదో చెప్పలేని పరిస్థితి. సిద్ధాంతాలకు అతీతంగా వెనుకబడిన, మైనారిటీ వర్గాల మనసుల్లో ఆలోచనలను ప్రతిఫలింపజేసే ఏకైక రాష్ట్రం బిహార్. ఆ ఘనత లోహియా, జేపీలకే దక్కుతుందనడంలో అతిశయోక్తి లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

కార్మిక పింఛన్‌ను పెంచాలి

పింఛను పెంపు కోసం ఎన్నో ఏళ్లుగా కార్మికులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం రూ.1000గా ఉన్న ఈపీఎఫ్ఓ కార్మిక నెలవారీ పింఛన్‌ను కేంద్రం త్వరలో రూ.2,500కు పెంచనున్నట్లు వార్తలొస్తున్నాయి. దీనిని కనీసం రూ.7500కు పెంచాలని కొంత కాలంగా కార్మికులు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. నానాటికీ పెరిగిపోతున్న ధరల నేపథ్యంలో కుటుంబంతో తామెలా బతకాలి అని పింఛన్‌దారులు ఆవేదన చెందుతున్నారు. వృద్ధులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు ఇచ్చే పింఛన్‌ను చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పెంచింది. కార్మిక పింఛన్‌ను పెంచడంపై కేంద్రానికి కూటమి ప్రభుత్వం విజ్ఞప్తి చేయాలి. కార్మిక భవిష్య నిధి(ఈపీఎఫ్)లో రూ. లక్షల కోట్ల కార్మిక సొమ్ము ఉన్నది. అయినప్పటికీ కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం ఉదారం చూపకపోవడం విచారకరం. తనకు పేదలంటే ఎంతో గౌరవమని ప్రధాని నరేంద్ర మోదీ గతంలో ఎన్నోసార్లు చెప్పారు. కానీ దాన్ని చేతలలో చూపించడంలేదు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి నెలవారీ పింఛన్‌ను రూ.7500కు పెంచాలి.

– ముద్దంశెట్టి రమణమూర్తి

వయసు నిర్ధారణ పత్రాలు ఇవ్వాలి

రాష్ట్రంలో అరవైయేళ్లు పైబడిన కొందరు వృద్ధుల వయసు వారి ఆధార్ కార్డుల్లో 56, 45...గా నమోదైంది. ఇలా ఆధార్ కార్డుల్లో తక్కువ వయసు చూపిస్తుండడంతో రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది వృద్ధులు పింఛన్‌కు దూరమవుతున్నారు. ఉదాహరణకు... 2023 నవంబరు నాటికి ఒక్క విజయనగరం జిల్లాలోనే ఇలా వయసు తక్కువగా నమోదై, ప్రభుత్వ పింఛన్‌కు నోచుకోలేని వృద్ధులు 3733 మంది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య భారీగానే ఉండొచ్చు కూడా. వృద్ధులకు వారి నిజ వయసు ప్రకారం నిర్ధారణ పత్రాలు ఇవ్వాలని కోరుతూ, విజయనగరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ గతంలో లేఖ రాశారు. రెండేళ్లు దాటినా దీనిపై ఫలితం శూన్యం. ప్రభుత్వాధికారుల తాత్సారం, పట్టింపు లేమి కారణంగా పింఛన్లు అందక, ఆర్థిక సమస్యలతో ఎంతో మంది వృద్ధులు మరణిస్తున్నారు. ఇకనైనా రాష్ట్రంలోని పాలకులు, అన్ని జిల్లాల కలెక్టర్లు వెంటనే స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలి. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో స్థానిక వృద్ధులకు వయసు నిర్ధారణ పత్రాలు అందించేలా ఆదేశాలు జారీ చేయాలి.

– శీరాపు శ్రీనివాసరావు

ఏఐ బోధనతో పిల్లల ప్రతిభకు ప్రమాదం

'బాలలకు 'కృత్రిమ మేధ' అవసరమా!' (అక్టోబర్ 28, ఆంధ్రజ్యోతి) అన్న వ్యాసంపై నా అభిప్రాయాలు కొన్ని వెల్లడించదలుచుకున్నాను. వ్యాసకర్త ఆర్.రామానుజం ప్రస్తుతం చాలా అవసరమైన ప్రశ్న వేశారు. ప్రాథమిక పాఠశాల స్థాయిలో 'కృత్రిమ మేధకు సంబంధించిన పాఠ్యాంశాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నట్లు, ఆ అధునాతన సాంకేతిక నైపుణ్య బోధనను మూడవ తరగతి నుంచే ప్రారంభించనున్నట్లు రామానుజం తెలియజేశారు. కృత్రిమ మేధ బోధనకు సంబంధించిన పాఠ్య ప్రణాళిక విధి విధానాలు, ఏయే తరగతులలో ఏయే విషయాలు ఉన్నాయో సమగ్రంగా వివరించారు. గమనార్హమైన విషయమేమిటంటే వ్యాస శీర్షికగా ఉన్న ప్రశ్నకు సంబంధించి ఒక్క మాట కూడా ప్రస్తావించలేదు! ఆ పాఠ్య ప్రణాళిక అమలు చేయటంలో ఉండే సాధకబాధకాల గురించి వివరించారు. కానీ 'కృత్రిమ మేధ–బోధన' పాఠశాల స్థాయి నుంచే అవసరమా? అన్న విషయాన్ని చర్చించకపోయినా చివరలో ఒక మంచిమాట అన్నారు: 'ఒత్తిడితో పాఠశాల విధులను నిర్దేశించటం లేదా ప్రభావితం చేయటం, విద్యారంగ దీర్ఘకాలిక లక్ష్యాలకు దోహదం చేయదు. సమాజానికి మేలు జరగదు. కృత్రిమ మేధ బలీయమైన ఆకర్షణ గల సాంకేతికత. అంతేకాదు, దాన్ని వినియోగించుకునే అలవాటు వదిలించుకోలేని వ్యసనంగా మారుతుంది. భావి పౌరులను తీర్చిదిద్దే విద్యాలయాలలో ఈ నవ సాంకేతికతను ఉపయోగించడంలో పై నిర్ణయాలను నిష్పాక్షిక వివేచన, సమగ్ర అవగాహన, నిశిత అంతర్దృష్టితో కూడిన సామాజిక వివేకంతో తీసుకోవలసి ఉంది'. విలువైన మాట, సందేహం లేదు.

అభివృద్ధి చెందిన దేశాలలో ఏఐ సాంకేతికతను ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో అమలు చేయడంలో ఉన్న అనుభవాలు, అధ్యయనాల గూర్చి వ్యాసకర్త కనీసమాత్రంగానైనా పేర్కొనలేదు. మొబైల్ ఫోన్‌లు ఎలా ఉపయోగించాలో నేర్పించాలంటున్నారు. అసలు ఆ వయస్సులో మొబైల్ ఫోన్‌లు అవసరమా? కేవలం దాన్ని అవసరం మేరకే ఉపయోగించటం అనేది సాధ్యపడుతుందా? అది ఉపాధ్యాయుల వల్ల అవుతుందా? అంతేకాకుండా కరోనా విపత్తు కాలంలో ఆన్‌లైన్‌లో విద్యార్థులు స్మార్ట్ ఫోన్‌లు ఉపయోగించారు. చదువు సంగతి ఎలా ఉన్నా, ఆ స్మార్ట్ ఫోన్ల వల్ల పాఠాలకన్నా, సినిమాలు, నీలి చిత్రాల వల్ల ఎంత నష్టం జరిగిందో తరువాత జరిగిన అధ్యయనాలు వల్ల మనందరికీ తెలిసిన విషయమే. 'కృత్రిమ మేధను నేర్పించే క్రమంలో విమర్శనాత్మకంగా ఆలోచించటం బాలలకు నేర్పించాలి' అని రామానుజం అన్నారు. అసలు పాఠశాల స్థాయి చిన్నారులలో సహజంగా ఉండే నైపుణ్యాలను, సృజనాత్మకతను, అభిరుచులను పెంపొందించకుండా ఏఐ లాంటి నవీన సాంకేతికతను వారి మెదళ్లలోకి ఎక్కించటంతో సాధించగలిగేది ఏమిటి? దానివల్ల బాలల్లో ఉండే సహజసిద్ధమైన తెలివితేటలకు ఎనలేని హాని సంభవించే ప్రమాదమున్నది. ఇప్పటికే అనవసరమైన సిలబస్ భారంతో బాలలు కుంగిపోతున్నారు. నిర్బంధంగా ఒత్తిడి చదువులు చదువుతున్నారు. వాటికి తోడు కృత్రిమమేధ లాంటి అధునాతన సంక్లిష్ట సాంకేతికత నేర్చుకోవడం అవసరమా? ఇప్పటికే ఉపాధిరంగంగా భావించి యువతరం అంతా సాంకేతిక విద్య వైపే దృష్టి కేంద్రీకరించింది. తల్లిదండ్రుల ఆలోచనా విధానం కూడా మూసలో పోసిన విధంగా ఉండటం అనేది ఒక విషాదకర పరిణామం. మానవీయ, సామాజిక శాస్త్రాల బోధనపై శ్రద్ధ అడుగంటిపోయింది. భాషా సాహిత్యాలపై ఎక్కడలేని ఉపేక్ష! ఫలితంగానే ఈ రోజు తెలుగు భాష ఉనికికే ప్రమాదం ఏర్పడే పరిస్థితి వచ్చింది. పాలకులు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల వల్ల ఉద్యోగావకాశాలు కూడా కుంచించుకుపోతున్నాయనే వాస్తవాన్ని విస్మరించకూడదు. పిల్లల్లో సాహిత్యం, లలిత కళలపై ఆసక్తులు నెలకొల్పడంలో ప్రస్తుత చదువులు విఫలమవుతున్నాయి. ఫలితంగా.. ఎదిగే క్రమంలో సమాజం గురించి గానీ, మానవ సంబంధాల గురించి గానీ ఈనాటి పిల్లలు ఏమీ నేర్చుకోలేకపోతున్నారు. జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించుకోలేని వయోజనులుగా పరిణమిస్తున్నారు. ఈ దుస్థితికి ప్రధాన కారణం విద్యావ్యవస్థ కార్పొరేటీకరణ కాదా? ప్రభుత్వాలు సైతం విద్యారంగంపై సరైన దృష్టి పెట్టకపోవటం కూడా గర్హనీయమే.

పాఠశాల స్థాయి చిన్నారులలో సహజంగా ఉండే సృజనాత్మక ప్రతిభ, ఆసక్తులు, అభిరుచులను పెంపొందించకుండా కృత్రిమ మేధ లాంటి నవీన సాంకేతికతను వారి మెదళ్లలోకి ఎక్కించటం వల్ల ప్రయోజనమేమిటి? ఆ నవీన సాంకేతిక విద్యా బోధనతో బాలల్లో ఉండే సహజసిద్ధమైన మేధో నైపుణ్యాలకు హాని సంభవించే ప్రమాదమున్నది.



అభివృద్ధి చెందిన దేశాలలో ఏఐ సాంకేతికత అదీ ఉన్నత విద్యలో ప్రవేశపెట్టటం అనేది కొంతవరకు సమర్థించదగిన విషయమే. అయితే మనలాంటి వెనకబడిన దేశాలలో ప్రభుత్వాలు పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించకుండా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకుండా ప్రభుత్వ పాఠశాలలు అన్నింటిని నిర్వీర్యం చేస్తోన్న పరిస్థితుల్లో బాలలకు కృత్రిమ మేధ బోధనను ప్రారంభించడమనేది బహుళజాతి కంపెనీల వస్తువులకు మార్కెట్ కల్పించటమే. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించలేని ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో చేసే ఈ చర్యలు 'ఉట్టికెక్కలేనమ్మ స్వర్గాని కెక్కిన' చందంగా ఉంటుంది. ఇంకో విషయమేమంటే, ప్రభుత్వాల దృష్టిలో విలువలు కలిగిన విద్య అంటే సాంకేతిక విద్య, ఇంగ్లీషు మీడియం చదువులు అని భావించటం వల్ల ప్రభుత్వ పాఠశాలలలో కూడా ఆంగ్ల మాధ్యమంలో చదువులు చెప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయి. విలువలు కలిగిన చదువులు అంటే మనిషి తనను తాను సంస్కరించుకుని సమాజాన్ని సంస్కరించటమే. ఈ రోజున అలాంటి చదువులు లేవు కాబట్టే సమాజం ఇంత అరాచకంగా తయారవుతోంది. మొత్తం మీద కృత్రిమ మేధ లాంటి అత్యాధునిక సాంకేతిక విద్యలు మనిషికి సౌకర్యవంతమయిన జీవితం కల్పించవచ్చు కానీ దాని వల్ల సంభవించే నష్టదాయక పరిణామాలే ఎక్కువగా ఉన్నాయి. తద్వారా మనుషుల మధ్య ఉండాల్సిన మానవీయ సంబంధాలు మరింత అమానవీయంగా మారే ప్రమాదముంది.

■ రాజ్యలక్ష్మి పొన్నపల్లి





● ఈ-13 ట్రంక్‌రోడ్డు - ఎన్‌హెచ్ 16 కనెక్టివిటీ ఎలైన్‌మెంట్



8లో..

ప్రజా దర్బార్‌లో వినతుల వెల్లువ

స్వయంగా అర్జీలను స్వీకరించిన మంత్రి లోకేశ్

● తొలిసారిగా.. టీడీపీ కేంద్ర కార్యాలయంలో
● రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు

కొనుగోళ్లు.. కంటితుడుపే

బర్లీ పొగాకు రైతులకు అన్యాయం జరగదు.. చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తాం.. అని ఒకవైపు ప్రభుత్వం చెబుతుంది. అయితే క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తి విరుద్ధంగా ఉంటున్నాయని రైతులు వాపోతున్నారు. బర్లీ రైతులను గట్టెక్కించాలని ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించగా.. నెలల తరబడి కొనుగోళ్ల ప్రక్రియను సాగదీస్తోంది. ఇప్పటికి రెండు విడతలుగా గడువు పొడిగించినా కొనుగోళ్ల ప్రక్రియ కంటితుడుపుగానే సాగుతోంది. దీంతో పొగాకు దిగుబడులను అటు నిల్వ చేసుకోలేక.. ఇటు ఎప్పుడు కొనుగోలు చేస్తారో తెలియక రైతులు అల్లాడుతున్నారు. ఇదే సమయంలో ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు బర్లీ రైతులను ముంచేశాయి. బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు సంబంధించి మూడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా.. కొనుగోళ్లకు సంబంధించి మార్క్‌ఫెడ్ దాగుడుమూతలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొగాకుపై మార్క్‌ఫెడ్ దాగుడు మూతలు

● గడువు పెంపుతో సరి.. కొనుగోళ్లు నామమాత్రం
● మొంథా తుఫాన్‌తో బర్లీ రైతు మరింతగా కుదేలు
● 20,000 క్వింటాళ్లకు అనుమతివ్వాలని తాజాగా ప్రతిపాదనలు



పర్చూరు : ఉప్పుటూరులో తడిచిన పొగాకును ఆరబెడుతున్న రైతులు

(ప్రత్తిపాడు, ఆంధ్రజ్యోతి)

జూన్ చివరి వారంలో బర్లీ కొనుగోళ్లను చేపట్టిన మార్క్‌ఫెడ్, సెప్టెంబరు చివరి వరకు సేకరణ జరుపుతామని తొలుత ప్రకటించింది. ఆ గడువు ముగిసే నాటికి గుంటూరు,బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలో 2,08,510 క్వింటాళ్ల బర్లీని కొనుగోలు చేసినట్లు అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. రైతుల (మిగతా 6వ పేజీలో)

50 వేల క్వింటాళ్లకు 9 వేలు

నాలుగు జిల్లాల పరిధిలోని రైతుల దగ్గర బర్లీ నిల్వలు ఇంకా 50,000 క్వింటాళ్ల వరకు ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. రెండు దఫాలుగా గడువు పొడిగించిన సమయంలో 25,000 క్వింటాళ్ల కొనుగోళ్ల జరపాల్సి ఉంది. అయితే గడవు ముగిసేప్పటికి 9,000 క్వింటాళ్లతోనే సరిపెట్టింది. అయితే షెడ్యూల్ ఇచ్చినా రాకపోవడం వల్లే కొనుగోళ్లు అంతగా జరగలేదని మార్క్‌ఫెడ్ ప్రకటనపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అనుసంధానానికి తొలగిన అడ్డంకి

● ఈ-13 ట్రంక్‌రోడ్డు - ఎన్‌హెచ్ 16 కనెక్టివిటి ● 9.59 హెక్టార్ల అటవీ భూమి ఇచ్చేందుకు అనుమతి ● రోడ్డు నిర్మాణంతో అమరావతిలోకి నేరుగా రాకపోకలు

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో కీలకమైన ఈ-13 ట్రంకురోడ్డుని ఎన్‌హెచ్(నేషనల్ హైవే)-16తో అనుసంధానం చేసేందుకు అడ్డంకిగా ఉన్న అటవీ భూమి సమస్య పరిష్కారమైంది. ప్రభుత్వ ప్రతిపాదనలను అధ్యయనం చేసిన కేంద్ర అటవీశాఖ ఎట్టకేలకు ఏపీసీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతులు మంజూరు చేసింది. ఈ కనెక్టింగ్ రోడ్డులో భాగంగా రైలుమార్గంపై నిర్మించాల్సిన ఆర్వోబీకి ఇటీవలే కేంద్ర రైల్వే శాఖ ఆమోదం తెలిపి రూ.112 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం అటవీ శాఖ నుంచి కూడా భూ సమస్య కొలిక్కి రావడంతో సాధ్యమైనంత త్వరలో రోడ్డుని నిర్మించేందుకు సీఆర్‌డీఏ ప్రణాళికలు సిద్ధం చేస్తోన్నది. రాజధానికి ఇప్పటి వరకు సరైన కనెక్టివిటీ లేదు. దీంతో ఉండవల్లి, కరకట్ట, మంగళగిరి, తాడికొండ, అమరావతి నుంచి రోడ్లలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సీఆర్‌డీఏ ఈ-13 ట్రంక్‌రోడ్డు నుంచి డీజీపీ కార్యాలయం వరకు విస్తరించాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.384.78 కోట్లతో 7.2 కిలోమీటర్ల పొడవునా ఆరువరసల్లో కనెక్టింగ్ రోడ్డును ప్రతిపాదించింది. ఈ రోడ్డును మంగళగిరి వద్ద రిజర్వు ఫారెస్టు ఏరియాలో నుంచి ఎలైన్‌మెంట్ చేశారు. ఇందుకోసం 9.59 హెక్టార్ల భూమి అవసరం అవుతుంది. అయితే కొన్నేళ్లు పట్టే అనుమతుల ప్రక్రియను కేవలం 10 నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం అన్ని అనుమతులు తీసుకొచ్చింది. కాగా రహదారి నిర్మాణంలో ఎలాంటి లేబర్ క్యాంపులు అటవీ భూమిలో ఏర్పాటు చేయరాదని, లేఅవుట్‌ని మార్చకూడదని, వృక్ష, జంతు జాలాలకు ఎలాంటి హాని తలపెట్టరాదని, గత్యంతరం లేని పరిస్థితి వస్తే తప్ప చెట్లను కూల్చివేయరాదని, మెటీరియల్‌ని అటవీ భూమిలో డంప్ చేయరాదని, వాగులను మార్చకూడదని అటవీ శాఖ షరతులు విధించింది.

సీఆర్డీఏ విజన్-2047కు అడుగులు

◆ మాస్టర్ ప్లాన్, విజన్‌పై సలహాల స్వీకరణ
◆ లక్ష్యాల నిర్దేశం కోసం ఆన్‌లైన్‌లో అభిప్రాయ సేకరణ

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిని ప్రజా రాజధానిగా నిర్మించేందుకు సీఆర్డీఏ విజన్-2047 రూపొందించింది. సీఆర్డీఏ పరిధిలోకి వచ్చే ప్రాంతాల ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకునేందుకు వీలుగా రాజధాని అభివృద్ధి విజన్ 2047ను ముందుకు తెచ్చింది. సీఆర్డీఏ పరిధి సుమారు 8,600 చ.కి.మీ విస్తీర్ణంలో ఉంది. దేశంలోనే అతిపెద్ద ప్రణాళికాయుత నగరంగా అమరావతి రూపుదిద్దుకోనున్నది. ఈ క్రమంలో మాస్టర్‌ప్లాన్ పరిధి, అభివృద్ధి, విజన్‌కు సంబంధించి ఆయా ప్రాంతప్రజల అభిప్రాయాలను తీసుకుంటే మంచిదని సీఆర్డీఏ భావిస్తోంది. రాజధాని నిర్మాణంలో 2047 నాటికి సాధించగల లక్ష్యాలను నిర్దేశించుకోవడం కోసం ప్రజల అభిప్రాయాలను ఆన్‌లైన్ విధానంలో సేకరణకు శ్రీకారం చుట్టింది. ఆయా ప్రాంతాల ప్రజల ఆలోచనలు, వారి ఆకాంక్షలు, ప్రాధాన్యతలను తెలుసుకోనున్నది. ఇందు కోసం క్యూఆర్ కోడ్‌ను రూపొందించింది. సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి అభిప్రాయాలను తెలపాలనుకునేవారు తమ స్మార్ట్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుని ఈ ఫారంలో తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చు. ఈ ఫారంలో పేరు, వయసు, లింగం, నివసించే ప్రాంతం, పిన్‌కోడ్‌ను నమోదు చేయాలి. ఆ తరువాత రాజధాని ప్రాంతానికి సంబంధించి మొదటి 3 ప్రాధాన్యతలను ఎంపిక చేసి టిక్ చేయాలి. ఆర్థికాభివృద్ధికి సంబంధించి ఏ అంశాలు కీలకమైనవో తెలిపేలా 5 అంశాలను ఎంపిక చేయాలి. ప్రజా స్నేహపూర్వక ప్రణాళికను రూపొందించడానికి ఐదు అంశాలపై టిక్ చేయాలి.

రాజధానిపై 3 అంశాల ఎంపిక ఇలా..

ఇందులో కొత్త పరిశ్రమల స్థాపన, హరిత నగరాలు, గ్రామాలు, మెరుగైన జీవన పరిస్థితులు, సుస్థిర, సమతుల్యాభివృద్ధి, విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాల కల్పన, మెరుగైన రవాణా అనుసంధానం, ట్రాఫిక్ రద్దీ, కాలుష్య నియంత్రణ, పర్యాటకం, వినోదం, పారదర్శక- జవాబుదారీపాలన, వ్యవసాయం- ప్రాసెసింగ్ ప్రోత్సాహం, వరదలు- విపత్తుల నివారణ, యువత- మరిన్ని ఉపాధి అవకాశాల కల్పన, స్థానిక సంస్కృతి- చేతిపనులు, కళలు, మెరుగైన ఆస్పత్రులు, ఆరోగ్య సౌకర్యా లు, అధిక నాణ్యతగల డిజిటల్ కనెక్టివిటీ, నీటి భద్రత వంటి 16 అంశాల్లో మూడు అంశాలను ఎంచుకోవాలి.

ప్రకృతి స్వర్గధామంగా ఉండాలంటే..

దీనికి సంబంధించి పది అంశాల్లో అత్యంత కీలకమైనదిగా భావించే అంశాన్ని ఎంపిక చేసి క్లిక్ చేయాలి. నీటి- హరిత సదుపాయాల ప్రణాళిక, అడవుల సంరక్షణ, ఆక్రమణల నివారణ, భూ స్వరూపాన్ని కాపాడుతూ.. వర్షపునీటి పారుదలకు తగిన ఏర్పాట్లు, నదుల కేంద్రీకృత ప్రణాళిక, ప్రకృతితో కుటుంబాలు మమేకానికి అనువైన అవకాశాలు, జల, వాయు కాలుష్య నివారణ, గ్రీన్ హౌస్ ఉష్ణ ప్రభావాన్ని నీడనిచ్చే చెట్లను నాటడం, సహజ, సేంద్రి ఉత్పత్తులకు మార్కెట్లను సృష్టించడం, ప్రాంతపు జీవ వైవిధ్యాన్ని అభివృద్ధి చేయడం వంటి అంశాల్లో అత్యంత ప్రాధాన్యాంశాన్ని ఎంపిక చేసి క్లిక్ చేయాలి. వీటితోపాటు ప్రజలు తమ నినాదాన్ని జత చేయవచ్చు.

వాటర్ గ్రిడ్ వచ్చేనా?

● కొన్నేళ్లుగా ఊరిస్తోన్న ప్రాజెక్టు
● గుంటూరు, బాపట్లకు రూ.7496 కోట్లతో ప్రతిపాదన



భూగర్భ జలాలు తాగేందుకు అనువుగా ఉండటం లేదు.. కాల్వల్లో పారుదలయ్యే నీరు కలుషితమవుతున్నాయి.. ఈ పరిస్థితుల్లో ప్రజలకు సురక్షిత నీరు అందించేందుకు వాటర్‌గ్రిడ్ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే గుంటూరు, బాపట్ల జిల్లావాసులకు వాటర్‌గ్రిడ్ మంజూరు కావడంలేదు. ఈ పరిస్థితుల్లో గత కొన్నేళ్లుగా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారుల నోట వింటున్న వాటర్ గ్రిడ్ ప్రతిపాదన మళ్లీ తెర పైకి వచ్చింది.



వాటర్ గ్రిడ్ నమూనా

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల జిల్లాలతో కలిపి గ్రామీణ నీటి సరఫరా విభాగం వాటర్ గ్రిడ్ ప్రతిపాదనలు సిద్ధం చేసిం ది. నాగార్జునసాగర్ డ్యాం, ప్రకాశం బ్యారే జ్ వద్ద అందుబాటులో ఉన్న ఉపరితల నీటిని పైపులైన్ల ద్వారా గ్రిడ్‌కు తరలించి శుద్ధి చేసి సురక్షితమైన తాగునీటిని గ్రా మాలకు సరఫరా చేయడమే ప్రాజెక్టు లక్ష్యం. ఇటీవల సముద్ర జలాలు బాపట్ల, కృష్ణానది తీర ప్రాంతాల్లోని భూ ముల్లోకి చొచ్చుకు రావడంతో భూగర్భ నీరు ఉప్పుగా మారి తాగేందుకు ఉప యోగపడటం లేదు. ఈ నేపథ్యంలో వాటర్ గ్రిడ్‌ను గుంటూరు, బాపట్ల జిల్లాలోని కొన్ని గ్రామాలను కలిపి ఏర్పా టు చేయాలని అధికారులు భావిస్తున్నారు. 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు తొలిసారి ఈ వాటర్‌గ్రిడ్ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అయితే ఇది కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో రూ.900 కోట్లు అయితే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా గ్రిడ్ ఏర్పాటు చేయొచ్చని అంచనా వేశారు. ఆ తర్వాత రూ.1600 కోట్లకు గ్రిడ్ అంచనాలు చేరుకున్నాయి. తాజాగా రూ.7496 కోట్లు అవసరమని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. జలజీవన్ మిషన్ లాంటి స్కీమ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే తప్ప ఈ ప్రతి పాదనలు ముందుకు కదలవు. గుంటూరు, బాపట్ల జిల్లాల మీదగా ప్రవహిస్తున్న కృష్ణానదిలో వరదలతో నీరంతా కడలి పాలౌతున్నది. ఆ నీటిలో నాలుగైదు శాతం ఒడిసి పట్టినా అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు సురక్షిత మైన తాగునీటి సరఫరా చేయొచ్చు. వేల కోట్ల ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.



8

సముద్ర స్నానాలు నిషేధం

నేడు కార్తిక పౌర్ణమికి భక్తులకు అనుమతి లేదు

సత్య సాయిబాబా భక్తులకు శుభవార్త

● ఆ రైళ్లు గుంటూరు, నరసరావుపేటలో నిలుపుదల 6

ఉగ్గు ఆంధ్రజ్యోతి



పట్టాభిపురంలోని మున్సిపల్ స్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న నిర్మాణం

పేరు మార్చారు.. పనులు మరిచారు

● కొలిక్కిరాని 'మన బడి మన భవిష్యత్' నిర్మాణాలు
● 18 నెలలుగా పాఠశాలల్లో ఎక్కడి నిర్మాణాలు అక్కడే
● రూ.400 కోట్ల పనులు పెండింగ్.. వేధిస్తున్న గదుల కొరత

గుంటూరు(విద్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నాడు నేడు అంటూ పాఠశాలల్లో భవన నిర్మాణాలు చేపట్టి అసంపూర్తిగా వదిలేసింది. కూటమి ప్రభుత్వం నాడు నేడు పేరును 'మన బడి మన భవిష్యత్' అని మార్చింది. అయితే పేరు మార్చిన ప్రభుత్వం 18 నెలలుగా పాఠశాలల్లో పనులను పట్టించుకోలేదు. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని అనేక పాఠశాలల్లో తరగతి గదుల సమస్యతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వరండాల్లో, చెట్ల కింద బోధనలతో ఉపాధ్యాయులు సరిపెడుతున్నారు. వర్షాలు, ఎండల సమయాల్లో వారి ఇబ్బందులు చెప్పనలవికాకుండా ఉంటున్నాయి. అయినా అధికారులు, పాలకులు అసంపూర్తి నిర్మాణాలపై దృష్టి సారించడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు ఎప్పటికి పూర్తి అవుతాయో తరగతి గదులు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో తెలియక ఉపాధ్యాయులు, విద్యార్థులు మదన పడుతున్నారు. నాడు నేడు పేరుతో గత ప్రభుత్వం రెండు దశల్లో రూ.600 కోట్లకుపైగా నిధులు వెచ్చించి పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టింది. ఐదేళ్ల పనులు సక్రమంగా జరగలేదు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా రూ.400 కోట్లకుపైగా నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. దాదాపు 450పైగా ఉన్నత పాఠశాలల్లో 70శాతానికిపైగా నిర్మాణాలు జరిగాయి. అయితే వాటికి ప్రస్తుత ప్రభుత్వం నిధులు (మిగతా 6వ పేజీలో)

9లోగా పనులు పూర్తి చేయాలి

● 11న వెంగళాయపాలేనికి కేంద్ర మంత్రి
● అమృత్ సరోవర్ పనుల పరిశీలనలో కలెక్టర్

గుంటూరు(తూర్పు), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మోడల్ అమృత్ సరోవర్ అభివృద్ధిలో భాగంగా గుంటూరు మండలం వెంగళాయపాలెం గ్రామంలో చేపట్టిన చెరువు అభివృద్ధి పనులను ఈ నెల 9లోగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశించారు. చెరువు అభివృద్ధి పనులను మంగళవారం కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై)పై ఈ నెల 10, 11 తేదీల్లో గుంటూరులో జరిగే జాతీయ సదస్సు నేపథ్యంలో చెరువు పరిశీలనకు 11న కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ రానున్నట్లు తెలిపారు. అనంతరం 11న నల్లపాడు, లయోలా పాఠశాలలో జరిగే సభ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట రాష్ట్ర గ్రామీణాభివృద్ధి అదనపు కమిషనర్ సీపీ రెడ్డి, ఏడీలు షణ్ముకశర్మ, ఎం శివప్రసాద్, డ్వామా పీడీ వి.శంకర్, ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



వెంగళాయపాలెం చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

అమెరికాకు.. పల్నాడు చిన్నారి

● జిల్లాలో మొదటి విదేశీ దత్తత ● అమెరికన్లతో మాట్లాడిన కలెక్టర్



చిన్నారి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంరక్షణలో ఉన్న అమర ప్రగతి అనే ఏడాది వయస్సున్న పాప ను అమెరికాలోని ఇల్లినోయిస్‌కు చెందిన బ్రాడెన్ రీజ్ వెబ్ దత్తత తీసు కున్నారు. ఇందుకు కేరిం గ్ పోర్టల్‌లో వారు దరఖాస్తు చేసుకుని.. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ ద్వారా అనుమతి పొందారు. దత్తత తల్లిదండ్రులతో ఆన్‌లైన్‌లో కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం మాట్లాడారు. విభిన్న ప్రతిభావంతురాలైన పాపను దత్తత తీసుకోవడంలో.. వారి అభిప్రాయం, సంసిద్ధత గురించి తెలుసుకున్నారు. జన్మనిచ్చిన బిడ్డతో సమానంగా పాపపై శ్రద్ధ చూపాలని కోరారు. దత్తత తల్లిదండ్రులు కూడా పాప విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని హామీ ఇచ్చారు. చిన్నారికి చికిత్స కూడా అందిస్తామని చెప్పారు. ఇది పల్నాడు జిల్లా ఏర్పాటు అయిన తర్వాత మొదటి(ఇంటర్ కంట్రీ అడాప్షన్)విదేశీ దత్తత.

9న బీసీ సంక్షేమ సంఘం విస్తృత సమావేశం

● రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



మాట్లాడుతున్న కేసన శంకరరావు

గుంటూరు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): బీసీలకు రక్షణ చట్టంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లోపే ఓబీసీ కులగణన పూర్తి చేయాలన్న డిమాండ్లపై ఈ నెల 9న విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లోని సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జనగణనతో పాటే సమగ్ర కుల గణనను శాస్త్రీయంగా నిర్వహించి, ఆపై జనాభా దామాషా మేరకు బీసీల రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని కోరారు. విస్తృత సమావేశం బీసీల అన్ని సమస్యలపై సమగ్రంగా చర్చిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వ ఎన్నికల వాగ్దానాలైన చట్టసభలలో 33 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటే.. కుల గణన తప్పనిసరన్నారు. బీసీ రిజర్వేషన్లలో కూడా అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరగాలంటే ఏబీసీడీలుగా వర్గీకరించాల్సి ఉందన్నారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ ఓబీసీ సబ్ ప్లాన్ రూపొందించి, ఈ మేరకు బడ్జెట్లో కేటాయింపులు జరిపి ప్రత్యేక నోడల్ ఏజెన్సీ ద్వారా సక్రమంగా అమలు జరపాలన్నారు. సమావేశానికి అన్ని జిల్లాల నుంచి పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం నేతలు కన్నా మాస్టర్, పారేపల్లి మహేష్, కోలా అశోక్, కోలా మణికంఠ, భాస్కర్ తదితరులున్నారు.

ఘన వారసత్వ బాధ్యత మీదే

● జింకానా అధ్యక్షుడు రామకోటేశ్వరరావు ● వైద్య కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



ప్రసంగిస్తున్న జింకానా అధ్యక్షుడు కోయ రామకోటేశ్వరరావు

గుంటూరు మెడికల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఖండాంతర ఖ్యాతి గాంచిన గుంటూరు వైద్య కళాశాల ఘనమైన వారసత్వాన్ని కొనసాగించాల్సిన బాధ్యత నేటి తరం వైద్య విద్యార్థులపై ఉందని గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ఉత్తర అమెరికా (జింకానా) అధ్యక్షుడు, హిమటాలజిస్ట్ డాక్టర్ కోయ రామ కోటేశ్వర రావు పిలుపునిచ్చారు. ఎందరో గొప్ప వైద్యులను సమాజానికి అందించిన గుంటూరు వైద్య కళాశాలలో మెడిసిన్ చదవడం అదృష్టంగా భావించాలని ఆయన ఉద్బోధించారు. మంగళవారం వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో జరిగిన 2025వ బ్యాచ్ మెడిసిన్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే ఇగ్నిటో -25 వేడుక, వైట్ కోట్ సెర్మనీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా ఆయా ప్రాంతాల్లో తెలుగు వైద్యులు, ముఖ్యంగా గుంటూరు వైద్య కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు కనిపిస్తారని డాక్టర్ రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. ఇదే రీతిలో ప్రస్తుత విద్యార్థులు కూడా చక్కటి వైద్యులుగా ఎదిగి జీవితంలో ఉన్నత స్థాయి చేరాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరా చారీ మాట్లాడుతూ రోగుల పట్ల సానుభూతితో, ప్రేమతో వ్యవహరించాలని విద్యార్థులను కోరారు. నేడు వైద్యుడికి, రోగి మధ్య డబ్బులు, వైద్య పరికరాలు అడ్డంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ వైద్యుడుగా ఎదగటం గొప్ప కాదని, మంచి వైద్యుడు గా గుర్తింపు పొందడం కష్టమన్నారు. అనంతరం జింకానా వితరణతో.. ఈ బ్యాచ్‌కు చెందిన 250 మంది వైద్య విద్యార్థులకు యాప్రాన్ (తెల్లకోటు), ఐడీ కార్డులను అందజేశారు. వైద్య వృత్తి ధర్మానికి కట్టుబడి ఉంటామని ప్రిన్సిపాల్ సుందరాచారీ, విద్యార్థుల తో హిపోక్రాటిక్ ఓత్ చేయించారు. అనంతరం వైద్యులు, వైద్య విద్యా ర్థులకు జింకానా అవార్డులను ప్రదానం చేశారు. డాక్టర్ తుమ్మల రామబ్రహ్మం రీసెర్చ్ అవార్డు కింద ప్రభుత్వాస్పత్రి, వైద్య కళాశాల ల్లో వివిధ విభాగాల్లో వైద్య పరిశోధనలు చేసి పరిశోధన పత్రాలను వెలువరించిన డాక్టర్ సుమిత శంకర్ (ప్లాస్టిక్ సర్జరీ), డాక్టర్ కాత్యాయిని (మైక్రోబయాలజీ), డాక్టర్ రు.లక్ష్మీ (డెర్మటాలజీ), డాక్టర్ సాయికిరణ్ (సైకియాట్రి), డాక్టర్ ఎల్‌జే సంధ్యావళికి (అప్తమాలజీ) రీసెర్చ్ అవార్డులను అందజేశారు. పలువురికి పలు మెరిట్ అవార్డుల ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జీఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ బి.శ్రీధర్ (అడ్మినిస్ట్రేషన్), డాక్టర్ బి.మాధవి (అకడమిక్), జింకానా చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.బాల భాస్కరరావు, కో-ఆర్డినేటర్ డాక్టర్ పీవీ హనుమంతరావు, కరణం రాజారావు, పలు విభాగాధిపతులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

విజయపురిసౌత్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత శుక్రవారం మాచర్ల మండలం చింతలతండా వద్ద గొర్రెల కాపరి జగ్గప్పల సాయిపై రాయితో దాడి చేసి... హత్య చేసి పరారైన రమావత్ బుడ్డానాయక్‌ను మంగళవారం విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ అరెస్ట్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. అలాగే గత సోమవారం హస్నాబాద్ తండాలో నాటుసారా కాస్తున్న నిందితుడు బాలు నాయక్ కూడా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ అశోక్ ఈ సందర్భంగా తెలిపారు.

పారిశ్రామిక వేత్తలుగా మహిళలు ఎదగాలి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూలో హోమ్ నీడ్స్‌పై ఉచిత శిక్షణ

ఏఎన్‌యూ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఏఎన్‌యూ వీసీ ఆచార్య గంగాధరరావు ఆకాంక్షించారు. వర్సిటీలో కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆధ్వర్యంలో గుంటూరు రూరల్ అడవి తక్కెళ్లపాడు గ్రామం సుందరయ్య కాలనీలోని 45 మంది మహిళలకు ఫినాయిల్, పెయిన్ బామ్, డిటర్జెంట్ తయారీపై ఒక రోజు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి వీసీ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ శిబిరాలను మహిళలు అందిపుచ్చుకోవాలన్నారు. సీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బి.బబిత అధ్యక్షత వహించారు. కార్పొరేటర్ స్మిత పద్మజా, సీఎస్ఆర్ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.వెంకటరమణ, సుందరయ్య కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు భార్గవి, శిక్షకురాలు ఎం.విజయలక్ష్మి, ఆచార్య పి.శంకర పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన

ఏఎన్‌యూలోని బ్యాచలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చివరి సంవత్సర విద్యార్థుల కళా నైపుణ్యాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం విద్యార్థుల చిత్ర కళా ప్రదర్శనను ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్ కె.గంగాధర రావు, జి.సింహాచలం ప్రారంభించారు. ఆచార్య ఎం.సురేష్ కుమార్ గౌరవ అతిథిగా పాల్గొని విద్యార్థుల కళా నైపుణ్యాన్ని ప్రశంసించారు. ఆర్కిటెక్చర్ విభాగాధిపతి నిరుపమ, పలువురు ఆచార్యులు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు జి.అనిల్ మనోహర్, సీహెచ్. హెలీనా, ఎం.సునీత, పి.సాగరిక, డి.నితిన్ ప్రైస్, ఎం.గణేష్ చిత్ర ప్రదర్శనలు ప్రశంసలు అందుకున్నాయి. ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్ పాల్గొన్నారు. మూడు రోజులపాటు విద్యార్థుల చిత్ర కళా ఎగ్జిబిషన్ ఉంటుంది.

పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ ఈ ఏడాది నిర్వహించిన ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, ఎంకామ్ రెండవ సెమిస్టర్, బీఈడీ నాలుగు, మొదటి, ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్, నానో టెక్నాలజీ నాలుగు, ఆరవ సెమిస్టర్లు, రీవాల్యూయేషన్ పరీక్ష ఫలితాలను మంగళవారం శివప్రసాద్‌రావు విడుదల చేశారు. పరీక్ష ఫలితాలను ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొందు పరిచామన్నారు.

రైతుల పేరుతో జగన్ నాటకాలు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు రైతు సంక్షేమానికి మంగళం పాడి నేడు జగన్ రాజకీయ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం విమర్శించారు. రైతులు నష్టపోయారని గొంతు చించుకుంటున్న జగన్ ముందు తన ప్రభుత్వ హయాంలో సంభవించిన విపత్తుల నష్టానికి ఎంతమేర రైతులకు సాయం చేశారు.. ఎన్ని కుటుంబాలను ఆదుకున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులను ఆందోళనకు గురిచేసి, వారిని రెచ్చగొట్టాలన్నదే జగన్ కుట్రపూరిత ఆలోచన అని పేర్కొన్నారు. తుఫాన్ల నష్టం కంటే పరామర్శల పేరుతో జగనే ఎక్కువ నష్టం చేస్తున్నారంటూ రైతులు వాపోతున్నారని దుయ్యబట్టారు. ప్రాజెక్టుల గేట్లకు గ్రీజు పెట్టించలేని నాయకుడు తమకేం మేలు చేస్తాడని అభిప్రాయపడుతున్నదని తెలిపారు.

ముగిసిన బిలియర్డ్స్ అండ్ స్నూకర్ పోటీలు

● విజేతగా శుభ శర్మ, రన్నర్ శంకర్‌రావు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఎస్‌డీవో అఫ్రోజ్‌ఖాన్

గుంటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఎల్‌వీఆర్ క్లబ్‌లో 13 రోజులుగా జరుగుతున్న ఏపీ స్టేట్ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ ర్యాంకింగ్ పోటీల్లో స్నూకర్‌లో కాకినాడకు చెందిన శుభశర్మ విజేతగా నిలిచారు. ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ క్రీడాకారుడు ఎస్. శంకర్రావు రన్నర్‌గా, తృతీయ స్థానంలో విజయవాడకు చెందిన పి.కిషోర్ నిలిచారు. బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పఠాన్ అఫ్రోజ్‌ఖాన్ విచ్చేసి విజేతలకు బహుమతులను అందజేశారు. బిలియర్డ్స్ అండ్ స్నూకర్ క్రీడకు స్పోర్ట్స్ అథారిటీ సహాయ సహకార ఎల్లప్పుడు అందిస్తుందని తెలిపారు. సభలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మైనేని బ్రహ్మేశ్వరరావు, యాగంటి దుర్గారావు, ఉపాధ్యక్షుడు వణుకూరి శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శి కొండ్రకుంట శ్రీనివాసరావు, కోశాధికారి ఏల్చూరి వెంకటేశ్వర్లు, క్లబ్ ప్రతినిధులు శ్రీకాంత్, వెంకటేశ్వరరావు, శివాజి తదితరులు పాల్గొన్నారు. పోటీల నిర్వాహ కార్యదర్శి పులివర్తి వెంకటేశ్వరరావు (అజార్) మాట్లాడుతూ.. ఈ పోటీల్లో 270 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, విజేతలకు రూ.1.35 లక్షల నగదు బహుమతి అందజేసినట్లు తెలిపారు. సంఘం కార్యదర్శి సుశీల్, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్చారు.. పనులు మరిచారు

(5వ పేజీ తరువాయి)

చెల్లించలేదు. ఆయా భవనాలు పూర్తి అయితే తరగతి గదుల కొరత తీరుతుందని ప్రధానోపాధ్యాయులు చెబుతు న్నారు. గుంటూరులోని ఏటి అగ్రహారం, పట్టాభిపురం, కేవీపీ కాలనీ, ఎన్జీవో కాలనీతోపాటు మండల పరిధిలోని లాలుపురం, నల్లపాడు, ఓబులునాయుడు పాలెం, వెంగళాయపాలెం, అంకిరెడ్డిపాలెం, ఏటుకూరు గ్రామాలతో పాటు పల్నాడు, బాపట్ల జిల్లాలో అనేక పాఠశాలల్లో అసంపూర్తి భవనాలు దర్శనమిస్తున్నాయి.

కొలిక్కిరాని విచారణ

గత ప్రభుత్వం నాడునేడు పేరుతో తల్లిదండ్రుల కమిటీలకు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. పేరుకు తల్లిదండ్రుల కమిటీ ఉన్నా దాని వెనుక మాత్రం వైసీపీ అనుచరగణమే ఉంటూ నిర్మాణాలు చేపట్టింది. నాణ్యతా లోపంతోపాటు నిర్మా ణాల విషయంలో అనేక ఆరోపణలు వచ్చాయి. దీంతో కూటమి ప్రభుత్వం ఆయా పనులపై విచారణ చేపట్టాలని నిర్ణయిం చింది. అయితే ఈ విచారణ ఎంతవరకు వచ్చిందో కూడా అర్థం కావడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు.

కొనుగోళ్లు.. కంటితుడుపే

(5వ పేజీ తరువాయి)

విజ్ఞప్తుల మేరకు అక్టోబరు 15 వరకు కొనుగోళ్లు చేపడతామని మార్క్‌ఫెడ్ తెలిపింది. తర్వాత ఆ గడువును మరో పది రోజులు పొడిగించి గత నెల 25 వరకు కేంద్రాల ద్వారా బర్లీ సేకరణ జరుపుతామని అధికారులు ప్రకటించారు. అయితే గడువు పెంపుకాలంలో నాలుగు జిల్లాల పరిధిలో మూడు కొనుగోలు కేంద్రాల ద్వారా బర్లీ సేకరణ చేపట్టామని యంత్రాంగం చెబుతోంది. కానీ ఇవన్నీ ఉత్తమాటలేనని క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియజేస్తున్నాయి. తాజాగా విరుచుకుపడిన భారీ వర్షం ధాటికి బర్లీ పొగాకు బేళ్ల కిందకు వాన నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉండడంతో రైతుల ఆవేదనకు అంతేలేకుండా పోయింది. బర్లీ కొనుగోళ్లకు సంబంధించి 16,739 మంది రైతులు నమోదు చేసుకుంటే కేంద్రాలు మూసివేసే నాటికి 11,985 మంది రైతుల నుంచే బర్లీ కొనుగోలు చేశారు. ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో ఇంకా రూ.136 కోట్ల మిగులు ఉన్నట్లు అధికారికంగానే తెలుస్తోంది. బర్లీ కొనుగోళ్లకు రూ.273 కోట్లు కేటాయించినట్లు ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ఇప్పటి వరకు జరిపిన కొనుగోళ్లకు సంబంధించి రూ.102 కోట్లు చెల్లించగా, ఇంకా రూ.35 కోట్ల వరకు పెండింగ్ ఉన్నట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు.

ఆదుకుంటామని మంత్రుల హామీ..

తుఫాన్ నష్టాన్ని పరిశీలించడానికి మంత్రులు పార్థసారధి, రవికుమార్‌లతో పాటు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు పర్చూరు నియోజకవర్గ పరిధిలో ఇటీవల జరిపిన క్షేత్రస్థాయిలో పర్యటనలో తమ ఇక్కట్లను బర్లీ రైతులు వారి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రాల ద్వారా బర్లీ కొనకపోతే తాము నిండా మునగడం ఖాయమని ఆవేదన వ్యక్తం చేయగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. దీనినిబట్టి రైతుల వద్ద ఇంకా పెద్దఎత్తున బర్లీ నిల్వలు ఉన్నాయని ప్రత్యక్షంగా తెలుస్తోంది. కానీ కొనుగోళ్లపై మార్క్‌ఫెడ్ పొంతనలేని సమాధానాలు చెప్పడం వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం కోసమేనని అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది



మంత్రుల వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న రైతులు(ఫైల్ ఫొటో)

తాజా ప్రతిపాదనలు..

20,000 క్వింటాళ్ల బర్లీ పొగాకు సేకరణకు అనుమతివ్వాలనే ప్రతిపాదనలను అధికారులు ఈ నెల 1న మార్క్‌ఫెడ్‌కు పంపినట్లు సమాచారం. అక్టోబరు 25తో కేంద్రాలను మూసేసిన సంగతి తెలిసిందే. గడువు పెంచి 9,000 క్వింటాళ్లలోపుతో సరిపెట్టిన మార్క్‌ఫెడ్, ఇప్పుడు అదనంగా ప్రతిపాదనలు పంపడంపై రైతుల్లో నమ్మకం కుదరడం లేదు.

సత్య సాయిబాబా భక్తులకు శుభవార్త

● ఆ రైళ్లు గుంటూరు, నరసరావుపేటలో నిలుపుదల

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఈస్టుకోస్టు రైల్వే ప్రకటించిన ప్రత్యేక రైళ్లన్నింటికి గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డు స్టేషన్లలో నిలుపుదల సౌకర్యాన్ని కల్పించింది. తొలుత ప్రకటించిన ఈ రైళ్ల టైంటేబుల్‌లో గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డుకు హాల్టింగ్ ఇవ్వలేదు. దీనిపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో గుంటూరులో సాయి భక్తులు లేరా అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. ఇదే విషయాన్ని గుంటూరు రైల్వే యూజర్స్ అసోసియేషన్ దక్షిణ మధ్య రైల్వేకు నివేదించింది. దీనిపై ఎస్‌సీఆర్ స్పందించి ఈస్టుకోస్టు రైల్వేకు లేఖ రాయడంతో వెనువెంటనే హాల్టింగ్ కల్పిస్తూ కొత్త టైంటేబుల్‌ని ప్రకటించింది. ఈ మేరకు ఈస్టుకోస్టు రైల్వే చీఫ్ ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్ దిబ్బన్‌జన్‌రాయ్ మంగళవారం సాయంత్రం సమాచారం ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● అరకు - యల్హాంక స్పెషల్స్‌కు నరసరావుపేట, మార్కాపురం రోడ్డులో నిలుపుదల కల్పించింది.

● శ్రీకాకుళం రోడ్డు - బెంగుళూరు స్పెషల్స్‌కు గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డులో హాల్టింగ్ ఇచ్చారు.

● భువనేశ్వర్ - బెంగళూరు కంటోన్మెంట్ - బెంగళూరు టీవోడీ స్పెషల్‌కు అనకాపల్లి, గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డులో స్టాపేజీ కల్పించారు.

● సంబల్‌పూర్ - బెంగళూరు కంటోన్మెంట్ - సంబల్‌పూర్ టీవోడీ స్పెషల్స్‌కి కూడా అనకాపల్లి, గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డులో హాల్టింగ్ సదుపాయాన్ని కల్పించారు.

● కటక్ - బెంగళూరు కంటోన్మెంట్ - కటక్ టీవోడీ స్పెషల్స్‌కి అనకాపల్లి, గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డులో నిలుపుదల కల్పించారు.

బియ్యం వ్యాపారిపై దోపిడీకి యత్నం

తెనాలి క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బియ్యం వ్యాపారిపై తెనాలి రైల్వేస్టేషన్ వద్ద దోపిడీ యత్నం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. రేపల్లెకు చెందిన బియ్యం వ్యాపారి ఎస్.శివ రోజు వ్యాపారం నిమిత్తం రేపల్లె నుంచి తెనాలి వస్తుంటాడు. మంగళవారం ఉదయం ఒకటవ ప్లాట్ ఫాం చివరి నుంచి అతను బయటకు వస్తుండగా ఓ యువకుడు అడ్డగించాడు. తను ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌నని బ్యాగ్‌లో ఏముందో చూపించాలంటూ దబాయించాడు. దీంతో గుర్తింపు కార్డు చూపించాలని వ్యాపారి అడుగగా బ్యాగు లాక్కెళ్లడానికి దుండగడు యత్నించాడు. ఇంతలో ఇతర ప్రయాణికులు అక్కడికి చేరడంతో ఆ యువకుడు బ్యాగు వదిలి అప్పటికే సిద్ధంగా ఇద్దరు యువకులతో ఉన్న బైక్ ఎక్కి పరారయ్యాడు. రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఇలాంటి ఘటనలు పరిపాటిగా మారాయి. సరైన పోలీసు నిఘా లోపించడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

44,948 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 46,472 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 44,948 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,358 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12700
334	10000	15000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	14500	334	10500	15200
273	----	----	నెంబరు. 5	10000	14300
341	10000	16000	273	----	----
4884	----	----	341	10000	16300
సూపర్ 10	----	----	4884	11000	14000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15300	తేజ	10000	15400
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15800
బ్యాడిగి	10500	16000	దేవనూరు డీలక్స్	10500	15200
దేవనూరు డీలక్స్	10000	15000	తాలుకాయలు	5000	8000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



మేయర్, కమిషనర్లకు చెక్కు అందజేస్తున్న బిల్డర్ శేషగిరిరావు, పక్కన బాజీ తదితరులు

వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి రూ.6లక్షల విరాళం

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి, నూతన జిమ్ పరికరాల కొనుగోలుకు వెంకటేష్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత పులివర్తి శేషగిరిరావు, ప్రధాన్ హాస్పిటల్స్ సంయుక్తంగా రూ.6లక్షలు విరాళం అందించాయి. మంగళవారం మేయర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు చేతుల మీదుగా కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ ప్రెసిడెంట్ కన్నసాని బాజికి చెక్ అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ రవీంద్ర మాట్లాడుతూ, నగర ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవనశైలిని ప్రోత్సహించే కార్యక్రమాలను నిర్వహించేందుకు సంస్థలు, వ్యక్తులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.కోటి వ్యయంతో ఇప్పటికే వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేసిందని, ఇతర ప్రాంతాల్లో ఇలాంటి సదుపాయాల ఏర్పాటుకు దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోటపాటి నాగేశ్వరరావు, ట్రాక్ సెక్రటరీ బెజవాడ శివరామకృష్ణ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఇమడాబత్తిని కోటేశ్వరరావు, అన్నం గంగాధర్, గల్లా గురుపాదం, రవీంద్ర, సత్యనారాయణ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రెయిన్ల నిర్మాణ పనులు ప్రారంభించండి : కమిషనర్

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో పూడిక తీసిన ప్రాంతాల్లో వెంటనే డ్రెయిన్ల నిర్మాణ పనులను ప్రారంభించాలని ఇంజనీరింగ్ అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం బాలాజీ నగర్, కృష్ణబాబు నగర్, లక్ష్మీపురం ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులను, రోడ్ల ఆక్రమణలను కమిషనర్ పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో నీరు నిలిచిపోకుండా పూడికతీసిన మేజర్ డ్రెయిన్ల ప్రాంతాల్లో తక్షణమే నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించారు. పర్యటనలో డీఈఈ రమేష్, ఎస్ఎస్ ఐజాక్, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

9న డాక్టర్ అంబేద్కర్ జీవిత చరిత్ర ఐకానోక్లాస్ట్ పుస్తక సమీక్ష సభ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కేఎస్ లక్ష్మణరావు, పెనుగొండ లక్ష్మీనారాయణ, పాపినేని శివశంకర్ తదితరులు

గుంటూరు (తూర్పు), నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): స్థానిక బ్రాడీపేట, యూటీఎఫ్ కార్యాలయంలో అంబేద్కర్ జాషువా పూలే పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సమగ్ర జీవిత చరిత్ర ఐకానోక్లాస్ట్ పుస్తక సమీక్ష సభ జరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. బ్రాడీపేటలో మంగళవారం పుస్తక సమీక్ష సభ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ రాజనీతి శాస్త్రం విభాగ అధ్యక్షుడు ప్రొఫెసర్ కే శ్రీనివాసులు ఈ పుస్తక సమీక్ష చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కోల నవజ్యోతి అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో మార్క్సిస్టు మేధావి రమేష్ పట్నాయక్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు పెనుగొండ లక్ష్మీనారాయణ పాపినేని శివశంకర్, కవి బి.విల్సన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అభిజ్ఞాన శాకుంతలం నృత్యరూపకం

గుంటూరు(తూర్పు), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళ వారం మహాకవి కాళిదాసు జయంతి సందర్భంగా సంస్కృతి భారతి గుంటూరు శాఖ, శ్రీ సాయిమంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమి వారి సంయుక్త నిర్వహణలో అభిజ్ఞాన శాకుంతలం నాటకంలోని చతుర్థాంశ ఘట్టంలో శకుంతలను అత్తవారింటికి పంపే రసవత్తర సన్నివేశం ప్రదర్శించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో గౌరవ అతిథులుగా ఏఎన్‌యూ ప్రొఫెసర్ పి.వరప్రసాదమూర్తి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, హిందూ కళాశాల పూర్వ ప్రధానాచార్యులు డాక్టర్ దీవి నరసింహదీక్షిత్, గుదిమెళ్ళ శ్రీకూర్మ నాధస్వామి, డాక్టర్ కాజ వేంకట సుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శి పత్రి వేణుగోపాల్, విభాగ సంయోజక్ పెసల దేవేంద్రగుప్త, ఉదయకిరణ్, జన్నాభట్ల ఉమా, ఫణికామేశ్వరి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సంస్కృత భారతి ప్రాంత అధ్యక్షుడు జొన్నాభట్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

7న జరిగే సదస్సును జయప్రదం చేయండి : నేతాజీ




మాట్లాడుతున్న వై.నేతాజీ, పాల్గొన్న పాశం రామారావు తదితరులు

గుంటూరు (తూర్పు), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోవియట్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 7న స్థానిక వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 'పెట్టుబడిదారీ విధానం- భవిష్యత్తు' అనే అంశంపై జరిగే సదస్సును జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7న జరిగే సభలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. సదస్సులో ప్రజలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో పాశం రామారావు, ఈమని అప్పారావు, ఎన్.భావన్నారాయణ, నళినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి సివిల్ సర్వీస్ ఉద్యోగులకు క్రీడా పోటీలు

గుంటూరు(తూర్పు), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, విజయవాడ వారి ఆదేశాలు మేరకు స్థానిక బీఆర్ స్టేడియంలో ఈనెల 11, 12 తేదీలలో పురుషులు, మహిళల విభాగాల్లో సివిల్ సర్వీస్ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆఫ్రోజ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 11న అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, బెస్ట్ ఫిజిక్, 12న హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, యోగా, రెస్లింగ్, స్విమ్మింగ్, మ్యూజిక్, డాన్స్ పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19 నుంచి జరిగే రాష్ట్ర పోటీలలో పాల్గొంటారని వివరించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు స్టేడియంలో లేదా 81431 43222 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న రాజకుమారి

గుంటూరు (విద్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలని బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా స్థానిక కొత్తపేటలోని కాసుశాయమ్మ స్కూల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మైనర్లు ద్విచక్ర వాహనాలను నడపొద్దని అన్నారు. లైసెన్సులు పొందడానికి కనీస వయస్సు 18 సంవత్సరాలు ఉండాలని స్పష్టం చేశారు. ఆటోలలో సురక్షిత ప్రయాణానికి వాహన ఫిట్నెస్ ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులు వాహనాల్లో ఎక్కవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్టీవో కార్యాలయ సిబ్బంది కె.సౌజన్య, పాఠశాల హెచ్‌ఎం షేక్ జిలానిబాషా, ఉపాధ్యాయురాలు రాజకుమారి, వ్యాయామ ఉపాధ్యాయుడు విజయ్ కుమార్, అబ్దుల్ ఖలీల్, సుధాకర్, సీహెచ్ వెంకట రవి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల క్రమబద్ధీకరణ ప్రారంభం

● అభ్యంతరాలుంటే నివేదించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ చేపట్టామని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. 1200 ఓటర్ల కంటే అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను మాత్రమే రేషనలైజేషన్ చేస్తున్నామన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాతో కలిసి పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌పై రాజకీయపార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గాల వారీగా ఈఆర్వోలు పాల్గొన్నారు. వారు 1200 ఓటర్లు కంటే అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను రేషనలైజేషన్ చేసి ఏర్పాటు చేసిన అదనపు పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ బూత్‌ల ప్రాంతాల మార్పులు, కేంద్రాల పేర్ల సవరణల ప్రతిపాదనలను వివరించారు. వీటిపై రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రతిపాదనపై అభ్యంతరాలను రాజకీయ పార్టీలు వెంటనే సంబంధిత ఈఆర్వోలకు లిఖిత పూర్వకంగా అందించాలన్నారు. వీటిని క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి తుది ప్రతిపాదనలను సిద్ధం చేసి ఆమోదం కోసం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి పంపిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, ఈఆర్వోలు డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజరు లక్ష్మీకుమారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనరు చల్లా ఓబులేసు, రాజకీయ పార్టీల ప్రతినిధులు డాక్టర్ టీ సేవా కుమార్ (ఆప్), చిరతనగండ్ల వాసు (బీఎస్పీ), వైవీ సుబ్బారావు (బీజేపీ), బీ సునీల్ కుమార్ (కాంగ్రెస్), తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు కంచర్ల శివరామయ్య, నాయుడు ఓంకార్, గాదె వెంకటేశ్వరరావు (జనసేన), డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి, ఏఈఆర్‌వోలైన తహసీల్దార్లు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

రైల్‌భవన్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవ సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిజాయితీ, నిష్పక్షపాతాన్ని ఉద్యోగ, వృత్తి జీవితంలోనే కాకుండా వ్యక్తిగతంగానూ ప్రతీ ఒక్కరూ పాటించాలని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ సూచించారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవం సందర్భంగా మంగళవారం గుంటూరులోని రైల్‌వికాస్ భవన్‌లో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌ఎం జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆమె ప్రసంగిస్తూ ఉద్యోగులు ఎల్లప్పుడూ నియమావళిని కచ్చితంగా పాటించలన్నారు. దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన విజిలెన్స్ అధికారులు ఇంజనీరింగ్, ట్రాఫిక్, పర్సనల్ విభాగాలకు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం ఎం.రమేష్‌కుమార్, డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ అధికారులు బి.రామారావు (ఇంజనీరింగ్), సీహెచ్ రాకేష్ (ట్రాఫిక్), సీనియర్ విజిలెన్స్ అధికారి కె.రవికుమార్ (పర్సనల్), గుంటూరులోని బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్యాల వెలికితీతకే చెకుముకి సంబరాలు

గుంటూరు (విద్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యాలను వెలికి తీయడమే చెకుముకి సైన్స్ సంబరాల లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. అమరావతి రోడ్‌లోని హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గుజ్జనగుండ్లలోని చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల, కొత్తపేటలోని జలగం రామారావు ఉన్నత పాఠశాల, ఏటి అగ్రహారంలోని ఎస్‌కేబీఎం స్కూల్ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్, కాటూరి పబ్లిక్ స్కూల్, శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ (బ్రాడీపేట) విద్యార్థులు మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. పాటిబండ్ల సీతారామయ్య స్కూల్ విద్యార్థులు కన్సోలేషన్ బహుమతిని సాధించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక సభ్యులు టీఆర్ రమేష్, ఎస్ఎం సుభాని, గురవయ్య, యశ్వంత్, సుబ్బారావు, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలి : డీపీటీవో

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని స్టాల్స్‌లో తినుబండారాలను ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని జిల్లా ప్రజారవాణాధికారి డి.సామ్రాజ్యం ఆదేశించారు. బస్టాండ్‌లోని తిక్కన సమావేశ మందిరంలో మంగళవారం బస్టాండ్‌లోని స్టాల్స్ యజమానులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో స్టాల్స్ యజమానులు భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో పీవో మాలతి, బస్టాండ్ ఏటీఎమ్ జి.సాంబశివ, అకౌంట్స్ ఆఫీసర్ పవన్, పాత గుంటూరు పోలీసులు ఉన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మాట్లాడుతున్న ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ కె.గంగాధర్, వేదికపై భారవి తదితరులు

గుంటూరు (తూర్పు), నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ కె.గంగాధర్ అన్నారు. ఏఎన్‌యూ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పీఎస్ నగర్‌లో గృహ అవసరాలపై మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కె.గంగాధర్ హాజరై శిక్షణను ప్రారంభించి ప్రసంగించారు. మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. స్థానిక కార్పొరేటర్ స్మిత పద్మజ మాట్లాడుతూ, పేద మహిళల అభివృద్ధికి ఇటువంటి నైపుణ్య శిక్షణలు ఎంతగానో ఉపయోగ పడతాయని అన్నారు. ఏఎన్‌యూ సీఎస్ఆర్ విభాగం డైరెక్టర్ డాక్టర్ బబిత మాట్లాడుతూ విద్యతో పాటు సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలని, 2010లో సీఎస్ఆర్ విభాగం ఏర్పాటు చేసి నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ట్రైనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పెయిన్‌బామ్, వాషింగ్ పౌడర్, ఫినాయిల్ తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ విభాగం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎం.వెంకటరమణ, ప్రొఫెసర్ ఎంవీఎస్ కోటేశ్వరారావు, స్కూల్ అడ్మినిస్ట్రేటర్ ఎల్ఎస్ భారవి పాల్గొన్నారు.

రాజ్యాధికారం దిశగా ఐక్య ఉద్యమాలు చేయాలి

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారం దిశగా బడుగు, బలహీనవర్గాలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బలహీనవర్గాల జేఏసీ నాయకుడిగా వ్యవహరించిన వైవీ సురేష్ మూడో వర్ధంతి కార్యక్రమం మంగళవారం అరండల్‌పేట 13వ లైనులో జరిగింది. ఈ సందర్భంగా జూపూడి మాట్లాడుతూ, బహుజన సమస్యల పరిష్కారం కోసం ఎంతో మంది త్యాగాలు చేశారని, అటువంటి నాయకులు బాటలో నడుస్తూ రాజ్యాధికారమే ఎజెండాగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఉగ్గం సాంబశివరావు, తాటికొండ నరసింహారావు, సాదం మాల్యాద్రి, సత్యనారాయణ, వట్టికూటి సాంబయ్య, ముత్తయ్య, మానేపల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్యకు పెరిగిన ఆదరణ

గుంటూరు (క్రీడలు), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యాయామ విద్యకు ఆదరణ పెరుగుతోందని రాష్ట్ర వ్యాయామ విద్య తనిఖీ అధికారి డాక్టర్ షేక్ మహబూబ్ బాషా అన్నారు. పట్టణ ప్రాంతాలతో పాటు, గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో వ్యాయామ విద్య అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఆయన చెప్పారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం ప్రారంభమైన గుంటూరు జిల్లా డివిజనల్ స్థాయి క్రీడా పోటీలకు మహబూబ్ బాషా ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని లాంఛనంగా పోటీలను ప్రారంభించారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు పి.సాయిబాబు, టి.లక్ష్మీపతి, డి.రాజేంద్ర, సురేష్, డేవిడ్ రాజు, బి.శివకుమారి, జీవీఎస్.జోస్పిన్, రమణమ్మ, శిక్షకులు బి.రామకృష్ణ, ఆర్.శివాజీ, శివారెడ్డి పాల్గొన్నారు.

మోటార్ వాహనాలకు దివ్యాంగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): త్రిచక్ర వాహనాల (రెట్రోఫిటెడ్ వాహనాల) మంజూరుకు దివ్యాంగుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ జిల్లా శాఖ ఏడి దుర్గాబాయి ఒక ప్రకటనలో చెప్పారు. 18-45 ఏళ్ల మధ్య ఉన్న 70 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు దీనికి అర్హులని తెలిపారు. దరఖాస్తుతో పాటు వైకల్యం 70 శాతం నిర్ధారించే సదరన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, 10వ తరగతి సర్టిఫికెట్, బ్యాంకు వివరాలు, ఆధార్, రేషన్ కార్డులు, వ్యాపారం లేదా ఏదైనా సంస్థలో పనిచేస్తున్నట్టు ధ్రువీకరణ పత్రంతో ఏపీడీఏఎస్‌డీఏసీ. ఏపీ. జీవో.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు సమర్పించాలన్నారు. వివరాలకు గుంటూరు, బృందావన్‌గార్డెన్స్‌లోని వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ జిల్లాశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మనస్థాపంతో యువతి ఆత్మహత్య

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగం రాదేమోనని భయంతో మనస్థాపానికి గురైన ఓ యువతి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం నల్లపాడులో చోటు చేసుకుంది. నల్లపాడు పోలీసుల కథనం మేరకు.. నల్లపాడులోని ఓ అపార్ట్‌మెంటులో ఉంటున్న కొండ శ్రీలత భర్త శివ మంగరాజు ఎయిర్‌ఫోర్సులో ఉద్యోగ విరమణ చేసి, 2016లో గుండెపోటుతో మృతి చెందారు. వారి కుమార్తె యశస్వి బీటెక్ పూర్తి చేసి ప్రస్తుతం స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే కంబైండ్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామ్ (సిజిఎల్) రాస్తోంది. గతంలో రెండు సార్లు పరీక్ష ఫెయిల్ అయింది. ఈసారి కూడా ఫెయిల్ అవుతాననే భయంతో తీవ్ర మనస్థాపానికి గురైంది. ఈ క్రమంలో సాయంత్రం తల్లి శ్రీలత పూలు కొనుగోలు చేసేందుకు వెళ్లి తిరిగి వచ్చి చూడగా.. యశస్వి బాత్రూంలో లోపల గడియ పెట్టుకొని ఉంది. శ్రీలత చుట్టుపక్కల వారిని పిలిచి.. తలుపు పగలగొట్టి చూడగా చున్నీతో మెడకు ఉరి బిగించుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. తల్లి శ్రీలత ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల ఆర్చి పక్కన కాలువలో రాధారపు నరేంద్రబాబు(32) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. వెంగళాయపాలెం శివారు సావిత్రిబాయి పూలే నగర్‌కు చెందిన రాధారపు నరసింహారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నరేంద్రబాబు నగరంలోని ఆదిత్య ఆసుపత్రిలో పీఆర్వోగా పనిచేస్తున్నాడు. ఈ నెల 3న సాయంత్రం డ్యూటీ మీద చీరాల వెళుతున్నట్లు ఇంట్లో చెప్పిన నరేంద్రబాబు తిరిగి రాలేదు. మంగళవారం ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చింది. ఆ తర్వాత కొద్ది సేపటికి ఫోన్ రింగ్ అవుతున్నా ఎవరూ తీయలేదు. కొంతసేపటికి.. గుర్తు తెలియని వ్యక్తి నరేంద్రబాబు ఫోన్ నుంచి తల్లికి ఫోన్ చేసి.. ఫోన్ గల వ్యక్తి కళాశాల ఆర్చి గేటు పక్కన కాలువలో ద్విచక్ర వాహనంతో సహా పడిపోయాడని చెప్పాడు. వెంటనే తల్లి బంధువులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుంది. రోడ్డు ప్రమాదానికి గురై కాలువలో జారి పడినట్లు అనుమానిస్తున్నారు. తండ్రి నరసింహారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌కు యత్నంపై చీటింగ్ కేసు

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చాకలిగుంట ప్రాంతానికి చెందిన కొల్లా జయ గణేష్, సోదరుడు భార్గవ్ పేరుతో నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను సృష్టించి రిజిస్ట్రేషన్‌కు చేసిన యత్నం విఫలమైంది. సబ్ రిజిస్ట్రార్ అప్రమత్తంగా ఉండడంతో రిజిస్ట్రేషన్ నిలిచిపోయింది. కొల్లా శ్రీనివాసరావుకు ఇద్దరు భార్యలు. ఒక భార్యకు జయ గణేష్, భార్గవ్ సంతానం. తండ్రి మరణానంతరం ఆస్తిని తమ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని... నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సృష్టించారు. ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం వెళ్లగా అనుమానం వచ్చిన సబ్‌రిజిస్ట్రార్ సర్టిఫికెట్‌ను ఈస్ట్ తహసీల్దారు కార్యాలయానికి పంపారు. తహసీల్దారు అది నకిలీ సర్టిఫికెట్‌గా గుర్తించారు. దీంతో ఆర్ఐ కరిముల్లా ఫిర్యాదు మేరకు మంగళవారం లాలాపేట పోలీస్ స్టేషన్లో చీటింగ్ కేసు నమోదైంది. జయ గణేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా ఆయన అనేక మంది పేర్లు చెప్పడంతో పోలీసులు వారందరిని కూడా స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు.

పైపుల్లో పగుళ్లు.. వృథాగా పోతున్న తాగునీరు



గుంటూరు నగరంలోని రింగ్ రోడ్డులో పైపులు పగిలి నీళ్లు వృథాగా పోతున్నాయి. ఒకవైపు జనం తాగునీటి కోసం ఇబ్బంది పడుతుండగా, మరోవైపు ఇలా నీరు వృథా కావడం బాధాకరమని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే మరమ్మతులు చేసి నీటి వృథాను ఆపాలని వారు కోరుతున్నారు. **- గుంటూరు.**





అరండల్‌పేట 9వ లైన్‌లో సైడ్ కాల్వ పూడిపోయి రోడ్డుపై మురికినీరు ప్రవహిస్తోంది. దుర్వాసన వెదజల్లుతుండడంతో దారిన వచ్చిపోయే వాళ్ళు ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి కాలువలోని పూడికను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



నూతన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే నసీర్

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం కల్పించాల్సిన బాధ్యత నాయకులదేనని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన టీడీపీ ఎస్సీ సెల్ గుంటూరు తూర్పు నియోజకవర్గ కమిటీని ప్రకటించారు. తెలుగు యువత రాష్ట్ర నాయకుడు అబ్బూరి మల్లిబాబుతో కలిసి ఆయన నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాలకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని చెప్పారు. మొదట నుంచి టీడీపీని తమ భుజస్కందాలపై నిలిపి నడిపించింది వెనకబడిన వర్గాలేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పి.బాబురావు, సభ్యులు పాల్గొన్నారు.

లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం రూ.2.73 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారుకు ఎమ్మెల్యే నసీర్ అందించారు. రాష్ట్రంలో నిరుపేదల ఆరోగ్యానికి రక్షగా సీఎంఆర్ఎఫ్ నిలుస్తోందని నసీర్ పేర్కొన్నారు.



ఎమ్మెల్యే గళ్ళా మాధవికి సమస్యలు చెప్పుకుంటున్న మహిళలు

మహిళా గ్రీవెన్స్‌కు ఫిర్యాదుల వెల్లువ

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహిస్తున్న మహిళా గ్రీవెన్స్‌కు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయని ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఆమె మహిళా గ్రీవెన్స్ డే నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. ఇప్పటి వరకు వందమందికి పైగా మహిళల నుంచి వినతులు అందాయని, వాటిలో దాదాపు 60కి పైగా సమస్యలను త్వరితగతిన పరిష్కరించగలిగామని ఆమె చెప్పారు. మహిళా పోలీస్ స్టేషన్ నుంచి ఒక ఎస్సై, లీగల్ అడ్వైజర్ విజయలక్ష్మి ప్రతీ మంగళవారం ఒక గంట సమయం కేటాయించి ఇక్కడికి వచ్చి చట్టపరమైన లేదా భద్రతకు సంబంధించిన సమస్యలపై వెంటనే సలహా, సహాయం అందిస్తున్నారన్నారు. కొన్ని సమస్యల పరిష్కారంలో పలు శాఖల నుంచి స్పందన కరువైందని, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎవరు ఆటంకం కలిగించినా క్షమించమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

రేషన్ మాఫియాపై చర్యలు తప్పవు

గుంటూరులో ప్రజా పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయన్న పత్రికా కథనాలను చాలా సీరియస్‌గా తీసుకున్నామని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. ప్రజా పంపిణీలో అవినీతి జరిపే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. దీనిపై తానే స్వయంగా సీఎస్‌కు వినతిపత్రం అందజేశానన్నారు. రేషన్ మాఫియా పూర్తిగా అంతరించేవరకు తాను వెనక్కి తగ్గనని ఎమ్మెల్యే మాధవి చెప్పారు.

జగన్ అరాచకలను ప్రజలే ఎదుర్కోవాలి

● ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

గుంటూర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌ను ఎదుర్కొన్న ప్రజలే జగన్ అరాచకాలను కూడా ఎదుర్కోవాలని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా సమసిపోయిన తర్వాత ఆ ప్రాంతాల్లో జగన్ పర్యటిస్తాననడం ఆయన మానసిక స్థితిని తెలియజేస్తోందన్నారు. తుఫాన్ తీరం దాటిన వెంటనే ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ప్రతి ఎమ్మెల్యే తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి కేంద్రానికి పంపించారని చెప్పారు. అయితే జగన్ పర్యటనలతో అలజడులను సృష్టించాలని చూస్తున్నారని, ఆయన్ను ప్రజలు తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. జగన్ యాత్రలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు ఓ కన్నేసి ఉంచాలని మాణిక్యరావు అధికారులను కోరారు.

జడ్పీ పీఎఫ్‌లో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించాలి

● జడ్పీ సీఈవోకు యూటీఎఫ్ వినతి

గుంటూరు (విద్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ తదితర అర్జీల సమాచారం తెలుసుకొనేందుకు ఆన్‌లైన్ ట్రాకింగ్ సేవలను ప్రారంభించాలని యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూ.రాజశేఖర్ రావు, ఎం.కళాధర్ జడ్పీ సీఈవోకు విజ్ఞప్తి చేశారు ఈ మేరకు మంగళవారం జడ్పీ సీఈవో జ్యోతి బసుకు వారు వినతిపత్రం అందజేశారు. తమ ఫైల్ పరిస్థితి తెలుసుకోవాలంటే మాచర్ల, రేపల్లె, ఇతర సుదూర ప్రాంతాల నుంచి సెలవులు పెట్టి తిరగాల్సి వస్తోందని అన్నారు. ఆన్‌లైన్ ట్రాకింగ్ సౌకర్యం కల్పిస్తే పీఎఫ్ సమాచారాన్ని పారదర్శకంగాను, వేగంగాను తెలుసుకోవచ్చని అన్నారు. జడ్పీ సీఈవోకు వినతిపత్రం సమర్పించిన వారిలో జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, ఎం.గోవిందు, బి.ప్రసాద్, కె.ప్రేమ్ కుమార్, రంగారావు, కోటిరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం సందర్శన

ఏఎన్‌యూ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగం విద్యా విధానంలో భాగంగా నంబూరు గ్రామంలోని లిటిల్ సిస్టర్స్ ఆఫ్ ద పూర్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో అబ్జర్వేషన్ విజిట్ మంగళవారం నిర్వహించారు. ప్రత్యేక అతిథిగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.సురేష్ కుమార్ విచ్చేశారు. విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.త్రిమూర్తిరావు, సమన్వయ కర్తలు ఆచార్య వి.వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ కె.ధనలక్ష్మి, అతిథి అధ్యాపకులు డాక్టర్ పి.రాజ్‌కుమార్, డాక్టర్ ఎస్.రాజశేఖర్ పాల్గొన్నారు. విద్యార్థులు ఓల్డ్ ఏజ్ హోమ్‌లోని వయోవృద్ధులతో మాట్లాడి.. అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకురాలు సిస్టర్ విక్టోరియా వారికి అందిస్తున్న సేవలను వివరించారు. పండ్లు, ఫలహారాలు విద్యార్థులు పంపిణీ చేశారు. రీసెర్చ్ స్కాలర్స్ గుప్తా, నాగేశ్వరరావు, రాజేష్, క్రాంతి, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీగా దుర్గాబాయి



దుర్గాబాయి

గుంటూరు (విద్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా దుర్గాబాయి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆమె జిల్లా ఉపాధి అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. తాజాగా ప్రభుత్వం దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఆరుగురు ఎస్ఐలకు పోస్టింగ్స్

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆరుగురు ఎస్ఐలకు పోస్టింగ్స్ ఇస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న బీవీ సుధాకర్‌రావును నగరంపాలేనికి, వీవీ రమణారెడ్డిని మహిళా స్టేషన్‌కు, షేక్ ఎస్ఎం.సుభానీని నల్లపాడుకు, షేక్ నజీర్ సాహెబ్‌ను పాతగుంటూరుకు, బి.జగన్‌మోహన్‌రావును తాడేపల్లికి, మహిళా స్టేషన్‌లో ఉన్న కె.తరంగిణిని మంగళగిరి టౌన్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు ఇచ్చారు.

కొరత ఉన్నా.. కోరుకున్న డిప్యూటేషన్


గుంటూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయం

● జిల్లా కార్యాలయాల్లో పాతుకుపోతున్న ఉపాధ్యాయులు

● పల్నాడు జిల్లా నుంచి సిఫార్సు డిప్యూటేషన్లు
● పథకాలు అమలులో కాసుల వేట!
● పాఠశాలల్లో టీచర్ల కొరత ఉన్నా బేఖాతర్

గుంటూరు(విద్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అప్పటి దాకా బుద్ధిగా పాఠశాలలో పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు స్థానం మారగానే అధికారి హోదాతో చెలరేగిపోతారు....పేద విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు డిప్యూటేషన్లపై మోజుతో సమగ్రశిక్ష, ఎంఈవో కార్యాలయాల్లో లేని అధికారాలు చెలాయిస్తున్నారు. ఒక్కో డిప్యూటేషన్‌కు లక్షలు ఖర్చుచేసి ఏళ్ళతరబడి ఇక్కడే పాతుకుపోతున్నారు. కొంతమంది పనిలేకున్నా కంప్యూటర్ వర్కు పేరుతో సమగ్రశిక్ష, ఎంఈవో కార్యాలయంలో కాలం వెళ్ళదీస్తున్నారు. మరీ విచిత్రం ఏమిటంటే వెనుకబడిన ప్రాంతమైన పల్నాడు జిల్లా నుంచి సైతం డిప్యూటేషన్ పేరుతో సమగ్రశిక్ష కార్యాలయంలో ఏళ్ళతరబడి పాతుకుపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పనిలో పనిగా కొన్ని పథకాల అమలులో భారీగా దండుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

అక్కడ జీతం.....ఇక్కడ పని

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు, కేంద్ర ప్రభుత్వం అమలు చేసే కొన్ని పథకాలను విద్యాశాఖతో సమన్వయం చేసు కుని సమగ్రశిక్ష పనిచేస్తుంది. ప్రధానంగా నూతన పాఠశాల భవనాల నిర్మాణం, ప్రత్యేక అవసరాల విద్య, ఐఈడీ కేంద్రాల నిర్వహణ, నాడు నేడు పనుల పర్యవేక్షణ, బాలకార్మికుల్ని గుర్తించి బడుల్లో చేర్పించడం తదితర ప్రధాన విధులు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఆయా పనులు చేయడానికి విద్యాశాఖలో నాన్ టీచింగ్ సిబ్బందితో పనిచేయించవచ్చు. అయితే డిప్యూటేషన్ పేరుతో ఉపాధ్యాయులు ఇక్కడ చేరి హల్‌చల్ చేస్తున్నారు.

సమగ్రశిక్షలో పనిచేసేందుకు ఓ టీచర్ బొల్లాపల్లి నుంచి ఓ ప్రజాప్రతినిధి నుంచి సిఫార్సు లేఖ తీసుకువచ్చి ఇక్కడ చేరిపోయారు. ఇప్పటికే పల్నాడు జిల్లాలో టీచర్స్ లేక అనేక ఇబ్బందులు పడుతుంటే అధికారులు మాత్రం కిమ్మనకుండా డిప్యూటేషన్‌పై టీచర్లను ఇక్కడ నియిమించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలోని ప్రత్యేక అవసరాల విద్య విభాగాంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇక్కడ కొంతమంది దాదాపు పది సంవత్సరాల నుంచి పని చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక నాడు నేడు పనుల్ని పర్యవేక్షించడానికి కొంతమంది ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై వచ్చి పనిచేస్తున్నారు. రోజుకు గంటకు మించ కూడా ఇక్కడ పని ఉండదు. కార్యాలయంలో బయోమెట్రిక్, ముఖ హాజరు వేసి ఎంచక్కా సొంతపనుల్లో నిగ్నమౌతున్నారు.

సమగ్ర శిక్షలో పనిచేసే ఓ ఉపాధ్యాయులు రియల్ ఏస్టేట్, బినామీల పేరుతో అపార్టుమెంట్ కాంట్రాక్టు వర్కులు చేస్తున్నట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాలోని ఎంఇవో కార్యాలయంలో కూడా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మండలస్థాయిలో కొంతమంది ఉపాధ్యాయులు ఉపాధ్యాయుల జీతాలు బిల్లులు చేయడం, సర్వీసు మేటర్స్ సెటిల్ చేయడం వారి వద్ద నుంచి అందినకాడికి దండుకోవడం పనిగా పెట్టుకున్నారు. కొన్ని ఎంఇవో కార్యాలయంలో ఉపాధ్యాయులు సస్పెండ్ అయిన ఉపాధ్యాయుల మేటర్స్ సెటిల్ చేయడానికి దళారి పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దాదాపు అన్ని ఎంఈవో కార్యాలయాల్లో ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని సమగ్రశిక్ష, ఎంఈవో కార్యాలయంలో దాదాపు వంద మంది వరకు డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. పిల్లలకు పాఠాలు చెప్పాలని ప్రభుత్వం జీతాలు ఇస్తుంటే వక్రమార్గంలో డిప్యుటేషన్‌పై వచ్చికార్యాలయంలో పాతుకు పోతున్నారు. దీనివల్ల అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత నెలకొందని ఉపాధ్యాయ సంఘాలు నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మెగా డీఎస్సీ ద్వారా నియాకాలు చేపట్టినా ఇంకా ఉపాధ్యాయుల కొరత ఉందంటే దానికి ప్రధాన కారణం డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులు పనిచేస్తూ పాఠాలలకు డుమ్మా కొట్టడమే కారణమని సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

సముద్ర స్నానాలు నిషేధం

బాపట్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తిక మాసం పౌర్ణమి రోజు బుధవారం సూర్యలంక సముద్ర తీరంలో భక్తుల పుణ్య స్నానాల ఆచరణకు బ్రేక్ పడింది. సూర్యలంకతో పాటు పాండురంగాపురం, రామచంద్రాపురం, వాడరేవు, రామాపురం బీచ్‌ల్లో సముద్ర స్నానాలను అధికారులు పూర్తిగా నిషేధించారు. కార్తిక పౌర్ణమికి సూర్యలంకలో సముద్ర స్నానానికి భక్తులను అనుమతించాలని ముందుగా అధికారులు భావించి.. అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. అయితే వాతావరణం అనుకూలించకపోవడం.. మంగళవారం భారీ వర్షం కురవడంతో.. కార్తీక పౌర్ణమి రోజు కూడా భక్తులకు, పర్యాటకులకు ప్రవేశం లేదని ఆర్డీవో పి. గ్లోరియా ప్రకటన విడుదల చేశారు. మళ్లీ తీరానికి అనుమతి ఎప్పటి నుంచి అనేది ప్రకటించే వరకు సూర్యలంక తీరానికి రాకూడదని ప్రకటించారు. ఏ ఒక్కర్నీ సముద్రం వైపు రాకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.


మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాటు చేసిన తాత్కాలిక గదులు

తీరంలో వెలగని కార్తిక దీపం

మొంథా తుఫాన్ ప్రభావంతో గత నెల 22న నుంచి బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరానికి పర్యాటకుల ప్రవేశాన్ని అధికారులు నిలిపివేశారు. తుఫాన్ కారణంగా సముద్రంలో అనేకచోట్ల గుంతలు ఏర్పడటంతో.. ప్రమాదాలు పొంచి ఉన్నాయని గ్రహించిన అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. సూర్యలంక ప్రధాన రహదారికి అడ్డుగా బారికేడ్‌లు ఏర్పాటు చేసి రాకపోకలను పూర్తిగా నిషేధించారు. కార్తిక మాసం రెండో సోమవారం సూర్యలకలో ప్రవేశం ఉంటుందని భక్తులు భావించారు. పోలీసు, రెవెన్యూ అధికారులు ముందుగా ఈ నెల 4వ తేదీ వరకు అనుమతి లేదని ప్రకటించారు. ఇప్పుడు పౌర్ణమి రోజు కూడా రాకపోకలకు పూర్తిగా నిషేధం విధించారు. ఏటా కార్తిక పౌర్ణమి రోజు లక్షలాది మంది భక్తులు తీరానికి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించి పూజలు నిర్వహిస్తారు. బాపట్ల పరిసర ప్రాంతాల నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి భక్తజనం విశేషంగా తరలి వస్తుంటారు. ఈ ఏడాది ఇప్పటి వరకు తీరంలో కార్తిక దీపాలు వెలిగించ లేదు. పూజలు నిర్వహించ లేదు. సముద్రగర్భంలో ప్రమాదకారమైన గుంతలు ఏర్పడటం వల్లే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

ప్రజా దర్బార్‌లో వినతుల వెల్లువ

● తొలిసారిగా.. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ● రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు ● స్వయంగా అర్జీలను స్వీకరించిన మంత్రి నారా లోకేశ్


అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్


ప్రజా దర్బార్‌లో దివ్యాంగురాలి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. 70వ రోజు ఈ కార్యక్రమాన్ని తొలిసారిగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. మంత్రి నారా లోకేశ్ ను కలిసి సమస్యలను విన్నవించేం దుకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు, బాధితులు పెద్దఎత్తున తరలివ చ్చారు. లోకేశ్‌ను కలిసి తమ గోడు చెప్పుకునేందుకు ఎంతో ఓపిగ్గా వేచిఉన్నారు. ప్రతి ఒక్కరినీ మంత్రి లోకేశ్ ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలను సావధానంగా విన్నారు. ప్రతి విజ్ఞప్తిని స్వయంగా పరిశీలించి, తక్షణ పరిష్కారం చేయగలిగిన సమస్యలకు సంబంధించి సిబ్బందికి అప్పటికప్పుడే ఆదేశాలు జారీచేశారు. గత వైసీపీ పాలనలో జరిగిన అన్యాయాలు, అక్రమాలను గురించి వివిధ జిల్లాలకు చెందిన బాధితులు అర్జీల రూపంలో మంత్రికి అందజేశారు. చివరి వ్యక్తిని కలిసే వరకు ప్రజా దర్బార్ కొనసాగింది. దాదాపు నాలుగు గంటలపాటు జరిగిన ప్రజా దర్బార్‌లో మంత్రి లోకేశ్ సుమారు నాలుగు వేల మందిని కలిసి అర్జీలను స్వీకరించారు. కూటమి ప్రభు త్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని, అందరికీ అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు వరద నీరు

తాడేపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజె క్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 27,586 క్యూ సెక్కుల వరద నీరు మంగళవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా 25,375 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 1,514 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 516 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.




సాగర్ నీటి నిల్వ 310 టీఎంసీలు

విజయపురిసౌత్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటిమట్టం మంగళవారం నాటికి 589.40 అడుగులు ఉంది. ఇది 310.25 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,495, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో 44,095 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 44,095 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

టెయిల్ పాండ్ రిజర్వాయర్‌కు 33211 క్యూసెక్కులు

రెంటచింతల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన రిజర్వాయర్‌కు ఎగువనసాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 33,211 క్యూసెక్కుల నీరు వస్తోందని ప్రాజెక్టు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజులు తెలిపారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 4 గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 28344 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ చానల్ ద్వారా 4,395 క్యూసెక్కులు మొత్తంగా 32,739 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. రిజర్వాయర్‌లో 74.95 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.7040 టీఎంసీలకు సమానమన్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు ఒక యూనిట్ ద్వారా 0.545 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 64.6716 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగిందని తెలిపారు. 2026 మార్చి 31 నాటికి విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 80 ఎంయూలన్నారు.


టెయిల్‌పాండ్ ప్రాజెక్ట్‌లో నీరు

జాడలేని ఆహార సలహా సంఘాలు

● సమీక్షలు నిర్వహించని అధికారులు
● ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు ● మూడు ఏళ్ల నుంచి కమిటీలకు మంగళం


తాడికొండలోని తహసీల్దార్ కార్యాలయం

తాడికొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల నాణ్యత, ధరల నియంత్రణలో ప్రజలకు సేవలందించాల్సిన ఆహార సలహా సంఘాలు మచ్చుకైనా కన్పించడం లేదు. దీంతో ఆహార పదార్థాల్లో నాణ్యత లోపించడంతో పాటు ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. డివిజన్, మండల స్థాయి కమిటీలు, జిల్లా స్థాయిలో సలహా సంఘాల కమిటీలను కలెక్టర్లు లీడ్ చేస్తుంటారు. ఈ కమిటీలో కలెక్టర్‌తో పాటు జిల్లా ఉన్నాతాధికారుల, ప్రజా ప్రతినిధులు కూడా ఉంటారు. మండల స్థాయిలో తహసీల్దారు, ప్రజా ప్రతినిధులు, రేషన్ డీలర్లు, ప్రజా సంఘాలు కమిటీలో ఉంటారు. తహసీల్దార్ ఈ కమిటీని లీడ్ చేస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి జిల్లా పౌరసరఫరా శాఖ నిబంధనల మేరకు మండల స్థాయి కమిటీలను నియమిస్తారు.

తూతూ మంత్రంగా సమావేశాలు

గత ప్రభుత్వ హయాంలో మండల స్థాయిలో ఆహార సలహా సంఘాలు కనిపించకుండా పోయా యి. మూడేళ్ల నుంచి ఒక్క సమావేశం కూడా జరగ లేదు. అంతకముందూ తూతూ మంత్రంగా కానిచ్చే వారు. వాస్తవానికి మూడు నెలలకోసారి మండల స్థాయి సమీక్షల్లో తీసుకున్న నిర్ణయాలను డివిజన్ స్థాయిలో కమిటీకి తెలపాలి. డివిజన్ సంఘాలు జిల్లా కమిటీలకు నివేదికను పంపించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి కంటితుడుపు చర్యలుగా సమావే శాలను అధికారులు నిర్వహించేవారు. అధికారులు ఆహార సలహా సంఘాల సమావేశాలు నిర్వహిం చాలని వివిధ పార్టీ నాయకులు, ప్రజా సంఘాలు కోరుకుంటున్నాయి.

● సలహా సంఘాల విధులు

● కమిటీ సభ్యుల దృష్టికి వచ్చిన ఆహారం పదా ర్థాల శుభ్రత, నాణ్యత, ధరల నియంత్రణ లేకపోవడం, అధిక ధరలకు విక్రయించడం వంటి వాటిని ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లాలి.

● ఈ నివేదికలు జిల్లా అధికారులకు అందగానే సరైన నిర్ణయం తీసుకుని అమలు చేయడం, ధరల నియంత్రణ అడ్డుకట్ట వేయడం వంటివి చేయాలి.

● ఆహార సలహా సంఘాలు వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి కొనసాగాయి. అనంతరం టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని కొసాగించింది.

● వైసీపీ ప్రభుత్వంలో సలహాల సంఘాల ఊసే లేకుండా పోయింది. కొత్త ఏర్పటైన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంలోనైన ఆహార సలహా సం ఘాల కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చే యాల్సిన అవశ్యకత ఉంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆహార భద్రత విషయంలో ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరుతున్నారు.

అధికారుల పర్యవేక్షించాలి

చింతల భాస్కరరావు, ఆహార సలహా సంఘం కమిటీ సభ్యుడు, తాడికొండ



అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దుకాణాల్లో సరుకుల నాణ్యతను పరిశీలించాల్సి ఉంది. కల్తి సరుకులపై అధికారులు దృష్టి పెట్టాలి. ఆహార సలహా సంఘాల సమావేశాలను ఏప్పటికప్పుడు అధికారులు నిర్వహించాలి. వినియోగదారులకు అందుబాటులోకి ధరలు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

దేవదాయశాఖ అలర్ట్

● నేడు కార్తిక పౌర్ణమి
● కాశీబుగ్గలో ఘటనతో శైవక్షేత్రాల్లో ముందస్తు జాగ్రత్తలు

గుంటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తిక పౌర్ణమి పూజలు బుధవారం అన్ని శైవక్షేత్రాల్లో వైభవంగా జరగనున్నాయి. శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తిక మాస పౌర్ణమి పూజలకు భక్తుల రద్దీ దృష్ట్యా దేవదాయశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. అయితే శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో ఘటనతో అధికారులు మరింత అలర్ట్ అయ్యారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు దేవదాయ శాఖ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు శైవక్షేత్రాలను దర్శించి.. ఈవోలు తీసుకుంటున్న భద్రత చర్యలను పరిశీలించారు. దర్శనం సమయంలో, దీపారాధనలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా పెదకాకాని మల్లేశ్వరస్వామి, అమరావతిలోని అమరేశ్వరస్వామి, గోవాడ బాల కోటేశ్వరస్వామి, కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి, వైదలోని అమరలింగేశ్వర స్వామి, కొత్తపేటలోని ఉమామహేశ్వర స్వామి దేవస్థానాలతో పాటు పలు ఆలయాల్లో కార్తిక దీపారాధనలకు పెద్దఎత్తున భక్తులు తరలిరాను న్నారు. కోటప్పకొండ, పెదకాకాని, అమరావతి ఆల యాలకే.. 50వేల మందికి పైగా భక్తులు రానున్నా రనే అంచనాతో ఏర్పాట్లు పూర్తి చేశారు. అధికారులు మైకుల ద్వారా నిరంతరం భక్తుల మార్గనిర్దేశ నం చేయనున్నారు. అలయాల్లో బారికేడ్లు, క్యూలైన్లు, ఇతర మార్గాలను ఉన్నతాధికారులకు తెలియకుండా మార్చకూడదని, అత్యవసర, బయటకు వెళ్లే మార్గాల్లో భక్తులను అడ్డుకోకూడదని కమిషనర్ ఆలయాల ఈఓలకు స్పష్టం చేశారు. క్యూలైన్లలో భక్తులు వ్యతిరేక దిశలో ప్రవేశించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా ఆలయాల్లో భక్తులు సంయమనంతో ఉండాలని, పరుగులు తీయడం, తోపలాటలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గుంపులు గుంపులుగా గుమికూడరాదని, ఆలయ సిబ్బంది సూచనల మేరకు నడుచుకోవాలని సూచించారు.

డాక్టర్ ఇంటిలో భారీ చోరీ

● రూ. 60లక్షల విలువైన బంగారం, నగదు అపహరణ

తెనాలి, నవంబరు 4, (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలోని ఒక ప్రముఖ వైద్యుని ఇం టిలో జరిగిన భారీ దొంగతనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న హాస్పిటల్ పైఅంతస్తులో డాక్టర్ దంపతుల కుటుంబం నివాసం ఉంటోంది. వారి ఇంటిలో దాచిన నగదు గతంలో పలుమార్లు మాయం కావడంతో స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేశారు. అక్కడ పనిచేవారిలో ఎవరైనా చేసి ఉంటా రని అనుమానించారు. ఆ వివరాలనే ఫిర్యాదులో పేర్కొన్నారు. అ యితే ఆ దొంగతనాల గుట్టు తేలకముందే తాజాగా పెద్ద మొత్తంలో బంగారం దొంగతనం జరగడం సంచలనం కలిగించింది. రూ.60 లక్షల విలువైన బంగారు బిస్కెట్లు మాయమైనట్టు గుర్తించిన డాక్టర్ మంగళవారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశా రు. ఈ వరుస దొంగతనాల వెనుక ఇంటి దొంగల పని అయి ఉంటుందన్న అను మానం ఒక కోణంలో, పనిచేస్తున్న వ్యక్తులపై అనుమానంతో మరో కోణంలో విచారణ చేస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. దీనిపై డీఎస్పీ జనార్దనరావును వివరణ కోరితే ఫిర్యాదు అందినమాట వాస్తవమేనని, విచారణ జరుపుతున్నామని, త్వరలో దొంగలను గుర్తిస్తామని పేర్కొన్నారు. అయితే ఈ కేసుకు సంబంధించి ఎవరి పేర్లూ పోలీసులు వెల్లడించ లేదు. కేసు నమోదు చేసిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ వివరించారు.


పుల్లడిగుంట పొలాల్లో విరబూసిన ముద్దబంతిపూలు

బంతిపూల సోయగం

ఇక్కడ కనిపిస్తున్న తోట అరకు వ్యాలీలోని వలిసి పూల తోట అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఇవి గుంటూరు రూరల్ మండల పరిధిలోని పుల్లడి గుంట పొలాల్లో విరబూసిన ముద్దబంతి పూలతోటలు. కార్తీకమాసం పూజల్లో విస్తృతంగా ఉపయోగించే ముద్దబంతిపూలకు ఎంతో డిమాండ్ ఉంటుంది. దీంతో రైతులు విస్తారంగా సాగుచేశారు. వందల ఎకరాల్లో విస్తరించిన ఈ ముద్దబంతి పూలతోటలు అరకు వ్యాలీని తలపించేలా ఉన్నాయి. గుంటూరు నుంచి పర్చూరు, పాత మద్రాసు రోడ్డులో ప్రయాణించే వారికి ఈ పూల తోటలు కనువిందు చేస్తూ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

-గుంటూరు (ఆంధ్రజ్యోతి)


రోడ్డుపై పూలు విక్రయిస్తున్న రైతులు

ఫ్యాషన్



కనువిందైన ఫోలియేజ్

రంగురంగుల పూలను ఇష్టపడని వారు ఎవరైనా ఉంటారా? అలాంటి ఆకట్టుకునే అందాలను ఫ్యాషన్ ప్రపంచం కూడా ఆదరిస్తోంది. కాబట్టే వినూత్నమైన 'ఫోలియేజ్' డ్రస్సులు రూపొందుతున్నాయి. వాటి మీద ఓ లుక్కేద్దాం!

ఆధునికత ఉట్టిపడే దుస్తుల ఫ్యాషన్‌గా తాజాగా ఫోలియేజ్ స్టైల్ సర్వత్రా ఆదరణ పొందుతోంది. సుతిమెత్తని మెటీరియల్స్‌తో రూపొందే ఈ తరహా దుస్తులు ఈవినింగ్ పార్టీలు, సరదా షికార్లు, ప్రయాణాలు... ఇలా అన్ని సందర్భాలకూ అనువుగా ఉంటాయి.



ఆకులు రాలేలా...

ఆటమ్ డ్రస్ సుతిమెత్తని మెటీరియల్‌తో తయారవుతుంది. ఈవినింగ్ పార్టీలు, వేడుకల్లో అందరి దృష్టినీ ఆకర్షించడం కోసం ఈ డ్రస్‌ను ఎంచుకోవచ్చు. హుందాగా, ఫ్యాషన్‌గా కనిపించేలా చేసే ఆటమ్ ఫోలియేజ్ ఫాల్ డ్రస్‌ను తేలికపాటి ప్లాటినం లేదా యాంటిక్ జ్యువెలరీ, హైహీల్స్‌తో మ్యాచ్ చేయాలి.

లినెన్ అందాల్లో...

బోహో స్టైల్‌లో మెరిసిపోవడం కోసం లినెన్ మెటీరియల్ డ్రస్ ఎంచుకోవాలి. మోడర్న్ లుక్ కోసం కాలర్, బెల్ట్ జోడించాలి. పెద్ద బకిల్ బెల్టులు ఈ దుస్తుల అందాన్ని రెట్టింపు చేస్తాయి. యాంకిల్ బూట్స్ అదనపు ఆకర్షణను తెచ్చి పెడతాయి.

కౌటా డ్రస్

ఆర్గానిక్ కాటన్ జెర్సీతో రూపొందే ఈ డ్రస్సులు అద్భుతమైన డిజైన్లలో రూపొందుతూ ఉంటాయి. దట్టమైన ఆకులు, లతలు, కొమ్మలు ఈ డిజైన్‌లో స్పష్టంగా కనిపిస్తాయి. అయితే ప్రకృతిని మరిపించే ఈ డిజైన్ దుస్తుల రంగుల్లో వైవిధ్యం కూడా కనబడుతుంది.

జీవనశైలి

చుండ్రు చికాకు పెడుతోందా?




శీతాకాలంలో బాగా చికాకు పుట్టించే సమస్య చుండ్రు. చలి గాలి, తేమ తక్కువగా ఉండడం తదితర కారణాల వల్ల తలపై చర్మం పొడిబారుతుంది. దీంతో పొలుసులు వచ్చి, దురద మొదలవుతుంది. అయితే చిన్న చిన్న చిట్కాలతో దీని నుంచి ఉపశమనం పొందవచ్చంటున్నారు నిపుణులు.

హైడ్రేటింగ్ షాంపూ: ఇది పొడిబారిన చర్మంపై తేమను పునరుద్ధరించడానికి దోహదపడుతుంది. ఈ షాంపూల్లో ఉపయోగించే కలబంద, కొబ్బరి పాలు, గ్లిజరిన్ లాంటివి తలపై చర్మానికి పోషకాలు అందించి సమతుల్యతను కాపాడతాయి. అయితే సల్ఫేట్, ఆల్కహాల్‌తో కూడిన షాంపూలకు దూరంగా ఉండండి. ఇవి సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి.

నూనెతో మర్దన: తలకు తరచూ నూనె పెట్టుకోవడం అమ్మమ్మల కాలం నుంచి అనుసరిస్తున్నదే అయినా... చుండ్రును నివారించడంలో ఇది ప్రభావవంతంగా పని చేస్తుంది. ముఖ్యంగా చలి కాలంలో. కొబ్బరి నూనె లేదా ఆలివ్, ఆల్మండ్ తదితర సహజసిద్ధమైన నూనెలు తలకు తేమను అందిస్తాయి. చర్మాన్ని పొడిబారకుండా రక్షిస్తాయి. తలకు నూనె పట్టించి, వేళ్లతో సున్నితంగా మర్దన చేస్తే... కుదుళ్ల వరకు చేరి, రక్త ప్రసరణను మెరుగవుతుంది. కనీసం అరగంట తరువాత లేదంటే రాత్రి పడుకొనే ముందు రాసుకొని తెల్లారి షాంపూతో స్నానం చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

గోరువెచ్చటి నీరు: చలి కాలంలో వేడినీళ్ల స్నానం హాయిగా అనిపిస్తుంది. కానీ బాగా వేడిగా ఉన్న నీటితో తల స్నానం చేస్తే చర్మం మరింత పొడిబారుతుంది. మాడులోని సహజసిద్ధమైన తేమను తగ్గిస్తుంది. చుండ్రు రావడానికి కారణమవుతుంది. అందుకే గోరువెచ్చని లేదా చన్నీటితో తల స్నానం చేయడం ఉత్తమం.


సమతుల ఆహారం: చుండ్రు నివారణలో మనం తీసుకొనే ఆహారం ప్రముఖ పాత్ర పోషిస్తుంది. సాధారణంగా శీతాకాలంలో వేడివేడిగా ఉండే నూనెలో వేయించిన ఆహార పదార్థాలు తీసుకొంటాం. నీళ్లు తక్కువగా తాగుతాం. వీటివల్ల తల చర్మం పొడిబారి, పొట్టు వస్తుంది. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, జింక్, విటమిన్ బి, ఇ అధికంగా ఉండే నట్స్, ఆకుకూరలను మీ మెనూలో చేరిస్తే... అవి చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచడానికి సహకరిస్తాయి. అలాగే నీళ్లు పుష్కలంగా తీసుకోవాలి. హెర్బల్ టీలు కూడా మంచి ఫలితాలనిస్తాయి.



వార్తల్లో వ్యక్తి

పూణెకు చెందిన 32 ఏళ్ల దయానా పుండోలె... తన ఫెరారి కారుతో అంతర్జాతీయ పోటీకి సిద్ధమవుతోంది. ఈ నెల నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకూ జరిగే 'ఫెరారీ క్లబ్ ఛాలెంజ్ మిడిల్ ఈస్ట్' కార్ల రేసులో పాల్గొనబోతున్న ఈ రేసర్ గురించిన ఆసక్తికరమైన విశేషాలు...

అంతర్జాతీయ పోటీలో మన మహిళా రేసర్



మధ్యప్రాచ్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఫార్ములా వన్ సర్క్యూట్స్‌లో తన ఫెరారీ 296 ఛాలెంజ్ కారుతో డయానా పుండోలె పోటీ పడుతోంది. ఈ పోటీలో భాగంగా ఆమె దుబాయి, అబుదాబి, బహ్రెయిన్, ఖతార్, సౌదీ అరేబియాల్లోని సర్క్యూట్స్‌లో సత్తా చాటబోతోంది. సాధారణంగా రేసు కార్ల పోటీలు పురుషులకే పరిమితం. అలాంటిది ఒక మహిళ ఈ రంగంలోకి ప్రవేశించి, గుర్తింపు పొందే స్థాయికి ఎదగడం అసాధారణమైన విషయమే! ఈ విషయంలో డయానా తన తండ్రి నుంచి స్ఫూర్తి పొందింది. రేసింగ్ పట్ల మక్కువ కలిగిన ఆ దివంగత మోటార్‌స్పోర్ట్స్ ఔత్సాహికవేత్త గురించి మాట్లాడుతూ... "రేసింగ్ పట్ల నాన్నకున్న మక్కువే నన్ను ఈ రంగంలోకి అడుగుపెట్టేలా ప్రోత్సహించింది. ఇప్పుడు ఆయన భౌతికంగా నాతో లేకపోయినా... నేను ట్రాక్ మీద ప్రయాణిస్తున్న ప్రతిసారీ ఈ క్రీడ పట్ల ఆయనకున్న మక్కువ నన్ను ముందుకు నడిపిస్తూనే ఉంటుంది" అంటూ తన తండ్రి గురించి చెప్పుకొచ్చింది డయానా!

నాన్న స్ఫూర్తితో...

కార్ల రేసులో డయానా ప్రస్థానం 2018లో మొదలైంది. క్రమేపీ మోటార్‌స్పోర్ట్స్‌లో ర్యాంకులు సాధిస్తూ, 2024లో మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లోని ఎమ్ఆర్ఎఫ్ సలూన్ కేటగిరీలో చేపట్టిన జాతీయ స్థాయి రేసింగ్ పోటీలో గెలిచింది. ఆ పోటీలో గెలిచిన మొట్టమొదటి భారతీయ మహిళగా గుర్తింపు తెచ్చుకునే స్థాయికి ఎదిగింది. ఒక జాతీయ స్థాయి రేసింగ్ పోటీలో ఒక మహిళ పురుష ప్రత్యర్థులను వెనక్కు నెట్టి గెలుపొందడం అదే ప్రథమం. ఆ విజయం గురించి ప్రస్తావిస్తూ... "జెండర్ కాదు, సామర్థ్యమే ఒక రేసర్‌ను నిర్వచిస్తుందనే నమ్మకం ఆ విజయంతో బలపడింది" అంటూ వివరించింది డయానా. ఆ విజయంతో, కార్ల రేసింగ్ పట్ల డయానాకు ఉన్న నిబద్ధత, పట్టుదల స్పాన్సర్ల దృష్టిని ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన రేస్‌టెక్ ఇండియా... 2022 నుంచి ఆమె రేసింగ్ పోటీలకు మద్దతు ఇవ్వడం మొదలుపెట్టింది. ఆమె జాతీయ స్థాయి విజయం తరువాత... అలైన్డ్ ఆటోమేషన్, ఫెరారీ న్యూఢిల్లీలు మధ్యప్రాచ్యంలో జరగబోతున్న ఫెరారీ ఛాలెంజ్‌లో ఆమె పాల్గొనేందుకు మార్గం సుగమం చేశాయి.

> **వేగం ఒక్కటే సరిపోదు**
>
> కార్ల రేసు పోటీలకు సిద్ధపడుతున్న డయానా భౌతిక సామర్థ్యంతో పాటు మానసిక ఏకాగ్రతను కూడా మెరుగుపరుచుకుంటోంది. అందుకోసం కార్డియోతో పాటు స్ట్రెంగ్త్ ట్రైనింగ్, రిఫ్లెక్స్ డ్రిల్స్, ధ్యానం సాధన చేస్తోంది. "రేసింగ్‌లో వేగం ఒక్కటే సరిపోదు. కచ్చితత్వం, స్థిరత్వం, మానసిక సామర్థ్యం కూడా ముఖ్యమే! ఒత్తిడిలో పట్టు తప్పిపోకుండా ఉండడం కోసం విజువలైజేషన్, ధ్యానం.. ఈ రెండింటినీ నేను సాధన చేస్తూ ఉంటాను" అంటూ వివరిస్తున్న డయానా, ఫెరారీ క్లబ్ ఛాలెంజ్ మిడిల్ ఈస్ట్ కార్ల రేసులో విజయం సాధించాలని కోరుకుందాం!

ఫెరారీ 296 ఛాలెంజ్

రేసింగ్ కోసం ఫెరారీ 296 ఛాలెంజ్ కారును ఎంచుకోవడంతో డయానా రేస్ ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. ప్రత్యేకంగా రేసులకు తగ్గట్టు మార్పులు చేసిన ఈ కారులో 700 హార్స్‌పవర్ వి6 ఇంజన్ బిగించి ఉంటుంది. కేవలం 1330 కిలోల బరువు మాత్రమే ఉండే ఈ కారు అత్యాధునిక యంత్రంలాంటిది. దీని ఏరోడైనమిక్స్ నడిపే సౌలభ్యం, కచ్చితత్వాలు మరో స్థాయిలో ఉంటాయి. "నా మునుపటి కార్లతో పోలిస్తే ఈ కారును నడపడం కాస్త కష్టమే! అయినప్పటికీ అంతిమంగా పొందే ప్రతిఫలం అద్భుతంగా ఉంటుంది" అంటూ తన రేసు కారు గురించి వివరిస్తున్న డయానా, దుబాయ్ ఆటోడ్రోమ్ యాస్ మెరీనాతో పాటు, బహ్రెయిన్ అంతర్జాతీయ సర్క్యూట్‌లో పోటీ పడబోతోంది. గతంలో ఆ ప్రదేశాల్లో శిక్షణ పొందాననీ, తిరిగి అవే సర్క్యూట్స్‌లో పోటీలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందనీ కూడా చెప్పుకొస్తోంది డయానా.

జీవితమే ఒక పయనం



అభిరుచి

ఇద్దరు చిన్ననాటి మిత్రులు... బడిలో మొదలైన వారి స్నేహం... కాలేజీలో ప్రేమై చిగురించింది. కొత్త ప్రదేశాలను చుట్టిరావాలన్న ఇద్దరి అభిరుచి వారినిమరింత దగ్గర చేసింది. వృత్తి జీవితంలో ఆ బంధం మూడు ముళ్ల అనుబంధమై మురిసింది. ఉన్నత కొలువులు... రెండు సంపాదనలు... కానీ వారికి సంతృప్తి ఇవ్వలేదు. అందుకే ఇరువురికీ ఎంతో ఇష్టమైన ప్రయాణం... వారి జీవన గమనంగా మారింది. కారే ఇల్లుగా... గమ్యస్థానం లేకుండా.... ఇప్పటికి 45 వేల కిలోమీర్లు సాగిన ఈ జర్నీ గురించి... ఆ జంటలో ఒకరైన కావ్య మాటల్లో...

"ఇది ఒక విచిత్ర ప్రయాణం. కానీ అనుకోనిది కాదు. అలాగని కలలు కన్నదీ కాదు. గజిబిజి జీవన గమనంలో... విద్య, ఉద్యోగం, స్థిర నివాసం... అందరూ ఒకే మార్గంలో పరుగెత్తుతుంటే... చూసి చూసి విసుగొచ్చింది. 'ఇదేనా జీవితం' అనిపించింది. అందుకే మా దారి మార్చుకున్నాం. ప్రకృతితో మమేకమై... భిన్న ప్రాంతాలకు పయనమై... సదా ప్రజలతో కలిసి జీవితాన్ని ఆస్వాదించాలని నిర్ణయించుకున్నాం. దాని ఫలితమే... ఇవాళ ఇలా దేశమంతా తిరుగుతున్నాం. మా కథ ఎక్కడ మొదలైందో తెలియాలంటే... మిమ్మల్ని ఒకసారి మా ఊరుకు తీసుకువెళ్లాలి. కేరళ రాష్ట్రం... పాలక్కడ్ జిల్లా.. పట్టంబి పట్టణం మా స్వస్థలం. మావారు సంగీత్. ఇద్దరివీ సాధారణ మధ్యతరగతి కుటుంబాలే.

చిన్ననాటి స్నేహం...

సంగీత్‌తో నా స్నేహం ఈనాటిది కాదు. ఇద్దరం ఒకే స్కూల్లో చదివాం. కలిసి ఒకే కాలేజీకి వెళ్లాం. కాలేజీలో మా పరిచయం ప్రేమగా మారింది. అందుకు మా ఇద్దరి అభిరుచి ఒకటే కావడం ప్రధాన కారణం. మాకు ట్రావెలింగ్ చాలా ఇష్టం. తరచూ సంగీత్ బైక్‌పై రైడ్‌కు వెళ్లేవాళ్లం. తరువాత మేం బెంగళూరు కాలేజీలో పీజీ చేరాం. ఇక అప్పటి నుంచి వీకెండ్ వచ్చిందంటే చాలు... బెంగళూరు సమీప ప్రాంతాలకు వెళ్లడం అలవాటుగా మారింది.

చేతి నిండా సంపాదిస్తున్నా...

పీజీ పూర్తయ్యాక ఇద్దరం ఉద్యోగాల్లో చేరాం. సంగీత్ ఎంబీయే గ్రాడ్యుయేటు. నేను డెయిరీ టెక్నాలజిస్టును. వేర్వేరు ఉద్యోగాలు అయినా రోజూ కలిసేవాళ్లం. కొన్నాళ్లకు మేమిద్దరం పెళ్లి చేసుకున్నాం. ఆ తరువాత కూడా మా క్యాంపింగ్ కొనసాగుతూనే ఉంది. అయితే... ఉదయం లేవడం, హడావుడిగా ఆఫీస్‌కు పరుగెత్తడం, అలసిపోయి ఇంటికి రావడం, ఏదో వండుకొని తినడం, పడుకోవడం... 'ఎన్నాళ్లిలా?' అనిపించింది. చేతి నిండా సంపాదన ఉన్నా... భవిష్యత్తు గురించి ఏ మాత్రం ఆందోళన లేకపోయినా... ఏదో అసంతృప్తి.



మానసిక ప్రశాంతత కోసం...

తరచూ పర్యటనలకు వెళుతున్న క్రమంలో మాకు అర్థమైంది ఏంటంటే... తీరికలేని ఈ పరుగులో... విలువైనది కోల్పోయామని. అదే మానసిక ప్రశాంతత. రోడ్డుపై దూసుకుపోతూ... కొత్త ప్రాంతాలు, మనుషుల మధ్య గడిపినప్పుడు మనసుకు ఎంతో హాయిగా అనిపించింది. ఐదేళ్లు కష్టంగా పని చేశాక అనిపించింది... ఇక ఉద్యోగాలకు స్వస్తి చెప్పి, పూర్తి స్థాయిలో పర్యటనల్లోనే గడిపేద్దామని. ఉద్యోగం లేకపోయినా బతకగలమనే నమ్మకం రావడానికి అన్నేళ్లు పట్టింది. మా ఖర్చుల కోసం ఫ్రీలాన్స్ జాబ్స్ మొదలుపెట్టాం.

కారే ఇల్లు...

కొవిడ్ లాక్‌డౌన్ తరువాత ఎలాంటి కారు అయితే బాగుంటుందనే దానిపై రెండేళ్లు అధ్యయనం చేశాం. అంత సమయం ఎందుకంటే... తక్కువ ఖర్చులో, సౌకర్యాలన్నీ సమకూర్చుకోగలిగేలా కారు ఉండాలి కదా. భద్రత కూడా చాలా ముఖ్యం. అన్నీ ఆలోచించి ఫోర్స్ గుర్ఖా ఎస్‌యూవీ కొన్నాం. కారును క్యాంపర్‌వ్యాన్‌గా మార్చాలంటే రెండు నుంచి మూడు లక్షల రూపాయలు అవుతుంది. అంత ఖర్చు చేయదలుచుకోలేదు. ఇరవై వేలలో మేమే సొంతంగా ఏర్పాట్లు చేసుకున్నాం. పోర్టబుల్ పవర్ స్టేషన్, కిచెన్ సామగ్రి, బాత్‌రూమ్ టెంట్... ఇలా అవసరమైనవి సమకూర్చుకున్నాం.

> **సవాళ్లు ఎన్నో...**
>
> "మా జర్నీ చూడడానికి సరదాగా అనిపిస్తుంది. కానీ, ప్రత్యేకించి ఒక మహిళగా నిత్యం ఎన్నో సవాళ్లు, సమస్యలు ఎదురవుతాయి. కొన్నిసార్లు బాత్‌రూమ్‌లు అందుబాటులో ఉండవు. దాని కోసం ఉదయం నాలుగు గంటలకే లేచి వెతుక్కోవాల్సి వస్తుంది. అప్పుడప్పుడూ అడవి జంతువులు వచ్చి పలుకరిస్తుంటాయి. ఒకసారి ఉత్తరాఖండ్ మున్సియారీలో టెంట్ వేసుకొని ఉన్నాం. రాత్రి సమయం. చిమ్మ చీకటి. ఏదో కదులుతూ మావైపు వస్తోంది. ఆ కదలికలను మా కారు సెన్సర్లు గుర్తించి, లైట్లు వెలిగాయి. చూస్తే చిరుత పులి. గుండె ఝల్లుమన్నది. దానినుంచి ఎలాగో తప్పించుకున్నాం. ఇప్పటివరకు మేం చుట్టివచ్చిన ప్రాంతాల్లో ప్రకృతి సౌందర్యాన్ని, మేము కలిసిన మనుషులను, వారు చూపిన ప్రేమానురాగాలను వీడియోలు తీసి ఇన్‌స్టాలో అప్‌లోడ్ చేస్తున్నాం. అక్కడ మాకు రెండున్నర లక్షల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు."

మా వంట మేమే...

ఉదయం కాలకృత్యాలు తీర్చుకొని జర్నీ మొదలుపెడతాం. రోజుకు నాలుగైదు వందల కిలోమీటర్లు ప్రయాణిస్తాం. క్యాంప్‌కు అనుకూలమైన ప్రదేశం చూసుకొంటాం. అవి ఎక్కువగా మారుమూల, కొండ ప్రాంతాలే అయి ఉంటాయి. స్థానికుల అనుమతితో ఖాళీ ప్రదేశంలో టెంట్ వేసుకొని రాత్రి విశ్రాంతి తీసుకొంటాం. ఇన్నేళ్ల ప్రయాణంలో ఏ రోజూ బయట తినలేదు. మా వంట మేమే చేసుకొంటాం. రోజుకు మాకు అయ్యే ఖర్చు ఎంతో తెలుసా..? రెండు నుంచి మూడొందల రూపాయలు. మాతోపాటు మా పెంపుడు కుక్క కూడా ఉంటుంది.

పది వేల మొక్కలు...

ఈ ప్రయాణం ప్రారంభించాకనే మాకు అసలైన జీవితం అంటే ఏమిటో తెలిసింది. ఇప్పటికి దేశవ్యాప్తంగా 45 వేల కిలోమీటర్లకు పైగా ప్రయాణించాం. అనేక కొత్త ప్రాంతాలకు వెళ్లాం. భిన్న సంస్కృతులతో మమేకమయ్యాం. కొత్త మనుషులను కలిశాం. వారు మాపై కురిపించే ఆప్యాయతలు, ఇచ్చే ఆతిథ్యాలు మరువలేనివి. అవన్నీ చూశాక... 'జీవితం ఇంత అందంగా ఉంటుందా? అనిపిస్తోంది. అలాగే వెళ్లే దారిలో మొక్కలు కూడా నాటుతున్నాం. ఎందుకంటే ఊర్లు కాంక్రీట్ అడవులుగా మారుతున్న నేపథ్యంలో భూతాపం పెరిగిపోతోంది. గత మూడు వేసవి కాలాల్లోనూ విపరీతమైన వేడి గమనించాం. ఇవన్నీ పచ్చదనం తగ్గి, కాలుష్యం పెరిగి, వాతావరణంలో సమతుల్యత దెబ్బతినడంవల్లే సంభవిస్తున్నాయి. దాన్ని తగ్గించడానికి మావంతు కృషిగా సాధ్యమైనన్ని మొక్కలు నాటాలని సంకల్పించాం. అలా ఇప్పటికి పదివేలకు పైగా నాటాం.



సంస్కృతీ సంప్రదాయాల సంగమంగా, గ్రామీణ భారతాన్ని చుట్టడమే లక్ష్యంగా, పర్యావరణ హితంగా మా ప్రయాణం ఇలానే కొనసాగించాలని ఆశిస్తున్నాం. అంతకుమించి మాకు పెద్ద కోరికలేవీ లేవు. ఎందుకంటే... నిజమైన సంతోషం అనేది మనం సంపాదించే డబ్బులో లేదు. మనం సంపాదించే అనుభవాల్లో ఉంది. ఇతరులతో పోలిస్తే మా సంపాదన తక్కువే కావచ్చు. కానీ జీవితంలో మేం ఎంతో ఎత్తులో ఉన్నామని మాత్రం చెప్పగలను."

పిల్లలు తప్పుదారి పట్టకుండా...

తల్లిదండ్రులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఒక్కోసారి పిల్లలు తప్పుదారి పడుతుంటారు. అలా కాకుండా పిల్లలను బాధ్యతాయుతంగా తీర్చిదిద్దే క్రమంలో తల్లిదండ్రులు అనుసరించాల్సిన పద్ధతుల గురించి తెలుసుకుందాం...

- పిల్లలు సాధారణంగా మంచి కంటే చెడువైపే ఎక్కువగా ఆకర్షితులవుతూ ఉంటారు. కాబట్టి వాళ్ల ప్రవర్తనని తరచూ గమనిస్తూ ఉండాలి. పిల్లలు ఏదైనా పొరబాటు చేస్తే దాని గురించి వివరిస్తూ, తప్పు ఒప్పుల తారతమ్యాన్ని విడమరిచి చెప్పాలి. అలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలి.
- పిల్లలపై ఆంక్షలు పెట్టకూడదు. వాళ్లకి ఆసక్తి లేని లక్ష్యాలను నిర్దేశించకూడదు. చదువు విషయంలో చిన్నారులను ఒత్తిడికి గురిచేయకూడదు. దీనివల్ల పిల్లల్లో సృజనాత్మకత తగ్గిపోతుంది. నిరాశ, నిస్పృహలతో వాళ్లు చెడు మార్గాలను అనుసరించే



ప్రమాదం ఏర్పడుతుంది. పిల్లలు ఏ అంశంలో ఆసక్తి చూపిస్తున్నారో తెలుసుకుని ప్రోత్సాహాన్ని అందించాలి.
- పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగాలి. వాళ్ల మనసులోని భావాలను, అభిప్రాయాలను వ్యక్తపరిచే స్వేచ్ఛ ఇవ్వాలి. అప్పుడే పిల్లల వ్యక్తిత్వాన్ని చక్కదిద్దడం సాధ్యమవుతుంది.
- పిల్లలను మరొకరితో పోల్చకూడదు. తోబుట్టువుల మధ్య అంతరాలు పెరగకుండా చూడాలి. పిల్లల్లో ఏర్పడే ప్రతికూల భావాలను ఎప్పటికప్పుడు తొలగించే ప్రయత్నం చేయాలి. పిల్లల్లోని సానుకూలతలను గుర్తించి మనస్ఫూర్తిగా అభినందించాలి.
- పిల్లలకు సవాళ్లను ధైర్యంగా స్వీకరించడం అలవాటు చేయాలి. ఏ పనినైనా ఇష్టంగా పూర్తిచేయడం నేర్పించాలి. దీనివల్ల పిల్లల్లో పోరాట పటిమ, దేన్నయినా సాధించాలన్న తపన పెరుగుతాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,22,460	1,12,250	1,65,000
విజయవాడ	1,23,000	1,17,000	1,49,000
విశాఖపట్నం	1,24,020	1,13,000	1,65,000
రాజమండ్రి	1,22,450	1,12,250	1,49,000
ప్రొద్దుటూరు	1,20,800	1,11,140	1,50,000
ముంబై	1,20,419	1,10,304	1,46,150

ఎస్‌బీఐ @ రూ.100 లక్షల కోట్లు

సరికొత్త రికార్డు స్థాయికి బ్యాంక్ మొత్తం వ్యాపారం ● ఆస్తుల మొత్తం విలువ పరంగా ప్రపంచంలో 43వ అతిపెద్ద బ్యాంక్

ముంబై: దేశీయ ప్రభుత్వ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) సరికొత్త రికార్డును సృష్టించింది. బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.100 లక్షల కోట్లుకు చేరుకుందని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి మంగళవారం తెలిపారు. ఈ మార్చి చివరి నాటికి మరో రూ.5 లక్షల కోట్ల మేర పెరిగి రూ.105 లక్షలకు చేరుకోవచ్చని ఆయన అంచనా వేశారు. మొత్తం ఆస్తుల విలువపరంగా ప్రపంచంలో 43వ అతిపెద్ద బ్యాంక్‌గా నిలిచిందని సెప్టెంబరు త్రైమాసిక ఫలితాల విడుదల సందర్భంగా శెట్టి వెల్లడించారు. ప్రస్తుతం 23,050 శాఖలను నిర్వహిస్తోన్న ఎస్‌బీఐ.. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) చివరికల్లా మరో 500 బ్రాంచీలను ప్రారంభించాలని అనుకుంటున్నట్లు చెప్పారు.

» క్యూ2 లాభం రూ.21,137 కోట్లు
» యెస్ బ్యాంక్‌లో వాటా విక్రయం ద్వారా రూ.4,593 కోట్ల రాబడి



క్యూ2 లాభంలో 6.84 శాతం వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) ఎస్‌బీఐ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 6.84 శాతం వృద్ధితో రూ.21,137 కోట్లకు పెరిగింది. ప్రైవేట్ రంగానికి చెందిన యెస్ బ్యాంక్‌లో వాటా విక్రయం ద్వారా రూ.4,593 కోట్లు సమకూరడం ఇందుకు దోహదపడింది. కాగా, ఈ క్యూ2లో బ్యాంక్ స్టాండ్ ఎలోన్ లాభం 10 శాతం పెరిగి రూ.20,160 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇదే కాలంలో లాభం రూ.18,331 కోట్లుగా ఉంది. ఈ జూలై-సెప్టెంబరులో బ్యాంక్ రుణాలు 12.73 శాతం వృద్ధి చెందినప్పటికీ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) మాత్రం కేవలం 3.28 శాతం పెరిగి రూ.42,984 కోట్లకు పరిమితమైంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 0.17 శాతం తగ్గి 2.97 శాతానికి జారుకోవడం ఇందుకు కారణమైంది.

రుణ వృద్ధి అంచనా 12-14 శాతానికి పెంపు

ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి రుణ వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 11 శాతం నుంచి 12-14 శాతానికి పెంచుతున్నట్లు శెట్టి తెలిపారు. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు, ఆదాయం పన్ను శ్లాబుల్లో మార్పులు, ఆర్‌బీఐ నిబంధనల సడలింపులు సహా ఈ మధ్య కాలంలో ప్రభుత్వం చేపట్టిన విధానపరమైన చర్యలు ఇందుకు దోహదపడనున్నాయని ఆయన పేర్కొన్నారు. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు అమల్లోకి వచ్చాక రుణాలు, ముఖ్యంగా వాహన విభాగంలో భారీగా పుంజుకున్నాయని అన్నారు. గతంలో ప్రకటించిన విధంగా ఈ ఆర్థిక సంవత్సరానికి ఎన్ఐఎం 3 శాతంగా నమోదుకావచ్చని ధీమా వ్యక్తం చేశారు.

ఎన్‌పీఏలు 1.73 శాతం

బ్యాంక్ ఆస్తుల నాణ్యత విషయానికొస్తే, ఈ జూలై-సెప్టెంబరులో కొత్తగా రూ.4,754 కోట్ల రుణాలు మొండి బకాయిలుగా మారాయి. అయితే, ఈ సెప్టెంబరు చివరి నాటికి బ్యాంక్ మొత్తం మొండి బాకీలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) 1.73 శాతానికి తగ్గాయి. గడిచిన రెండు దశాబ్దాల్లో ఇదే అత్యల్పమని ఎస్‌బీఐ చైర్మన్ శెట్టి అన్నారు. కాగా, క్యూ2లో బ్యాంక్ కేటాయింపులు రూ.5,400 కోట్లకు పెరిగాయి.

అమెరికా సుంకాల ప్రభావం లేదు..

భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాలు ఆగస్టు చివర్లో అమలులోకి వచ్చినందున వాటి ప్రభావాన్ని అంచనా వేసేందుకు సెప్టెంబరు త్రైమాసికాన్ని పరిగణనలోకి తీసుకోలేమని శ్రీనివాసులు శెట్టి అన్నారు. ఇప్పటివరకైతే బ్యాంక్ రుణ వృద్ధి, ఆస్తుల నాణ్యతపై ట్రంప్ సుంకాల ప్రభావం లేదన్నారు. సమీక్షా కాలానికి బ్యాంక్ విదేశీ రుణాల వాటా రూ.6.76 లక్షల కోట్లు కాగా, అందులో అమెరికా మార్కెట్ వాటా 25 శాతంగా ఉందన్నారు.

రుణగ్రహీత వాదన విన్నాకే మోసపూరిత ఖాతాల ప్రకటన

సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మోసపూరిత బ్యాంకు ఖాతాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక ఖాతాను మోసపూరిత ఖాతాగా ప్రకటించే ముందు.. ఆ ఖాతాదారుడి వాదన వినడంలో బ్యాంకులకు వచ్చిన ఇబ్బంది ఏమిటని సూటిగా ప్రశ్నించింది. ఎస్‌బీఐ.. ఒక సంస్థ రుణ ఖాతాను మోసపూరిత ఖాతాగా ప్రకటించడాన్ని ఆక్షేపిస్తూ ఆ సంస్థ కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించింది. కోల్‌కతా హైకోర్టు ఈ కేసులో రుణగ్రహీత వాదన విన్న తర్వాతే ఆ ఖాతాను మోసపూరిత ఖాతాగా ప్రకటించాలని స్పష్టం చేసింది. ఎస్‌బీఐ దీన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ అప్పీల్‌ను విన్న జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం.. ఒక ఖాతాను మోసపూరిత ఖాతాగా ప్రకటించే ముందు రుణగ్రహీత వాదన వినడంలో బ్యాంకులకు వచ్చిన ఇబ్బంది ఏమిటని ప్రశ్నించింది. తదుపరి ఈ కేసు విచారణను సర్వోన్నత న్యాయస్థానం ఈనెల 18కు వాయిదా వేసింది.

ఫోర్బ్స్ బెస్ట్ ఎంప్లాయర్స్ జాబితాలో అమర రాజా గ్రూప్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమర రాజా గ్రూప్ మరో ఘనత సాధించింది. ఈ సంవత్సరానికి ఫోర్బ్స్ పత్రిక రూపొందించిన 'వరల్డ్స్ బెస్ట్ ఎంప్లాయర్స్-2025'లో స్థానం సంపాదించింది. ఫోర్బ్స్ పత్రిక ఈ సంవత్సరం ఇందుకోసం మొత్తం 31 కంపెనీలను ఎంపిక చేయగా అమర రాజా గ్రూప్ అందులో నూటికి 63.65 పాయింట్లతో 28వ స్థానంలో నిలిచింది. ఈ సంవత్సరం ఈ జాబితాలో మన దేశం నుంచి మొత్తం 6 కంపెనీలకు స్థానం లభించగా అందులో తమ గ్రూప్ ఒకటని అమర రాజా తెలిపింది.

పెరిగిన ఇండిగో నష్టాలు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో రూ. 2,582.10 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. విదేశీ మారక (ఫారెక్స్) నష్టాలు, వ్యయాలు లాభదాయకతపై తీవ్ర ప్రభావం చూపించాయని కంపెనీ పేర్కొంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నష్టాలు రూ. 986.7 కోట్లుగా ఉన్నాయి. అయితే ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో రూ. 2,176.30 కోట్ల లాభాన్ని ఆర్జించింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం 10 వృద్ధితో రూ.17,759 కోట్ల నుంచి రూ.19,599.5 కోట్లకు పెరిగింది.

మహీంద్రా లాభం రూ.3,673 కోట్లు

ముంబై: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ. 3,673 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.2,867 కోట్లు)తో పోల్చితే లాభం 28 శాతం వృద్ధి చెందింది. ఆటోమొబైల్‌తో పాటు వ్యవసాయ యంత్రాలు, పరికరాల విభాగాల్లో మెరుగైన పనితీరు కనబరచటం కలిసి వచ్చిందని మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ అనిష్ షా తెలిపారు. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.37,924 కోట్ల నుంచి రూ. 46,106 కోట్లకు పెరిగింది.

అపోలో హాస్పిటల్స్‌తో నవీ ముంబై ఎయిర్‌పోర్ట్ జట్టు

ముంబై: విమానాశ్రయ ఉద్యోగులు, ప్రయాణికులకు నిరంతరాయంగా సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలందించేందుకు నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంతో (ఎన్ఎంఐఏఎల్) అపోలో హాస్పిటల్స్ చేతులు కలిపింది. ఇటీవలే లాంఛనంగా ప్రారంభమైన ఈ విమానాశ్రయం నుంచి విమానాల రాకపోకలు డిసెంబరు ప్రథమార్ధం నుంచి ప్రారంభమవుతాయి. ఉభయ సంస్థల మధ్య కుదిరిన అంగీకారం ప్రకారం విమానాశ్రయం టెర్మినల్ 1లో అపోలో హాస్పిటల్స్ 24 గంటలూ పని చేసే ఒక వైద్య కేంద్రాన్ని ప్రారంభించనుంది. ఈ కేంద్రంలో ఎమర్జెన్సీ వైద్య సేవలతో పాటు వైపరీత్య నిర్వహణా సదుపాయాలు కూడా ఉంటాయని అపోలో హాస్పిటల్స్ తెలిపింది. ఇదిలా ఉండగా ఏ క్షణంలో అయినా స్పందించేందుకు వీలుగా ఎన్ఎంఐఏఎల్‌లో రెండు ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) అంబులెన్స్‌లను విమానాశ్రయం వద్ద ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుతుంది.

సెమీకండక్టర్ల రంగంలోకి బ్లూ క్లౌడ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ లిమిటెడ్ (బీసీఎస్ఎస్ఎల్) సెమీకండక్టర్ల రంగంలోకి విస్తరిస్తోంది. ఇందుకు అవసరమైన టెక్నాలజీ ఓనర్‌షిప్ ట్రాన్స్‌ఫర్ కోసం ఒక ఇజ్రాయెల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద ఇజ్రాయెల్ కంపెనీ ఎడ్జ్-ఏఐ చిప్ హార్డ్‌వేర్ డిజైన్, సెమీకండక్టర్ల తయారీకి అవసరమైన టెక్నాలజీని బీసీఎస్ఎస్ఎల్‌కు బదిలీ చేస్తుంది. ఇందుకోసం బీసీఎస్ఎస్ఎల్.. ఇజ్రాయెల్ కంపెనీకి 15 కోట్ల డాలర్లు (సుమారు రూ.1,330 కోట్లు) చెల్లిస్తుంది. చిప్స్, సెమీకండక్టర్లకు ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఆఫ్ థింగ్స్ (ఏఐఓటీ), ఇండస్ట్రియల్ ఆటోమేషన్ అప్లికేషన్స్‌లో విరివిగా ఉపయోగిస్తారు. భారత సెమీకండక్టర్ల రంగంలో 'ఆత్మనిర్భరత' సాధనలో ఈ ఒప్పందం ఒక కీలక ముందడుగు' అని బీసీఎస్ఎస్ఎల్ చైర్మన్ జానకి యార్లగడ్డ తెలిపారు.



ధర రూ.7.89 లక్షలు

మార్కెట్లో హ్యుండయ్ సరికొత్త వెన్యూ

న్యూఢిల్లీ: హ్యుండయ్ మోటార్ కంపెనీ సరికొత్త హంగులతో తయారుచేసిన కాంపాక్ట్ ఎస్‌యూవీ వెన్యూను మార్కెట్లో విడుదల చేసింది. దీని ధర రూ.7.89 లక్షలు (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్). ఇది పెట్రోల్, డీజిల్ వెర్షన్లలో మాన్యువల్, ఆటోమేటిక్ ఇంజన్లతో అందుబాటులో ఉంటుంది. రూ.1,500 కోట్ల పెట్టుబడితో అభివృద్ధి చేసిన ఈ కొత్త తరం వెన్యూ కారును కొత్తగా ప్రారంభించిన పుణె ప్లాంట్‌లోనే ఉత్పత్తి చేస్తామని త్వరలో ఎండీ, సీఈఓగా బాధ్యతలు చేపట్టనున్న ప్రస్తుత చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ చెప్పారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే కార్లు దేశీయ అవసరాలకే కాకుండా 30 దేశాలకు కూడా ఎగుమతి చేస్తామని ఆయన తెలిపారు. కాంపాక్ట్ ఎస్‌యూవీ విభాగంలో ఈ కారు మారుతి బ్రెజ్జా, టాటా నెక్సన్, కియా సోనెట్‌తో పోటీ పడుతుంది.

రూ.2.71 లక్షల కోట్ల సంపద నష్టం

సెన్సెక్స్ 519 పాయింట్లు పతనం

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాల నేపథ్యంలో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడటంతో పాటు విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా దేశీయ ఈక్విటీ సూచీలు మంగళవారం భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ 519.34 పాయింట్లు క్షీణించి 83,459.15 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 165.70 పాయింట్లు కోల్పోయి 25,597.65 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.2.71 లక్షల కోట్లు తగ్గి రూ.469.80 లక్షల కోట్లకు పడిపోయింది.

నేడు మార్కెట్లకు సెలవు

గురునానక్ జయంతి సందర్భంగా బుధవారం స్టాక్ మార్కెట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. గురువారం మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	575
వరంగల్	572	గోదావరి	585
చిత్తూరు	603	విశాఖపట్నం	570
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	109
వరంగల్	107	గుంటూరు	113
కరీంనగర్	107	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	105
కర్నూలు	107	నెల్లూరు	110
విశాఖపట్నం	108	అనంతపురం	110
గోదావరి	109		


పండగల సీజన్‌లో రుణ వితరణ అదుర్స్

బజాజ్ ఫైనాన్స్

న్యూఢిల్లీ: ఈ ఏడాది పండగల సీజన్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లకూ బాగానే కలిసొచ్చింది. బజాజ్ ఫైనాన్స్ ఈ ఏడాది సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 26 మధ్య కాలంలో రికార్డు స్థాయిలో దాదాపు 63 లక్షల రుణాలు మంజూరు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది విలువపరంగా 29 శాతం, పరిమాణపరంగా 27 శాతం ఎక్కువని తెలిపింది. జీఎస్‌టీ 2.0 సంస్కరణలు, కేంద్ర బడ్జెట్‌లో ఆదాయ పన్ను తగ్గించడం ఇందుకు ప్రధాన కారణమని బజాజ్ ఫైనాన్స్ చైర్మన్ సంజీవ్ బజాజ్ తెలిపారు. ఈ ఏడాది పండగల సీజన్‌లో 23 లక్షల మంది కొత్త ఖాతాదారులు కంపెనీ నుంచి రుణాలు తీసుకున్నారు. వీరిలో 52 శాతం మంది జీవితంలో తొలిసారి రుణాలు తీసుకున్న వ్యక్తులని బజాజ్ ఫైనాన్స్ తెలిపింది.

స్పోర్ట్స్

27న ఢిల్లీలో డబ్ల్యూపీఎల్ వేలం



న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) క్రికెటర్ల వేలాన్ని ఈనెల 27న ఢిల్లీలో నిర్వహించనున్నారు. ఈ మేరకు లీగ్‌లోని అన్ని జట్లకు బీసీసీఐ సమాచారం ఇచ్చింది. ఈసారి వేలం పూర్తి స్థాయిలో జరగనుంది. ప్రతి జట్టు ఐదుగురు ప్లేయర్లను తిరిగి అట్టి పెట్టుకోవచ్చు. ఇందులో ముగ్గురు స్వదేశీ, ఇద్దరు విదేశీ క్రికెటర్లు ఉండాలి. వేలానికి ప్రతి జట్టుకు రూ.15 కోట్ల పర్సు కేటాయించారు. అట్టిపెట్టుకునే క్రికెటర్లను ఐదు విభాగాలు (రూ.3.5 కోట్లు, రూ.2.5 కోట్లు, రూ.1.75 కోట్లు, రూ.1 కోటి, రూ.5 నుంచి 50 లక్షలు)గా విభజించారు.

ఐసీసీ జట్టులో స్మృతి, దీప్తి, జెమీమా



దుబాయ్: మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో విశేషంగా రాణించిన ప్లేయర్లతో టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్‌ను ఐసీసీ ప్రకటించింది. ఇందులో ఫైనల్‌కు చేరిన రెండు జట్ల నుంచి ఆరుగురికి చోటు దక్కింది. అలాగే భారత్ నుంచి స్మృతీ మంధాన, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్ ఎంపికయ్యారు. టీమ్ కెప్టెన్‌గా వోల్వార్ట్‌ను నియమించగా, దక్షిణాఫ్రికా నుంచే కాప్, డిక్లెర్క్ ఉన్నారు. ఇతర క్రికెటర్లలో గార్డ్‌నర్, సదర్లాండ్, అలన కింగ్ (ఆస్ట్రేలియా), సిద్రా నవాజ్ (పాక్ కీపర్), ఎకెల్‌స్టోన్, సివర్ బ్రంట్ (ఇంగ్లండ్) ఉన్నారు.

మంధానను దాటేసి..

నెం.1 బ్యాటర్ వోల్వార్ట్
ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ టాప్-10లో జెమీమా



దుబాయ్: టీమిండియా స్టార్ బ్యాటర్ స్మృతీ మంధాన వన్డేల్లో నెంబర్ వన్ స్థానాన్ని కోల్పోయింది. గతవారం ముగిసిన మహిళల వన్డే ప్రపంచ కప్‌లో అత్యధిక పరుగుల (571)తో రికార్డు సృష్టించిన దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ టాప్ ర్యాంక్‌కు చేరుకుంది. మంగళవారం ఐసీసీ ప్రకటించిన మహిళల వన్డే ప్రపంచకప్ బ్యాటర్ల జాబితాలో రెండు స్థానాలు ఎగబాకిన వోల్వార్ట్.. 814 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. మంధాన (811) రెండో ర్యాంక్‌కు పడిపోయింది. వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియాతో సెమీఫైనల్లో సూపర్ సెంచరీతో ఆకట్టుకున్న టీమిండియా యువ కెరటం జెమీమా రోడ్రిగ్స్ ఏకంగా తొమ్మిది స్థానాలు ఎగబాకి పదో ర్యాంక్‌తో టాప్-10లో నిలిచింది. సారథి హర్మన్‌ప్రీత్ 14వ స్థానంలో ఉంది. బౌలర్లలో సోఫీ ఎకెల్‌స్టోన్ టాప్‌లో ఉండగా, భారత్‌కు చెందిన దీప్తి శర్మ ఐదో ర్యాంక్‌లో కొనసాగుతోంది.

అప్పట్లో మ్యాచ్‌కు రూ. 1000 ఇచ్చారు

మిథాలీ రాజ్



న్యూఢిల్లీ: ఇప్పుడంటే భారత మహిళల క్రికెట్‌లో ఏదైనా పెద్ద టోర్నమెంట్ గెలిస్తే, జట్టు సభ్యులు నజరానాల రూపంలో రూ. కోట్లు అందుకుంటున్నారు. వార్షిక కాంట్రాక్టుల రూపంలో రూ. లక్షలు దక్కుతున్నాయి. ఆర్థికంగా క్రికెటర్లు భారీగానే లాభపడుతున్నారు. కానీ, గతంలో మహిళా క్రికెటర్లకు కనీసం మ్యాచ్ ఫీజులు కూడా లేవని టీమిండియా మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకుంది. 'ఒకప్పుడు మాకు మ్యాచ్ ఫీజులు, వార్షిక కాంట్రాక్టులు లేవు. 2005 ప్రపంచ కప్‌లో రన్నరప్‌గా నిలిచాం. అప్పుడు మాకు ఒక్కో మ్యాచ్‌కి రూ. 1000 చొప్పున ఇచ్చారు. అది కూడా ఆ టోర్నీ వరకే. అప్పట్లో మహిళల క్రికెట్ నుంచి వచ్చే ఆదాయం తక్కువ. అందుకే మ్యాచ్ ఫీజులు కూడా ఉండేవి కావు. మహిళల క్రికెట్ సంఘం.. బీసీసీఐలో విలీనం అయ్యాక మ్యాచ్ ఫీజులు, వార్షిక కాంట్రాక్టులు మొదలయ్యాయి. మొదట్లో మాకు సిరీస్‌కు ఇంత అని ఇచ్చేవారు. ఆ తర్వాత ఒక్కో మ్యాచ్‌కు వేతనం చెల్లించారు. ఇప్పుడు పురుషుల జట్టుతో సమానంగా మహిళల జట్టుకు వేతనాలు అందిస్తున్నారు' అని నాటి పరిస్థితులను మిథాలీ వివరించింది. 1973 నుంచి 2006 వరకు భారత్‌లో మహిళా క్రికెట్ కార్యకలాపాలను మహిళల క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూసీఏఐ) పర్యవేక్షించింది. 2006 చివర్లో డబ్ల్యూసీఏఐని బీసీసీఐలో విలీనం చేశాక మహిళా క్రికెటర్ల వేతనాల్లో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది.

బ్రాండ్ వాల్యూ రయ్..రయ్

న్యూఢిల్లీ: తొలిసారిగా మహిళల వరల్డ్‌కప్‌ను సాధించిన భారత క్రికెటర్ల దశ తిరిగింది. ఇప్పటికే ఐసీసీ నజరానాతో పాటు బీసీసీఐ సైతం భారీ స్థాయిలో నగదును ప్రకటించింది. దీనికి తోడు ఆయా సంస్థలు, రాష్ట్రాలు కూడా తమ ప్లేయర్లపై కనకవర్షాన్ని కురిపిస్తున్నాయి. అలాగే పలువురు క్రికెటర్లను తమ కంపెనీల ఉత్పత్తుల ప్రచారానికి కార్పొరేట్ సంస్థలు ముందుకు వస్తున్నాయి. అటు చాంపియన్ హోదాలో ఆటగాళ్ల బ్రాండ్ విలువ కూడా 25 నుంచి 100 శాతం పెరిగినట్టు సమాచారం. స్మృతీ మంధాన, హర్మన్‌ప్రీత్, జెమీమా, దీప్తి శర్మ, షఫాలీల వెంట ఇప్పుడు కంపెనీలు క్యూ కడుతున్నాయి. అటు సోషల్ మీడియాలోనూ వీరికి ఫాలోవర్ల సంఖ్య ఎక్కువే. బ్రాండ్ ఎండార్స్‌మెంట్ కోసం ఆయా ప్లేయర్ల ఏజెన్సీలను సంప్రదించినప్పుడు వారు రెండింతల నుంచి మూడింతల వరకు రేటు చెబుతున్నారట. అంతేకాకుండా ఇప్పటికే కొనసాగుతున్న సంస్థలు తమ ఒప్పందాలను రెన్యువల్ చేసుకునేందుకు ముందుకు వస్తున్నాయి. ముఖ్యంగా సెమీస్‌లో సెంచరీతో ఆస్ట్రేలియాను ఓడించిన జెమీమా బ్రాండ్ విలువ ఏకంగా వంద శాతం పెరగడం గమనార్హం. వాస్తవానికి ఆసీస్‌తో మ్యాచ్ ముగిసినప్పటి నుంచే జెమీమాతో ఒప్పందం కోసం తమకు విపరీతంగా కాల్స్ వస్తున్నట్టు జేఎస్ డబ్ల్యూ ఏజెన్సీ పేర్కొంది. ఇప్పుడు ఆమె ఒక్కో బ్రాండ్‌కు రూ.75 లక్షల నుంచి రూ.1.5 కోట్ల వరకు వసూలు చేస్తోంది. అటు మంధాన ఇప్పటికే 16 బ్రాండ్లతో అందరికన్నా ముందుండగా, ఒక్కో ప్రకటనకు ఆమె రూ.1.5 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు తీసుకుంటోంది.

ఎవరికి ఎంత మొత్తం..

విశ్వకప్ గెలుచుకున్న భారత మహిళా జట్టు ప్లేయర్లు కోటీశ్వరులు కాబోతున్నారు. విజేతగా నిలిచినందుకు ఐసీసీ దాదాపు రూ.40 కోట్లను ప్రైజ్‌మనీగా అందించింది. దీనికి తోడు బీసీసీఐ సైతం రూ. 51 కోట్లను ఇవ్వనుంది. అంటే రెండు కలిపితే సుమారు రూ. 91 కోట్లు. ఈ మొత్తాన్ని క్రీడాకారిణులు, కోచింగ్ సిబ్బంది (హెడ్ కోచ్, బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లు), సహాయక సిబ్బంది (ఫిజియో, ట్రైనర్, ఎనలిస్టు, డాక్టర్, లాజిస్టిక్స్.. తదితరులు)తోపాటు మరికొంతమంది పంచుకోవాల్సివుంటుంది. దీంతో జట్టులో ఒక్కో ప్లేయర్‌కు ఎంత మొత్తం దక్కనుందనే ఆసక్తి వ్యక్తమవుతోంది. కానీ ఈ వివరాలను అధికారికంగా ప్రకటించలేదు. అయితే ఆటగాళ్లు 70 శాతం, కోచింగ్ స్టాఫ్ 10 శాతం, సహాయక సిబ్బంది 7 శాతం అందుకుంటారని చెబుతున్నారు. ఇంకా సెలెక్టర్లు..ఇతరత్రా సిబ్బంది కూడా ఉంటారు. ఇది కాకుండా పేసర్లు రేణుకా సింగ్, క్రాంతి గౌడ్‌లకు వారి రాష్ట్రాల నుంచి రూ. కోటి చొప్పున.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కు పంజాబ్ నుంచి రూ.11 లక్షలు, అమన్‌కు రూ.5 లక్షలు దక్కనున్నాయి. ఇక సూరత్ వ్యాపారి ఆటగాళ్లందరికీ వజ్రాల ఆభరణాలను ఇవ్వనున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే.

ఢిల్లీ చేరుకున్న క్రికెటర్లు

భారత మహిళా క్రికెటర్లు ముంబైనుంచి మంగళవారం న్యూఢిల్లీ చేరుకున్నారు. హోటల్ వద్ద వారికి అభిమానులు బాణాసంచాతో ఘన స్వాగతం పలికారు. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమవుతారు.

2028 ఒలింపిక్స్ నుంచి మీరాబాయి కేటగిరి తొలగింపు

53 కిలోలకు మారనున్న భారత లిఫ్టర్



న్యూఢిల్లీ: భారత స్టార్ లిఫ్టర్, టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత మీరాబాయి చాను ప్రస్తుతం పోటీపడుతున్న 49 కిలోల బరువు విభాగాన్ని వచ్చే 2027 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ నుంచి తొలగించారు. విశ్వక్రీడల మహిళల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ ఈవెంట్లను 12 (పురుషులు 6, మహిళలు 6)కు పెంచడంలో భాగంగా ఇప్పటిదాకా ఉన్న అతి తక్కువ వెయిట్ కేటగిరిని 49 నుంచి 53 కిలోలకు ఐఓసీ మార్చినట్టు అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య (ఐడబ్ల్యూఎఫ్) తెలిపింది. వాస్తవానికి మీరాబాయి.. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో 49 కిలోల విభాగంలోనే రజతం సాధించింది. ఐఓసీ తాజా నిర్ణయంతో రానున్న ఒలింపిక్స్‌లో మీరా 53 కిలోల విభాగం నుంచి బరిలోకి దిగే అవకాశముంది. అయితే వచ్చే ఏడాది ఆసియా క్రీడల వరకు మీరా, తన పాత కేటగిరి 49 కిలోల్లోనే పోటీపడుతుంది. తాజా ఐఓసీ నిర్ణయం ప్రకారం వచ్చే ఒలింపిక్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్‌లో మహిళల విభాగం నుంచి 53, 61, 69, 77, 86, 86+ కిలోలు, పురుషుల తరఫున 65, 75, 85, 95, 110, 110+ కిలోల విభాగాల్లో లిఫ్టర్లు పోటీపడాల్సి ఉంటుంది.

ఆంధ్ర ఇన్నింగ్స్ విజయం

ఒడిశాతో రంజీ ట్రోఫీ

కటక్: ఒడిశాతో జరిగిన గ్రూప్ 'ఎ' రంజీ ట్రోఫీ ఎలీట్ మ్యాచ్‌లో ఆంధ్ర ఇన్నింగ్స్ 50 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఫాలోఆన్ కోసం బరిలోకి దిగిన ఒడిశా మంగళవారం తమ రెండో ఇన్నింగ్స్‌లో 274 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ గౌరవ్ చౌధురి (80), సందీప్ పట్నాయక్ (63) అర్ధసెంచరీలు సాధించారు. నాలుగో రోజు ఒడిశా 190/2 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో ఆట ఆరంభించింది. మిడిలార్డర్‌లో రాజేశ్ (38) మాత్రమే కాస్త పోరాడాడు. విజయ్, సౌరభ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. అంతకుముందు ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 475/7 స్కోరుతో డిక్లేర్ చేయగా, ఒడిశా 151 పరుగులకు ఆలౌటైంది. దీంతో ఆంధ్రకు 324 పరుగుల ఆధిక్యం దక్కింది. ఇక ఆంధ్ర ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఓ విజయంతో 8 పాయింట్లతో నిలిచింది.


ఐసీసీ మీటింగ్‌కు నఖ్వీ డుమ్మా!

కరాచీ: ఐసీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశానికి పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్ మొహిసిన్ నఖ్వీ గైర్హాజరయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే ఈ మీటింగ్‌లో బీసీసీఐ తమ జట్టుకు అందాల్సిన ఆసియాకప్‌పై చర్చించే అవకాశం ఉంది. మంగళవారం దుబాయ్‌లో ఆరంభమైన ఐసీసీ బోర్డు సమావేశం మరో మూడు రోజుల పాటు కొనసాగుతుంది. పాక్ ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరిస్తున్న నఖ్వీ స్థానిక రాజకీయ వ్యవహారాల కారణంగా రాలేకపోతున్నారని పీసీబీ వర్గాలు పేర్కొంటున్నాయి. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత ఆటగాళ్లు చాంపియన్‌గా నిలిచాక నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకునేందుకు ఇష్టపడలేదు. దీంతో నఖ్వీ ఆ ట్రోఫీని తీసుకెళ్లి తన ఆఫీసులో పెట్టి తాళం వేసుకున్న విషయం తెలిసిందే. నఖ్వీ స్థానంలో పీసీబీ సీఓఓ సుమైర్ సయ్యద్ హాజరయ్యే అవకాశం ఉంది.

అర్జున్ శుభారంభం

పనాజీ: తెలుగు గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ ఫిడే వరల్డ్‌కప్‌లో శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన రెండో రౌండ్ తొలిగేమ్‌లో అర్జున్ 37 ఎత్తుల్లో మార్టిన్ పిట్రోవ్ (బల్గేరియా)పై నెగ్గాడు. అర్జున్‌కు తొలి రౌండ్‌లో బై లభించడం తెలిసిందే. అరవింద్ చిదంబరంతో గేమ్‌ను ఆంధ్ర జీఎం కార్తీక్ వెంకట్రామన్ డ్రా చేసుకున్నాడు. గుకేష్, ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతి, ఎస్ఎల్ నారాయణ్ కూడా రెండో రౌండ్ తొలి గేమ్‌లను డ్రాగా ముగించారు.

అండర్-19 వన్డే చాలెంజర్ ట్రోఫీకి ద్రవిడ్ చిన్న కొడుకు



న్యూఢిల్లీ: దిగ్గజ ఆటగాడు రాహుల్ ద్రవిడ్ చిన్న కుమారుడు అన్వయ్ అండర్-19 వన్డే చాలెంజర్ ట్రోఫీకి ఎంపికయ్యాడు. బుధవారం నుంచి హైదరాబాద్ వేదికగా జరిగే ఈ టోర్నీలో 'సి' జట్టు తరఫున 17 ఏళ్ల అన్వయ్ పాల్గొంటున్నాడు. టాపార్డర్ బ్యాటర్, వికెట్ కీపర్‌గా అన్వయ్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఆరోన్ జార్జ్ జట్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఏ, బి, సి, డి జట్లు పోటీపడే ఈ టోర్నీ 11న ముగియనుంది. కాగా, ద్రవిడ్ పెద్ద కుమారుడు సమిత్.. మహారాజా టీ20 కేఎస్‌సీ ట్రోఫీలో ఆడిన తెలిసిందే.

రోడ్ల నాణ్యతలో రాజీ వద్దు

గుంతలు పడితే అధికారులదే బాధ్యత

- 'సాస్కి' నిధులు సద్వినియోగం చేసుకోండి
- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ దిశానిర్దేశం

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రహదారుల నిర్మాణంలో రాజీ పడవద్దని, నాణ్యంగా నిర్మించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. నిర్మాణానంతరం.. ఆయా రహదారులపై గుంతలు పడితే దానికి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్రంలోని గ్రామీణ రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సాస్కి(రాష్ట్రాల మూలధన పెట్టుబడులకు ఇచ్చే ప్రత్యేక సహాయ నిధులు) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం కింద రాష్ట్రానికి రూ.2 వేల కోట్ల నిధులు సమకూరాయని తెలిపారు. వీటితో రోడ్లను పునర్నిర్మించే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. తొలుత పూర్తిగా ధ్వంసమైె రహదారులను నిర్మించాలన్నారు. సాస్కి నిధులను వినియోగించే ప్రణాళికలపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. రహదారుల నాణ్యతలో రాజీపడవద్దని చెప్పారు. "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. ప్రత్యేక శ్రద్ధతో సాస్కి నిధులు తీసుకొచ్చాం. వాటి ఫలాలు ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులతోపాటు అధికార యంత్రాంగంపైనా ఉంది. ప్రతి నియోజకవర్గంలో రోడ్లు మెరుగుపడేలా నిధులు సమకూరుస్తున్నాం. రహదారుల నిర్మాణంలో ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో పరిశీలించాల్సిన బాధ్యత అధికారులదే. కాంట్రాక్టు పొందిన వారికి ముందుగానే నాణ్యతా ప్రమాణాల గురించి తెలియజేయాలి. ఆ ప్రమాణాల మేరకు రహదారులను నిర్మిస్తున్నదీ లేనిదీ ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం అవసరం ఉంది. నిర్మాణం మొదలయ్యాక పలు దశల్లో నాణ్యత పరిశీలించాలి. నేను కూడా నిపుణులను తీసుకుని క్షేత్రస్థాయిలో రహదారుల నాణ్యతను తనిఖీ చేస్తా. ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఏ మాత్రం అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదు." అని తేల్చిచెప్పారు.



గత ప్రభుత్వం విస్మరించింది

సాస్కి నిధులను ప్రత్యేక సందర్భాల్లో ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కూడా వినియోగించుకోవచ్చని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. పుట్టపర్తిలో సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పంచాయతీ రోడ్లను పటిష్ఠ పరచాలని తెలిపారు. దీనికిగాను రూ.35 కోట్లను సాస్కి నిధుల నుంచి వెచ్చించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. రోడ్ల నిర్మాణం విషయంలో గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరించిందని విమర్శించారు. వివిధ మార్గాల్లో రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు వచ్చే వెసులుబాటు ఉన్నప్పటికీ విస్మరించిందన్నారు. నిధులు పొందడంలో, వాటిని వినియోగించే ప్రక్రియలో సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు తగిన సూచనలు అందిస్తున్నారని తెలిపారు.

ఎన్నారైల పెట్టుబడులు పెరగాలి

- వివిధ దేశాల్లోని ప్రవాసులతో క్లట్ ఏర్పాటు: మంత్రి కొండపల్లి



అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పెట్టుబడుల్లో ఎన్నారైల భాగస్వామ్యం పెరగాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆకాంక్షించారు. మంగళవారం ఏపీ ఎన్నార్టీఎస్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. వివిధ దేశాల్లో కీలక స్థానాల్లో ఉన్న ప్రవాసాంధ్రులతో ఓ క్లట్ ఏర్పాటు చేసి.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను వారికి వివరించాలని అధికారులను ఆదేశించారు.

పార్ట్‌టైం టీచర్లను తొలగించం: మంత్రి డోలా



అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించడం వల్ల ఎస్సీ గురుకులాల్లోని పార్ట్‌టైం టీచర్లను తొలగిస్తారని ఆందోళన అవసరం లేదని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి భరోసా ఇచ్చారు. ఖాళీ పోస్టుల్లో నియమించి వారందరి సేవలను వినియోగించుకుంటామని ఒక ప్రకటనలో తెలిపారు.

చేతివృత్తిదారులకు శాశ్వత ఉపాధి: మంత్రి సవిత



అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో కుల, చేతివృత్తిదారులు నిలదొక్కుకునేలా ఆధునిక పరికరాలు అందజేసి, వారికి శాశ్వత ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. విజయవాడ శివారు గొల్లపూడిలోని బీసీ భవన్‌లో మంగళవారం ఏడు కార్పొరేషన్ల డైరెక్టర్లతో సమావేశంలో ఆమె మాట్లాడారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌కు డైరెక్టర్ల నియామకం

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు పలువురు డైరెక్టర్లను నియమించారు. ఆర్థికంగా వెనుకబడిన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి కె.సునీత ఈ ఉత్తర్వులు జారీచేశారు. ఆకెళ్ల వెంకటరామచంద్రమూర్తి(అమలాపురం నియోజకవర్గం), ఉప్పు భువనేశ్వరి ప్రసాద్(నెల్లూరు), చెరుకుపల్లి సంతోష్(భీమవరం), విఘ్నల దుర్గాప్రసాద్(బాపట్ల), దార్భా ఆనందరావు(కర్నూలు), జి.బాబూరావు(మంత్రాలయం), కృష్ణమోహన్ సచ్చిదేవ్(తాడేపల్లిగూడెం), కొలచన శ్రీవిద్య(నరసాపురం), నాయకో రంజిత్ కుమార్ (కురుపాం), సింగిరి కరణం శ్రీనివాసరావు(పొన్నూరు), సరిపాక సురేశ్(రేపల్లె), సూర్యప్రభ విశ్వనాథం(అనకాపల్లి), తేజోమూర్తుల నాగ లక్ష్మి నరసింహమూర్తి(రాజమండ్రి సిటీ), వెలగలేటి వెంకట పూర్ణ గంగాధర్(గుంటూరు), పల్లవాజుల వెంకట పణికుమార్(మచిలీపట్నం)లను డైరెక్టర్లుగా నియమించారు.

విద్యుత్ చార్జీల భారం తగ్గించాలి: ఏపీచాంబర్స్

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పరిశ్రమలపై విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య(ఏపీ చాంబర్స్) డిమాండ్ చేసింది. మంగళవారం విజయవాడలోని ఓ హోటల్లో ఏపీ చాంబర్స్ బోర్డు మీటింగ్ నిర్వహించారు. అనేక అంశాలపై చర్చించారు. ఈ వివరాలను చాంబర్స్ అధ్యక్షుడు భాస్కరరావు విలేకరులకు వెల్లడించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు చాలా అధికంగా ఉన్నాయని చెప్పారు. డిసెంబరు 12 నుంచి 14 వరకు విజయవాడలో నిర్వహించ తలపెట్టిన 'బిజినెస్ ఎక్స్‌పో-2025' బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

'దేవదాయ' స్థపతి సలహాదారుడిగా సుందర్‌రాజన్

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మాదాయ శాఖకు స్థపతి సలహాదారుడిగా ఎస్.సుందర్‌రాజన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు దేవదాయ శాఖ ఎక్స్‌అఫిషియో సెక్రటరీ ఎం.హరిజవహర్‌లాల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

'సీనరేజీ'పై సానుకూల నిర్ణయం!

- గ్రానైట్ పరిశ్రమ సమస్యల పరిష్కారానికి కమిటీ
- అసోసియేషన్ ప్రతినిధులకు మంత్రి కొల్లు హామీ
- సమ్మెతో కార్మికులకు ఇబ్బందులు.. విరమించాలని సూచన

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ ఇండస్ట్రీలో సమస్యల పరిష్కారానికి ఉమ్మడి కమిటీ ఏర్పాటు చేస్తామని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటించారు. గ్రానైట్ ఇండస్ట్రీ, కటింగ్ యూనిట్ల అసోసియేషన్ల ప్రతినిధులు, గనుల శాఖ అధికారులు ఈ కమిటీలో ఉంటారని తెలిపారు. గ్రానైట్ పరిశ్రమ రంగంలో ఉన్న సమస్యలు, ప్రత్యేకించి ప్రస్తుతమున్న సీనరేజీ ఫీజులు, గనుల సంబంధిత ఇతర ఫీజులపై కమిటీ అధ్యయనం చేస్తుందని, ఆ తర్వాత ప్రభుత్వం తగిన సానుకూల పరిష్కారం చూపిస్తుందని పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో అధిక సీనరేజీ వసూళ్లను నిరసిస్తూ పరిశ్రమదారులు, కటింగ్ యూనిట్ల నిర్వాహకులు కొద్దిరోజులుగా సమ్మె చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రానైట్ పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిశారు. తమ నుంచి చాలా ఎక్కువ మొత్తంలో సీనరేజీ వసూలు చేస్తున్నారని అసోసియేషన్ ప్రతినిధులు వాపోయారు. 'మేం ప్రభుత్వానికి చట్టబద్ధమైన ఫీజులు, పన్నులు చెల్లిస్తాం. కానీ, సీనరేజీ కాంట్రాక్టు సంస్థ నుంచి మమల్ని కాపాడండి' అని కోరారు. ఒకసారి ప్రభుత్వానికి త గిన ఫీజులు చెల్లించాక, అదే పేరుతో ప్రైవేటు సంస్థకు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించారు. రెండింతలుగా సీన రేజీ ఫీజులు వసూలు చేయడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో అన్ని అంశాలపై సమగ్ర పరిశీలన కోసం కమిటీ ఏర్పాటు చే స్తామని మంత్రి హామీ ఇచ్చారు. వారం రోజుల్లోగా ఈ కమిటీ నివేదిక అందిస్తుందని, ఆ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. సమ్మె వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతారని, తక్షణమే సమ్మె విరమించి పనులు ప్రారంభించాలని సూచించారు. సమస్యకు సత్వర పరిష్కారం చూపాలని ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు కొల్లు రవీంద్రను కోరారు. సీఎం లండన్ నుంచి వచ్చాక చర్చించి, ఒక కొలిక్కి తీసుకురావాలని మంత్రులు నిర్ణయించినట్లు తెలిసింది.

గిరిజన పాఠశాలలకు 113 కోట్లు

- త్వరలో విశాఖలోనూ ఐఐటీ కోచింగ్ సెంటర్
- గిరిజనులకు 150 రోజుల ఉపాధి పనులు
- గిరిజన సంక్షేమ మంత్రి సంధ్యారాణి



అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తొమ్మిది ఐటీడీఏల పరిధిలోగల 757 గిరిజన పాఠశాలల్లో(వీటిలో 199 గురుకులాలు) మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.113 కోట్లు మంజూరు చేసినట్లు గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఇందులో రూ.83 కోట్లను ఆశ్రమ పాఠశాలలకు, రూ.30 కోట్లు వసతి గృహాలకు కేటాయించామన్నారు. ఆర్వో ప్లాంట్లు, వాష్ రూమ్‌లు, ఇతర సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన పాఠశాలల్లో వసతుల కల్పన కోసం గత ఏడాది రూ.155 కోట్లను వెచ్చించిందన్నారు. వసతి గృహాల్లో త్వరలో.. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మాట్లాడుకునేందుకు వీలుగా ప్రీపెయిడ్ ఫోన్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. 150 మంది మెరిటోరియస్ విద్యార్థులను గుర్తించి వారికి ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ పోటీ పరీక్షల కోచింగ్‌ను పార్వతీపురం, సీతంపేటలలో ప్రారంభించామని, మరో కేంద్రాన్ని త్వరలోనే విశాఖపట్నంలో ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేదని తెలిపారు. గిరిజనులకు ఉపాధిహామీ కింద 150 రోజులపాటు పనిదినాలను కల్పించనున్నట్లు చెప్పారు. శ్రీశైలం అటవీ ప్రాంత గిరిజనులకు.. పోడు వ్యవసాయం నిమిత్తం ఆర్ఓఎఫ్ఆర్ కింద త్వరలో భూపట్టాలు అందజేస్తామన్నారు. సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడే గిరిజన మహిళలకు ఐరన్, కాల్షియం మాత్రలను అందజేయడంతోపాటు వీరికి ప్రత్యేక చికిత్స అందజేసేందుకు విశాఖ కేజీహెచ్‌లో ఒక ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ప్రాధాన్యత క్రమంలో చేసుకుంటూ వస్తున్నామని చెప్పారు. అంతేతప్ప గత ప్రభుత్వం లాగా తాము శిలాఫలకాలకే పరిమితం కాబోమని మంత్రి వ్యాఖ్యానించారు.

శిక్షణ ఇంకెప్పుడు!

- కానిస్టేబుల్ పోస్టులకు 6,100 మంది ఎంపిక
- రెండు నెలల క్రితం మెడికల్ టెస్టులు పూర్తి
- ఇంతవరకు ప్రారంభం కాని శిక్షణ తరగతులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర పోలీస్ శాఖలో కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు శిక్షణ కోసం ఎదురుచూస్తున్నారు. నియామక ప్రక్రియ ప్రారంభమై నాలుగేళ్లు గడిచినా ఇప్పటికీ ఆయా పోస్టులకు మోక్షం కలగలేదు. దీంతో అభ్యర్థులు మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసేందుకు 2022, నవంబరులో అప్పటి వైసీపీ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. సుమారు 6,100 పోస్టులను భర్తీ చేసేందుకు 2023 జనవరిలో ప్రిలిమ్స్ నిర్వహించారు. సుమారు 90 వేల మంది తదుపరి దశకు అర్హత సాధించారు. న్యాయపరమైన చిక్కులను కారణంగా చూపించి ఈ ప్రక్రియను వైసీపీ ప్రభుత్వం మధ్యలోనే వదిలేసింది. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక కోర్టు కేసులను పరిష్కరించి, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి మధ్య ఫిజికల్ పరీక్షలను నిర్వహించింది. వీటిలో అర్హత సాధించిన సుమారు 45 వేల మందికి ఈ ఏడాది జూన్‌లో మెయిన్స్ నిర్వహించారు. ఆగస్టు 1న ఫలితాలను వెలువరించారు. ఎంపికైన వారికి మెడికల్ టెస్టులు పూర్తిచేశారు. వీటిలోనూ అర్హత పొందిన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఆ వెంటనే శిక్షణకు పిలుస్తారని అభ్యర్థులు భావించారు. కానీ, రెండు నెలలు గడిచినా శిక్షణ షెడ్యూల్ విడుదల చేయకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

8 ఆస్పత్రుల్లో ఎస్ఎన్‌సీయూలు

- 4.80 కోట్లతో పీపీపీ విధానంలో ఏర్పాటు

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో అప్పుడే పుట్టిన చిన్నారుల కోసం అదనంగా మరో 8 ప్రత్యేక నవజాత శిశువుల సంరక్షణ విభాగాలు (ఎస్ఎన్‌సీయూ) ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం తెలిపారు. ఈ ఎనిమిది ఎస్ఎన్‌సీయూల ద్వారా అదనంగా 80 పడకలు అందుబాటులోకి రానున్నాయని ఆయన ప్రకటించారు. ఒక్కో ఎస్ఎన్‌సీయూ ఏర్పాటుకు రూ.60 లక్షల చొప్పున ఎనిమిది యూనిట్లకు మొత్తం రూ.4.80 కోట్లు ఖర్చవుతుందని వెల్లడించారు. పీపీపీ (పబ్లిక్ ప్రైవేటు పార్ట్నర్‌షిప్) విధానంలో ఈ 8 ఎస్ఎన్‌సీయూలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కోనసీమ జిల్లా అమలాపురం ఏరియా ఆస్పత్రి, చిత్తూరు జిల్లా కుప్పం ఏరియా ఆస్పత్రి, అనంతపురం జిల్లా గుంతకల్ ఏరియా ఆస్పత్రి, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సీహెచ్‌సీల్లో ఈ నెలాఖరులోగా ఎస్ఎన్‌సీయూల సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఏలూరు జిల్లా నూజివీడు ఏరియా ఆస్పత్రి, నెల్లూరు జిల్లా కావలి ఏరియా ఆస్పత్రి, సత్యసాయి జిల్లా కదిరి ఏరియా ఆస్పత్రి, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో త్వరలోనే అందుబాటులోకి వస్తాయని వివరించారు. రాష్ట్రంలో టీచింగ్, జిల్లా, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీల్లో ఇప్పటికే 62 ఎస్ఎన్‌సీయూలు పనిచేస్తున్నాయని, వీటిలో 28 ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్నాయని తెలిపారు. తక్కువ బరువుతో పుట్టిన శిశువులు, పచ్చకామెర్లు, హైపోథెర్మియా, శ్వాసకోశ, సెప్సిస్ వంటి సమస్యలతో బాధపడే చిన్నారులకు ఎస్ఎన్‌సీయూల్లో చికిత్స అందిస్తారన్నారు.

ఎర్రచందనం రైతులకు 3 కోట్లు

న్యూఢిల్లీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దేశంలో సమగ్ర జీవవైవిధ్య పరిరక్షణను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎర్రచందనం సాగు చేస్తున్న రైతులకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ పరిధిలోని జాతీయ జీవ వైవిధ్య ప్రాధికార సంస్థ(ఎన్‌బీఏ) ఆర్థిక సాయం విడుదల చేసింది. రాష్ట్రంలోని 4 జిల్లాలకు చెందిన 198 మంది రైతులు, ఆంధ్ర విశ్వవిద్యాలయానికి కలిపి రూ.3 కోట్లు పంపిణీ చేయనుంది. వారు సరఫరా చేసిన కలప పరిమాణం ఆధారంగా ఒక్కొక్కరు రూ.33 వేల నుంచి రూ.22 లక్షల వరకు అందుకోనున్నారు. వీరు చిత్తూరు, నెల్లూరు, తిరుపతి, కడప జిల్లాల్లో ఎర్రచందనం రైతులు.

అమరావతి రైతుల త్యాగ ఫలాలను అనుభవిస్తున్నాం: అనిత

- వెలగపూడిలో డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన హోం మంత్రి, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఐజీ త్రిపాఠి

తుళ్లూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అమరావతి రైతుల త్యాగ ఫలాలను అనుభవిస్తున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. వెలగపూడిలో నిర్మించిన డీఎస్పీ కార్యాలయాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడారు. '2018లో టీడీపీ ప్రభుత్వం రాజధాని అమరావతిలో డీఎస్పీ కార్యాలయం ఏర్పాటుకు శంకుస్థాపన చేసింది. వైసీపీ హయాంలో నిర్మాణ పనులు నిలిచిపోయినప్పటికీ కూటమి ప్రభుత్వం రాగానే పూర్తి చేసింది. రాజధాని ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణ, బందోబస్తు దృష్ట్యా డీఎస్పీ కార్యాలయం అవసరం ఉంది. ప్రజల రక్షణ కోసం అహర్నిశలు శ్రమించే పోలీసులకు కూడా భద్రత కల్పించాలనే నిర్ణయంతో పలు పోలీసు స్టేషన్‌లకు శంకుస్థాపన చేశాం. పోలీసు వ్యవస్థ సమర్థంగా పని చేయడానికి తగిన వసతులు అవసరం. ఆ దిశగా డీజీపీ మార్గదర్శకంలో కృషి చేస్తున్నాం. పోలీసుల భద్రత, సంక్షేమం, ఆరోగ్యం, కుటుంబ భద్రతకు ప్రాధాన్యం ఇచ్చాం. ఇప్పటికే ప్రమాద భీమా సౌకర్యం కల్పించాం. ఈ ప్రాంతంలో ఎస్పీ క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేయాలని డీజీపీ సూచించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేశాం' అని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఐజీ త్రిపాఠి, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి, హనుమంతరావు, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఇతర జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత. చిత్రంలో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఐజీ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★


మరోసారి మర్చిపోలేని అనుభూతిని ఇస్తుంది



నాగార్జున

'రామ్‌గోపాల్ వర్మ 36 ఏళ్ల క్రితం నాతో శివ సినిమా తీసి, నన్నో పెద్ద స్టార్‌ని చేశారు. ఇప్పుడు కూడా వర్మ ఆరు నెలలు కష్టపడి ఎంతో ప్రేమతో 'శివ' చిత్రాన్ని రీ రిలీజ్‌కు సిద్ధం చేశారు. ప్రేక్షకులకు మరోసారి మర్చిపోలేని అనుభూతిని ఇస్తుంది' అని నాగార్జున అన్నారు. ఈనెల 14న 'శివ' చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం రీ రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ 'ఇన్నేళ్ల తర్వాత కూడా మేమిద్దరం ఇలా వేదికపై రీ రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేస్తామని నేనెప్పుడూ ఊహించలేదు' అని అన్నారు.

రాజాసాబ్ రాకలో మార్పు లేదు



ప్రభాస్ హీరోగా మారుతి తెరకెక్కిస్తోన్న 'రాజాసాబ్' చిత్రం విడుదల మరోసారి వాయిదా పడిందంటూ వస్తోన్న వార్తలను చిత్ర నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఖండించింది. అనుకున్న సమయానికే రాజాసాబ్ వస్తున్నాడంటూ ఓ ప్రకటన విడుదల చేసింది. 'ప్రస్తుతం నిర్మాణాంతర పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. జనవరి 9న ఒకేసారి అన్ని భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ సంక్రాంతికి థియేటర్లలో సందడిని రెట్టింపు చేసేందుకు 'రాజాసాబ్' సిద్ధమవుతున్నాడు. డిసెంబరు 25 నాటికి తొలి కాపీని సిద్ధం చేస్తున్నామని, అమెరికాలో ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించబోతున్నాం' అని చిత్ర నిర్మాణ సంస్థ పేర్కొంది.

నా కెరీర్‌లో 'కె-ర్యాంప్' విజయం ప్రత్యేకం



కిరణ్ అబ్బవరం

'నా కెరీర్‌లో కె-ర్యాంప్ కంటే మరింత గొప్ప విజయం రావచ్చు. కానీ ఈ విజయం మాత్రం ఎంతో ప్రత్యేకం. నా జీవితాంతం గుర్తుండిపోతుంది. ఈ సినిమాకు వస్తున్న కలెక్షన్స్ కంటే థియేటర్లో ప్రేక్షకులు పొందుతున్న వినోదాన్ని చూసి నాకు ఎక్కువ ఆనందంగా ఉంది' అని కథానాయకుడు కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన హీరోగా జైన్స్ నాని తెరకెక్కించిన 'కె-ర్యాంప్' ఇటీవలె విడుదలై ఘనవిజయం సాధించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'ర్యాంపేజ్ బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్‌'లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'గతేడాదీ, ఈ ఏడాదీ దీపావళికి హిట్స్ వచ్చాయి. మీ సపోర్ట్ ఉంటే వచ్చే దీపావళికి కూడా హిట్ సినిమా ఇస్తాను' అని చెప్పారు. 'ఈ సినిమా విజయం సాధిస్తుందని ఒక కార్యక్రమంలో తొడగొట్టి చెప్పాను. ప్రేక్షకులు మా నమ్మకాన్ని నిజం చేస్తూ అద్భుత విజయం అందించారు' అని చిత్ర నిర్మాత రాజేశ్ దండ తెలిపారు. 'ఇండస్ట్రీకి కిరణ్ లాంటి వాళ్లే కావాలి' అని నిర్మాత బండ్ల గణేశ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డమ్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు.

జాతీయ అవార్డుల ఎంపికలో రాజీ పడుతున్నారు



కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డులను సోమవారం ప్రకటించిన సంగతి విదితమే. అవార్డులను ప్రకటించిన అనంతరం జ్యూరీ ఛైర్మన్, నటుడు ప్రకాశ్‌రాజ్ ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో జాతీయ అవార్డుల గురించి చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. 'జాతీయ అవార్డుల ఎంపిక విషయంలో జ్యూరీ సభ్యులు రాజీ పడుతున్నారని చెప్పడానికి నేను భయపడను. పక్షపాతంతో తీసుకున్న కొన్ని నిర్ణయాల వల్ల జాతీయ స్థాయిలో కొందరికే అవార్డులు దక్కుతున్నాయి. అలాంటి ప్రభుత్వాలు, వ్యక్తులు ఉన్నప్పుడు మమ్ముట్టి వంటి గొప్ప నటులకు జాతీయ అవార్డులు అవసరం లేదు' అని అన్నారు ప్రకాశ్‌రాజ్. అవార్డుల ఎంపికలో తనకు పూర్తి స్వేచ్ఛనిస్తామని కేరళ అవార్డ్ కమిటీ చెప్పిన తర్వాతే జ్యూరీ కమిటీకి సారథ్యం వహించడానికి అంగీకరించానని ఆయన తెలిపారు.

శంబాల ఎవరినీ నిరాశపరచదు



'మా చిత్రానికి విడుదలకు ముందే ఇంత ఆదరణ లభిస్తున్నందుకు ఆనందంగా ఉంది. సినిమా మీద మంచి బజ్ క్రియేట్ చేయాలనే ఉద్దేశంతో ట్రైలర్‌ను ఇంత త్వరగా విడుదల చేశాం. ప్రభాస్ ఫ్యాన్స్‌తో పాటు సినీ ప్రియులందరూ ట్రైలర్ బాగుందని మెచ్చుకుంటున్నారు' అని ఆది సాయికుమార్ అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో యుగంధర్ ముని తెరకెక్కిస్తున్న మిస్టికల్ థ్రిల్లర్ 'శంబాల'. రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. అర్చన అయ్యర్, స్వశిక, రవి వర్మ, మధునందన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. డిసెంబరు 25న చిత్రం విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆది సాయికుమార్ మాట్లాడుతూ 'మా చిత్రం ఎవరినీ నిరాశపరచదు. అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది' అని చెప్పారు. 'సాంకేతికంగా ఉన్నతంగా ఉంటూ ఆద్యంతం మలుపులతో ఆకట్టుకుంటుంది' అని యుగంధర్ ముని తెలిపారు. 'ఇలాంటి ఓ అద్భుతమైన చిత్రంలో మంచి పాత్ర చేసినందుకు ఆనందంగా ఉంది' అని అర్చన అయ్యర్ అన్నారు.

పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని అలరిస్తుంది

సుధీర్‌బాబు కథానాయకుడిగా రూపొందిన మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వంలో ప్రేరణా అరోరా నిర్మించారు. ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రేరణ మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు.



ప్రేరణ అరోరా

- తెలుగులో సినిమా చేయాలనే కోరిక ఎప్పట్నుంచో ఉంది. సుధీర్‌బాబు గారి ద్వారా వెంకట్ అభిషేక్‌ని కలిశాను. అప్పుడు 'జటాధర' కథ చెప్పారు. అలా ఈ సినిమాతో నిర్మాతగా నా ప్రయాణం మొదలైంది. ఇది పాన్ ఇండియా కంటెంట్. అందుకే హిందీలో కూడా ఈ సినిమాను తెరకెక్కించాం.
- కుటుంబ అనుబంధాలు, పురాణాలు, అతీంద్రియ శక్తులు.. ఇలా పలు అంశాల చుట్టూ అల్లుకున్న కథ ఇది. సినిమా విజువల్‌గా గ్రేట్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది.
- తెలుగులో నా తొలి చిత్రం సుధీర్‌బాబుతో చేయడం ఆనందాన్నిచ్చింది. తెలుగులో అగ్రహీరోతో మరో సినిమా చేయబోతున్నాం. ఆ వివరాలు త్వరలో ప్రకటిస్తాం.

ప్రత్యేకాకర్షణగా.. బుల్లెట్



కిరణ్, అలేఖ్య రెడ్డి జంటగా నటిస్తున్న చిత్రం 'దీక్ష'. ఆర్‌కే ఫిల్మ్స్ బేనర్‌పై ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వంలో పి.అశోక్‌కుమార్ నిర్మిస్తున్నారు. డీఎస్ గౌడ్ సమర్పిస్తున్నారు. చిత్రీకరణ పూర్తైంది. ఈ సినిమాకు అదనపు ఆకర్షణను జతచేయడానికి తాజాగా ఓ ప్రత్యేక పాటను చిత్రీకరించారు మేకర్స్. 'బుల్లెట్' అంటూ సాగే ఈ పాటను మధు ప్రియ ఆలపించారు. ఈ సందర్భంగా ఆర్‌కే గౌడ్ మాట్లాడుతూ 'ఇందులో కిరణ్ భీముడి పాత్రలో అద్భుతంగా నటించాడు. అందమైన కుటుంబ కథా చిత్రంగా రూపుదిద్దుకుంటోంది చిత్రం. మైథలాజికల్ టచ్ కూడా ఉంటుంది. ఐదు పాటలూ అలరిస్తాయి' అని అన్నారు.

'ఫీనిక్స్' విషయంలో అదే జరుగుతుంది



విజయ్ సేతుపతి

'ఫీనిక్స్' సినిమా చూశాను. మా అబ్బాయి కెరీర్‌కు మంచి ఆరంభాన్ని ఇచ్చే చిత్రమిది. ఒక తండ్రిగా ఎంతో సంతోషాన్నిస్తోంది. భాషతో సంబంధం లేకుండా భావోద్వేగంతో ప్రేక్షకులు కనెక్ట్ అయ్యారంటే ఆ సినిమాను సూపర్‌హిట్ చేస్తారు. 'ఫీనిక్స్' విషయంలో అదే జరుగుతుందనే నమ్మకం ఉంది' అని హీరో విజయ్ సేతుపతి అన్నారు. ఆయన కుమారుడు సూర్య సేతుపతి కథానాయకుడిగా పరిచయమౌతున్న చిత్రం 'ఫీనిక్స్'. స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వం వహించగా, రాజ్యలక్ష్మి నిర్మించారు. ఇటీవలె తమిళ్‌లో విడుదలై ఘనవిజయం సాధించింది. ఈ నెల 7న తెలుగులో విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో దర్శకుడు గోపిచంద్ మలినేని మాట్లాడుతూ 'అరసు చిత్రాన్ని బాగా హ్యాండిల్ చేశారు' అని చెప్పారు. 'ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకంతో ఉన్నాను' అని సూర్య సేతుపతి తెలిపారు.

సీరియల్ నటికి వేధింపులు.. నిందితుడి అరెస్టు

ఓ వ్యక్తి తనను సోషల్‌మీడియాలో లైంగికంగా.. మానసికంగా వేధిస్తున్నాడంటూ తెలుగు, కన్నడ భాషల్లో నటిస్తున్న ఓ సీరియల్ నటి పోలీసులను ఆశ్రయించారు. ఫేస్‌బుక్‌లో ఆ వ్యక్తి పంపిన ఫ్రెండ్ రిక్వెస్ట్‌ను అంగీకరించలేదనే కక్షతో తనను ఇబ్బందిపెడుతున్నాడంటూ ఫిర్యాదు చేసింది. బెంగుళూరులోని అన్నపూర్ణేశ్వరీ నగర్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నవీన్ అనే వ్యక్తి నుంచి బాధితురాలికి ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. ఆమె అంగీకరించలేదు. పలుసార్లు ఆమె ఇలానే తిరస్కరించడంతో ఆ నటికి అభ్యంతకర వీడియోలు పంపడం మొదలు పెట్టాడు. నటి బ్లాక్ చేసినా ఆగకుండా వేరే అకౌంట్ల నుంచి అభ్యంతకర వీడియోలు, మెసేజులు పంపి వేధించేవాడు. దీంతో నటి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



దుబాయ్‌లోని తబ్రీద్ కూలింగ్ సెంటర్‌లో మంత్రి నారాయణ బృందం

పెట్టుబడిదారులకు పూర్తి సహకారం

- రాష్ట్రానికి వచ్చి పాలసీలు పరిశీలించండి
- తర్వాతే పెట్టుబడులపై నిర్ణయం తీసుకోండి
- దుబాయ్ పారిశ్రామికవేత్తలకు మంత్రి నారాయణ పిలుపు

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామమని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు దుబాయ్‌లో పర్యటిస్తున్న మంత్రి నారాయణ, అధికారుల బృందం రెండో రోజు మంగళవారం పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమైంది. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, పాలసీలను పరిశీలించి ఆ తర్వాత పెట్టుబడులపై నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఉదయం అపరెల్ గ్రూప్ చైర్మన్ నీలేష్ వేద్, సీఈఓ నీరజ్, సీబీఓ కమల్ కొటక్‌తో నారాయణ సమావేశమయ్యారు. ఏపీలో వ్యాపారాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని వారికి హామీ ఇచ్చారు. ఆ తర్వాత షిప్పింగ్, లాజిస్టిక్స్ రంగంలో దిగ్గజ సంస్థ ట్రాన్స్‌వరల్డ్ గ్రూప్ చైర్మన్ రమేశ్ రామకృష్ణన్‌తో మంత్రి నారాయణ బృందం భేటీ అయింది. రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధికి సీఎం చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలను ఆయనకు మంత్రి వివరించారు. సుదీర్ఘ తీర ప్రాంతం, పోర్టులు, ఎయిర్‌పోర్టుల నిర్మాణంతో పాటు షిప్ బిల్డింగ్ ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు. ఏపీని లాజిస్టిక్ హబ్‌గా మార్చేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం బుర్జిల్ హెల్త్‌కేర్ ప్రతినిధులతోనూ మంత్రి సమావేశమయ్యారు. వైద్య రంగంలో ఏపీ ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులను వివరించారు. అనంతరం దుబాయ్ డౌన్‌టౌన్‌లో ఉన్న తబ్రీద్ కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని మంత్రి బృందం సందర్శించింది. ఈ కంపెనీ సీఈఓ ఖలీద్, సీడీఓ ఫిలిప్, ఇతర ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా, దుబాయ్ మాల్ వంటి వాటికి తబ్రీద్ కంపెనీ ఏసీలకు బదులు అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ నెట్‌వర్క్ ద్వారా డిస్ట్రిక్ట్ కూలింగ్ సేవలను అందిస్తోంది. దీనికోసం ఆ కంపెనీ ఏర్పాటు చేసిన కూలింగ్ సెంటర్‌ను మంత్రి పరిశీలించారు. అమరావతిలోనూ ఇలాంటి కూలింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. పారిశ్రామిక వేత్తలతో సమావేశాల్లో విశాఖ భాగస్వామ్య సదస్సు గురించి మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. పలు దేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఈ సదస్సుకు హాజరవుతున్నారని, దుబాయ్ పెట్టుబడిదారులు కూడా రావాలని మంత్రి ఆహ్వానించారు. ఈ పర్యటనలో మంత్రి వెంట సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, మున్సిపల్‌శాఖ డైరెక్టర్ సంపత్‌కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

గోపీచంద్.. విజన్ ఉన్న పారిశ్రామికవేత్త

- హిందుజా గ్రూప్ చైర్మన్ మృతికి సీఎం సంతాపం

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): హిందుజా గ్రూప్ చైర్మన్ గోపీచంద్.పి.హిందుజా మృతి పట్ల సీఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'ఆయన విజన్ ఉన్న పారిశ్రామికవేత్త. హిందుజా గ్రూప్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి గోపీచంద్. గొప్ప నాయకత్వ లక్షణాలు ఉన్న వ్యక్తి. 1984లో గల్ఫ్ ఆయిల్‌ను కైవశం చేసుకోవడం మొదలుకొని అశోక్ లేలాండ్‌ను పునరుద్ధరించడం వరకు ఆయన సేవలు చిరస్మరణీయం. విద్యుత్తు, మౌలిక వసతుల కల్పనలోకి గ్రూప్‌ను తీసుకురావడంలో గోపీచంద్ కృషి గొప్పది. ఆయన స్ఫూర్తి తదుపరి తరాలకు కూడా మార్గదర్శకం కావాలి' అని సీఎం ఆకాంక్షించారు. మంత్రి లోకేశ్ కూడా గోపీచంద్.పి.హిందుజా మృతికి సంతాపం తెలిపారు.

రైతుల పేరుతో వైసీపీ నేతలు నాటకాలు ఆపాలి

- 2022-23 రబీ నుంచి బీమా కంపెనీలకు చెల్లింపులు చేయని జగన్: మంత్రి అచ్చెన్న

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతుల పేరుతో వైసీపీ నేతలు నాటకాలు ఆపాలని మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. ఈమేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన చేశారు. 'అవినాశ్‌రెడ్డి ఇన్నాళ్లూ కళ్లకు గంతలు కట్టుకున్నారు. రాయలసీమలో ఏం జరుగుతుందో కూడా చూడలేదు. ఇప్పుడు ఉల్లి రైతులపై ప్రేమ ఒలకబోస్తున్నారు. ఉల్లికి హెక్టారుకు రూ.50 వేలు ప్రకటించి, రూ.105 కోట్లు రైతులకు సీఎం చంద్రబాబు లబ్ధి చేకూర్చారు. ఉల్లి ధర తగ్గుతుంటే క్వింటా రూ.1,200కు కర్నూలు యార్డులో రూ.17.22 కోట్లతో కొనుగోలు చేశాం. జగన్ పాలనలో మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం 129 మంది రైతుల నుంచి 970 టన్నుల ఉల్లిని సేకరించి, రూ.75 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. 2020లో ఉల్లి ధర పడిపోతే మద్దతు ధర రూ.770 ప్రకటించడం తప్ప... కిలో కూడా కొనుగోలు చేయలేదు. ఇప్పుడేమో వైసీపీ నేతలు రైతుల గురించి మొసలి కన్నీరు కారుస్తున్నారు' అని మంత్రి అచ్చెన్న విమర్శించారు. మరో ప్రకటనలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై జగన్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. జగన్ నోరు తెరిస్తే.. పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. 'జగన్ గొప్పగా చెప్పే ఉచిత పంటల బీమా ఆయన పాలనలోనే పూర్తిగా విఫలమైంది. 2019 తర్వాత ఏ రబీ సీజన్‌లోనూ రైతులకు అమలు చేయలేదు. 2020, 2021 ఖరీఫ్ సీజన్లలో మాత్రమే బీమా అమలు చేసినా... పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుంచే ఇచ్చారు. తర్వాత కేంద్ర ప్రభుత్వ ప్రీమియం సబ్సిడీ పొందేందుకు ఫసల్ బీమా అమలు చేస్తామని ప్రకటించారు. రైతు వాటా, రాష్ట్ర వాటా తామే చెల్లిస్తామని హామీ ఇచ్చిన జగన్... మోసం చేశారు. 2018-19 రబీ క్లెయిమ్‌లను 2020లో పరిష్కరించారు. 2022-23 రబీ నుంచి సబ్సిడీని బీమా కంపెనీలకు ఇంకా చెల్లించలేదు' అని మంత్రి వాపోయారు.

సర్టిఫికెట్లు ఇవ్వకపోతే విద్యాసంస్థల గుర్తింపు రద్దు

- రూ.15 లక్షల వరకు జరిమానా కూడా
- ఉన్నత విద్యాసంస్థలకు ఉన్నత విద్య కమిషన్ హెచ్చరిక
- నిలిపివేసిన సర్టిఫికెట్లు తక్షణమే ఇవ్వాలని ఆదేశం

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిలిపివేస్తే ఆ కాలేజీ లేదా ప్రైవేటు యూనివర్సిటీ గుర్తింపు రద్దునకు సిఫారసు చేస్తామని ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ హెచ్చరించింది. అలాగే రూ.15లక్షల వరకు జరిమానా కూడా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థలపై అనేక ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో కమిషన్ మంగళవారం కీలక ఆదేశాలు జారీచేసింది. కమిషన్ సభ్య కార్యదర్శి ప్రొఫెసర్ డి.సూర్యచంద్రరరావు అన్ని ప్రైవేటు విద్యా సంస్థలకు ఈ ఆదేశాలు పంపారు. 'విద్యార్థుల కోర్సులు పూర్తయినా ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఆపడం, విద్యా సంస్థల్లో పనిచేసే ఫ్యాకల్టీ ఒరిజినల్ సర్టిఫెట్లు తీసుకోవడం, ప్రభుత్వం నిర్దేశించినదాని కంటే అదనంగా ఫీజులు వసూలు చేయడం లాంటి ఉల్లంఘనలు తరచూ జరుగుతున్నాయి. ఇప్పటికే ఇలాంటి ఫిర్యాదులు అందాయి. విద్యార్థులు, ఫ్యాకల్టీల సర్టిఫికెట్లు నిలిపివేయడం అంటే వారి తదుపరి చదువులు, ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయడమే. ఇలాంటి అక్రమాలకు పాల్పడటం శాసనబద్ధమైన నిబంధనలను ఉల్లఘించడమే. దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నాం. కనుక నిలిపివేసిన సర్టిఫికెట్లను వెంటనే విద్యార్థులు, ఫ్యాకల్టీకి ఇవ్వాలి. ఒకవేళ అదనంగా ఫీజులు వసూలు చేసి ఉంటే వాటిని వెంటనే తిరిగి చెల్లించాలి. ఈ నిబంధనలను పాటించకుండా విద్యార్థులను, ఫ్యాకల్టీని ఇబ్బంది పెట్టే విద్యా సంస్థలకు రూ.15లక్షల వరకు జరిమానా తప్పదు' అని కమిషన్ హెచ్చరించింది. అలాగే ఆ విద్యా సంస్థ అఫిలియేషన్ ఉపసంహరణకు, గుర్తింపు రద్దునకు సిఫారసు చేస్తామని స్పష్టంచేసింది. ఇకపై కమిషన్ రెడ్రెసల్ సెల్ నిరంతరం పర్యవేక్షిస్తుందని, ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని తెలిపింది.

5 గంటలు.. 4 వేల విజ్ఞప్తులు

లోకేశ్ 70వ రోజు ప్రజా దర్బార్

- ప్రతి ఒక్కరి నుంచి వినతులు స్వీకరించిన మంత్రి
- సొంత తల్లి, చెల్లిని తరిమేసిన జగన్‌కు దేశ భక్తి, మహిళా శక్తి గురించి ఏం తెలుస్తుంది?: లోకేశ్

అమరావతి, గుంటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి లోకేశ్ 70వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు వినతులు స్వీకరించారు. అనంతరం పార్టీ కార్యకలాపాలపై పార్టీబ్యాక్ ఆఫీసు సిబ్బందితో చర్చించారు. తిరిగి రాత్రి 8 గంటలకు ఇంటికి వెళ్లే సమయంలో సుమారు 500 మంది పైచిలుకు ప్రజలు వేచి ఉండటం చూసి మరో గంటపాటు అర్జీలు స్వీకరించారు. సుమారు 10 గంటలపాటు పార్టీ కార్యాలయంలోనే గడిపారు. లోకేశ్‌ను కలసి సమస్యలు విన్నవించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్యాలయానికి తరలివచ్చారు. సుమారు 5 గంటలపాటు 4 వేల మందికిపైగా లోకేశ్‌ను కలసి వారి సమస్యలను విన్నవించుకున్నారు. ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌లలో పనిచేస్తున్న సుమారు 23,500 మంది కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు లోకేశ్‌ను కలసి విజ్ఞప్తి చేశారు. వేతన సవరణ చేయడంతోపాటు ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు. ఏపీ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలోని పారా మెడికల్ విభాగంలో ఖాళీగా ఉన్న హెల్త్ అసిస్టెంట్ మేల్ పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకోవాలని అన్‌ఎంప్లాయిస్ పారా మెడికల్ హెల్త్ అసిస్టెంట్(మేల్) అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని కోరారు. ఎక్కువ ఫిర్యాదులు భూ వివాదాలకు సంబంధించి వచ్చాయి.

అప్పుడప్పుడూ ఏపీకి వచ్చే మీరా మమ్మల్ని విమర్శించేది

'అప్పుడప్పుడు ఏపీకి వచ్చే జగన్.. ఎప్పుడూ జనం మధ్య ఉండే మా వైపు ఒక వేలు ఎత్తి చూపుతున్నారు. ఆయన వైపు మిగిలిన నాలుగు వేళ్లు చూపుతున్నాయని మర్చిపోతున్నారు' అని మంత్రి లోకేశ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'తుఫాన్ హెచ్చరిక వచ్చిన నాటి నుంచి సాధారణ పరిస్థితి నెలకొనే దాకా సీఎం నుంచి ఎమ్మెల్యే వరకు... చీఫ్ సెక్రటరీ నుంచి విలేజ్ సెక్రటరీ వరకు అంతా ప్రజలతోనే ఉన్నాం. ఇవన్నీ తెలియడానికి మీరు ఇక్కడ లేరు. మీది వేరే భ్రమాలోకం. అందులో విహరిస్తుంటే, ఇవన్నీ తెలియవు. నాకు మహిళలంటే గౌరవం, దేశమంటే భక్తి. అందుకే మహిళల వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ చూడటానికి ముంబై వెళ్లాను. కోట్లాది భారతీయులు తలెత్తుకునేలా మహిళామణులు వరల్డ్ కప్ గెలిస్తే, నేనే గెలిచినంత ఆనందించాను. సొంత తల్లి, చెల్లిని తరిమేసిన మీకు దేశభక్తి, మహిళా శక్తి గురించి ఏం తెలుస్తుందిలే..!' అని లోకేశ్ ఎద్దేవా చేశారు.



ప్రజా దర్బార్‌లో దివ్యాంగుల సమస్యలను ఆలకిస్తున్న మంత్రి లోకేశ్

గ్రీవెన్స్‌ను గాలికొదిలేశారు!

- పార్టీ ఆదేశాలను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలే
- మీరు సరిగా నిర్వహిస్తే ఈ ఒక్కరోజే 5 వేల మంది వస్తారా?
- పార్టీ నేతలపై లోకేశ్ ఆగ్రహం
- సొంత ఇమేజ్‌తో గెలిచామనుకునే వారు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి గెలవచ్చు
- పార్టీ పరిణామాలపై లోకేశ్ సుదీర్ఘ చర్చ



మంగళగిరిలోని నరసింహస్వామి ఆలయంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజలో పాల్గొన్న మంత్రి లోకేశ్

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రతిరోజూ గ్రీవెన్స్ నిర్వహించాలని చెప్పాం. దాన్ని ఎవ్వరూ సక్రమంగా పాటించడం లేదు. శని, ఆదివారాలు మినహా మిగిలిన రోజులన్నీ ఒక మంత్రి పార్టీ కార్యాలయానికి వచ్చి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలన్న ఆదేశాన్ని కూడా పట్టించుకోవడంలేదు. నియోజకవర్గాల్లో వారంలో ఏదో ఒక రోజు ప్రజాదర్బార్ నిర్వహించాలని చెప్పాం.. దాన్ని కూడా పాటించడం లేదు. ఇలా అయితే ఎలా? పార్టీ ఆదేశాలను నిర్లక్ష్యం చేసే వారిని ఏమనాలి? ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాల్సిందే' అని టీడీపీ జాతీయ కార్యదర్శి, మంత్రి లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన ఆయన పార్టీ కార్యకలాపాలపై నేతలతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్ నిర్వహణను గాలికొదిలేశారంటూ లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు గ్రీవెన్స్ నిర్వహణ సరిగా చేస్తే నేను వచ్చిన రోజు 5,000 మంది వచ్చే అవకాశం ఉండేది కాదు. ఇకపై గ్రీవెన్స్ విషయంలో కచ్చితంగా వ్యవహరిస్తాం. ఎవరైనా నిర్లక్ష్యం చూపితే సీరియస్ చర్యలు ఉంటాయి. ఇప్పటి వరకు నియోజకవర్గాల్లో ఎంత మంది మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నిసార్లు గ్రీవెన్స్ నిర్వహించారో నాకు నివేదిక ఇవ్వండి' అని లోకేశ్ ఆదేశించారు.

ఎంతటివారికైనా పార్టీనే సుప్రీం

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి, ఎంపీ చిన్ని వివాదంపై లోకేశ్ స్పందిస్తూ... 'క్రమశిక్షణ విషయంలో టీడీపీ పెట్టింది పేరు. దాన్ని చెడగొట్టేలా ఏ స్థాయి నాయకుడు ప్రవర్తించినా చర్యలకు ఉపేక్షించేది లేదు. ఎవరికైనా పార్టీనే సుప్రీం. పార్టీ లేకుంటే ఎంపీలు, ఎమ్మెల్యేలు లేరు.పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటేనే మంత్రి పదవులైనా, కార్పొరేషన్ పదవులైనా. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకుని నడుచుకోవాలి. పార్టీ లైన్ దాటి విమర్శలు, ఆరోపణలు చేసే వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. పార్టీని బేఖాతరు చేసే వారు, తమ సొంత ఇమేజ్‌తో గెలిచామనుకునే వారు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి గెలవచ్చు. తిరువూరు వివాదంపై నివేదికను బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడితోపాటు నాకూ ఇవ్వండి. చంద్రబాబు లండన్ పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత మాట్లాడి ఓ నిర్ణయం తీసుకుంటాం' అని తెలిపారు.

సీనియర్ చనిపోతే ఇంటికి కూడా వెళ్లరా..!

కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఉదంతంపైనా లోకేశ్ సీరియస్ అయ్యారు. కావలిలో సుదీర్ఘకాలం పార్టీకి సేవలందించిన సుబ్బానాయుడు విషయంలో ఎమ్మెల్యే తీరు సరిగా లేదన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రి ఫరూక్‌ని కార్లో కూర్చోబెట్టుకుని కృష్ణా రెడ్డి వారిని కూడా తప్పుగా ప్రొజెక్ట్ చేశారని ఆరోపించారు. కావలిలో జరిగే సుబ్బానాయుడు కార్యక్రమానికి తానుకూడా వస్తున్నట్లు స్పష్టం చేశారు. 'పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏ నియోజకవర్గంలో ఏం జరుగుతుందో ఓ కంట కనిపెట్టి ఉండాల్సిన బాధ్యత మీపై ఉంది' అని పల్లాకు లోకేశ్ తేల్చి చెప్పారు. ఆర్టీసీ కార్పొరేషన్ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావును ఉద్దేశించి మాట్లాడుతూ.. 'జోగి రమేశ్ బీసీ కార్డు వాడి టీడీపీపైనా, చంద్రబాబుపైనా విమర్శలు చేస్తూ రెచ్చిపోతుంటే మీరంతా ఏం చేస్తున్నా రు? కులం కార్డు తీసిన వెంటనే మీరు స్పందించాల్సిన పని లేదా? సీనియర్లు ఎవరికి వారు స్వతహాగా నిర్ణయాలు తీసుకుని స్పందించాలి. పార్టీ స్ట్రాటజీ కమిటీ కూడా ఎప్పటికప్పుడు ప్రత్యర్థుల విమర్శలను గమనిస్తూ కౌంటర్లు సిద్ధం చేయాలి' అని లోకేశ్ ఆదేశించారు.

ఎందుకంత జాప్యం?

- పదవీ విరమణ ప్రయోజనాల చెల్లింపులపై హైకోర్టు అసంతృప్తి
- పిటిషనర్లకు 10 శాతం వడ్డీతో ప్రయోజనాలు చెల్లించండి
- కేడీసీసీ బ్యాంకును ఆదేశించిన ధర్మాసనం

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి పదవీ విరమణ ప్రయోజనాలు(టెర్మినల్ బెనిఫిట్స్) చెల్లించడంలో జరుగుతున్న జాప్యాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఏళ్ల తరబడి సేవలు అందించిన ఉద్యోగులకు చట్టంలో నిర్దేశించిన మేరకు బెనిఫిట్స్ చెల్లించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. వీటిని చెల్లించడం దాతృత్వం కాదని, అది వారి హక్కు అని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని అధికరణ 300ఏ ప్రకారం పదవీ విరమణ ప్రయోజనాలు ఆస్తి కిందికి వస్తాయని తెలిపింది. అధికరణ 21 ప్రకారం జీవనోపాధి హక్కులో అవి అంతర్భాగమని పేర్కొంది. ఆర్థిక పరిస్థితి బాగాలేదనే కారణం చూపి ఉద్యోగుల భద్రత హక్కును కాలరాయలేరని, చట్ట నిబంధనల ప్రకారం పదవీ విరమణ చేసిన ఉద్యోగి దరఖాస్తు చేసుకున్న రోజు నుంచి 30 రోజుల్లోగా గ్రాట్యుటీ చెల్లించాల్సిన బాధ్యత ఉందని, విఫలమైతే ఆరోజు నుంచి వడ్డీ కూడా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. పిటిషనర్లకు చెల్లించిన టెర్మినల్ బెనిఫిట్స్‌లో వాటాను పీఏసీఎస్ నుంచి వసూలు చేసుకొనే హక్కు డీసీసీబీకి ఉందని పేర్కొంది. కోర్టు ఖర్చుల కింద పిటిషనర్లకు రూ.10వేలు చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కుంచం మహేశ్వరరావు ఇటీవల తీర్పు ఇచ్చారు. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(కేడీసీసీబీ) పరిపాలన నియంత్రణలో చిట్టిబోయిన భారతరావు, పి.చంద్రమౌళీశ్వరరావు, బండ శివరామకృష్ణప్రసాద్, ఏ.సాయిబాబు పెయిడ్ సెక్రటరీలుగా నియమితులయ్యారు. వీరు పదవీ విరమణ చేసిన అనంతరం బెనిఫిట్స్ చెల్లించలేదు. దీంతో 2016లో వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు.

పంచాయతీల ప్రక్షాళన

మారనున్న గ్రామీణ ముఖచిత్రం

- నాలుగు విభాగాలుగా గ్రామ పాలన
- 359 రూర్బన్ పంచాయతీల ఏర్పాటు
- రియల్ టైంలో గ్రామ పంచాయతీలలో సేవలు
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీరాజ్ ప్రక్షాళన వేగం పుంజుకుంది. దీంతో గ్రామీణ ముఖచిత్రం సమూలంగా మారనుండడంతోపాటు సేవల్లో వేగం, పారదర్శకత పెరగనుంది. పంచాయతీల ప్రక్షాళనలో భాగంగా ఆ శాఖ చేసిన మొదటి ప్రతిపాదనకు ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రభుత్వం ఆమోదించింది. మరోవైపు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయంతో ప్రక్షాళనలో మరో అడుగు పడింది. ఆ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. గతంలో క్లస్టర్ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రంలో పంచాయతీలను 7,244 క్లస్టర్లుగా గుర్తించారు. క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయంతో క్లస్టర్ వ్యవస్థ రద్దయి 13,351 గ్రామ పంచాయతీలు ఇకనుంచి స్వతంత్ర గ్రామ పంచాయతీలుగా దేనికదే పాలన సాగించనున్నాయి. ఇప్పటికే గ్రామ పంచాయతీల పునర్విభజన కోసం నియమించిన కమిటీ 13,351 గ్రామ పంచాయతీలను నాలుగు గ్రేడ్‌లుగా విభజించింది. రూర్బన్ పంచాయతీ, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 గ్రామ పంచాయతీలుగా గుర్తించారు. అధిక జనాభా, ఆదాయం కలిగిన 359 రూర్బన్ గ్రామ పంచాయతీలను గుర్తించి, వాటిలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి కల్పించి ప్రత్యేక అధికారులుగా నియమిస్తారు. ఇక నుంచి పంచాయతీ కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికారులు(పీడీవో)గా పిలవనున్నారు. రూర్బన్ పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీవో కేడర్ అధికారులను నియమిస్తారు. ప్రస్తుతం 6 గ్రేడ్‌లుగా ఉన్న గ్రామ పంచాయతీలను రూర్బన్ పంచాయతీలు పోను మిగిలిన వాటిని గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీలుగా విభజిస్తారు. 359 పంచాయతీల్లో ఉన్న 1,097 జూనియర్ అసిస్టెంట్/జూనియర్ అసిస్టెంట్ కమ్ బిల్ కలెక్టర్లలో సీనియారిటీని బట్టి పదోన్నతులు కల్పించి వారిని రూర్బన్ పంచాయతీల్లో సీనియర్‌అసిస్టెంట్లుగానియమిస్తారు.

మున్సిపాలిటీల తరహాలో..

మున్సిపాలిటీ తరహాలో గ్రామ పంచాయతీల్లో పలు విభాగాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా మరిన్ని సేవలు అందుబాటులోకి తెస్తారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, గ్రామీణ ప్రణాళిక, వీధిలైట్లు, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలుగా విభజించనున్నారు. వీటి ద్వారా సేవలందించేందుకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమిస్తారు. వారికి గ్రామ పంచాయతీల నిధుల నుంచి జీతాలు చెల్లిస్తారు. గ్రామ పంచాయతీల్లో అదనంగా ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లను ఇక నుంచి గ్రామ పంచాయతీల్లో ప్లానింగ్ అసిస్టెంట్లుగా పేర్కొంటారు. వారి ఆధ్వర్యంలో గ్రామాల్లో భవనాలు, లేఅవుట్ రూల్స్ అమలు చేస్తారు.

ప్రత్యేక ఐటీ విభాగం

పంచాయతీరాజ్‌లో ప్రత్యేకమైన ఐటీ విభాగాన్ని ఏర్పాటు చేసి అదనంగా ఉన్న డిజిటల్ అసిస్టెంట్లు, ఇతర అర్హత ఉన్న సిబ్బందిని వినియోగించి గ్రామ పంచాయతీల్లో డిజిటల్ విభాగాన్ని అభివృద్ధి చేస్తారు. గ్రామ పంచాయతీల్లో రికార్డులు డిజిటలైజ్‌చేసి రియల్ టైంలో గ్రామ పంచాయతీల ద్వారా సర్వీసులు అందించేందుకు యంత్రాంగాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించారు.

పారదర్శకత, జవాబుదారీతనం ముఖ్యం

- ప్రభుత్వరంగ సంస్థలకు ఇవే కీలకం
- ఆడిట్ అభ్యంతరాలకు బాధ్యులైన ఉద్యోగులపై చర్యలకు సిఫారసు
- శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ రవికుమార్



రాష్ట్ర శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కూన రవికుమార్

గుంటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలకు జవాబుదారీతనం ముఖ్యమని, అందుకనుగుణంగా పారదర్శకంగా పనిచేయాలని రాష్ట్ర శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆయన అధ్యక్షతన మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ, రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ, ఏపీ ఏవియేషన్, ఏపీ ఎయిర్ పోర్ట్స్ అభివృద్ధి కార్పొరేషన్ల కార్యకలాపాలపై కమిటీ సమీక్షించింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ 182 సంస్థల కార్యకలాపాలను విచారణ చేయనుందని, ఇప్పటి వరకు 30 సంస్థలను పరిశీలించిందని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు పొందుతున్న ప్రతి సంస్థా గణాంకాలు, ఆడిట్, ఆర్థికపరమైన వివరాలు విధిగా.. పక్కాగా చూపాలన్నారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలోగా తనిఖీలు పూర్తి కావాలని స్పష్టం చేశారు. వార్షిక కార్యకలాపాలు, వార్షిక ఆదాయం, వ్యయంపై విధిగా నివేదికలు సమర్పించాలని కోరారు. ఆడిట్ అభ్యంతరాలను సంస్థలు సమర్పించాలన్నారు. ఏపీ అటవీ అభివృద్ధి సంస్థ గత ఎనిమిదేళ్లుగా, రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ 2014 నుంచి వార్షిక నివేదికలు సమర్పించక పోవడంపై ప్రశ్నించారు. ఆడిట్ అభ్యంతరాలకు బాధ్యులైన ఉద్యోగులపై చర్యలకు సిఫారసు చేయాలన్నారు. రాష్ట్రంలో అటవీ అభివృద్ధి సంస్థను మరింత బలోపేతం చేసేలా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని ఆయన సూచించారు. అటవీ శాఖ ఎకో టూరిజం ప్రాజెక్టులను పీపీపీ పద్ధతిలో నిర్వహించేందుకు గల అవకాశాలను పరిశీలించాలన్నారు. ఏపీ ఎయిర్ పోర్టుల అభివృద్ధి సంస్థ ఆరేళ్లుగా ఆడిట్ చేయకపోవడాన్ని రవికుమార్ ప్రశ్నించారు. వచ్చే బడ్జెట్ సమావేశాల నాటికి నివేదికలు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ హాజరు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆ సంస్థ కార్యకలాపాల సమీక్షను నిర్వహించలేదు. ఏపీ అటవీ అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్, రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గిరీషా ఆయా సంస్థల ప్రగతి నివేదికలను వివరించారు. ఏపీ ఎయిర్ పోర్టుల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ రెండు, మూడు వారాల్లో గణాంకాలు అప్‌డేట్ చేస్తామన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు వచ్చే ఏడాది జూన్ నాటికి ప్రారంభించేందుకు, కర్నూలు ఎయిర్‌పోర్టుకు మరిన్ని ఎక్కువ విమాన రాకపోకలు సాగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో అదనంగా తొమ్మిది ఎయిర్ పోర్టల అభివృద్ధికి ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు.



ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ అధికారుల సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేశ్, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, గొల్ల బాబూరావు తదితరులు

ఏమిటీ నత్తనడక?

- 'అమృత్ భారత్' పనుల్లో జాప్యంపై ఎంపీల అసంతృప్తి
- విశాఖ స్టేషన్ పనులు పూర్తి చేయాలి: కేంద్ర మంత్రి రామ్మోహన్
- వాల్తేరు డివిజన్ ఎంపీలతో రైల్వేజోన్ అధికారుల భేటీ

విశాఖపట్నం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'అమృత్ భారత్' పథకం కింద చేపట్టిన రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని పార్లమెంటు సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. వాల్తేరు డివిజన్ పరిధిలోని పార్లమెంటు సభ్యులతో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ అధికారులు మంగళవారం విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కు రూ.493 కోట్లు మంజూరయ్యాయని, భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైతే విశాఖ స్టేషన్‌పై లోడ్ పెరుగుతుందని, త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కోరారు. శ్రీకాకుళం నుంచి తెలంగాణలోని చర్లపల్లి వరకు నేరుగా ఒక రైలు నడపాలన్నారు. అదేవిధంగా తిరుపతికి కూడా ఒక రైలు వేయాల్సిన అవసరం ఉందన్నారు. అరకులోయ రైలుకు మరిన్ని కోచ్‌లు జత చేయాలని కోరారు. ఇది సీజన్ కావడంతో శబరిమలకు రైళ్ల సంఖ్య పెంచాలన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల నాటికి స్టేషన్ల అభివృద్ధి పనులు వేగవంతం కావాలని, దీనికి ఎంపీలను సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు గెజిట్ నోటిఫికేషన్ త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. పలువురు ఎంపీలు మాట్లాడుతూ విశాఖ నుంచి చెన్నై, బెంగళూరు, తిరుపతి తదితర నగరాలకు రైళ్ల సంఖ్య పెంచాలని, రైలు అండర్ బ్రిడ్జి, ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం వేగవంతం చేయాలని కోరారు. ఇంకా స్టేషన్లలో ప్లాట్‌ఫారాల ఎత్తు పెంపు, సబ్‌వేల నిర్మాణం, కొత్త రైల్వే లైన్లు, అవసరమైన ప్రాంతాల్లో డబ్లింగ్, ట్రిప్లింగ్ లైన్లు, సీనియర్ సిటిజన్లు, స్పోర్ట్స్ కోటా కలిగిన వారికి టికెట్ల రాయితీ అంశాలపై చర్చించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ జోన్ ఆపరేషన్ తీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కొత్త ప్రతిపాదనలు, నడుస్తున్న ప్రాజెక్టుల గురించి ఎంపీలకు తెలియజేశారు. ఎంపీల సూచనలను పరిగణనలోకి తీసుకొని పనులు చేపడతామని వాల్తేరు డివిజన్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా చెప్పారు. సమావేశంలో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేశ్, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు(విజయనగరం), తనూజారాణి(అరకు), సప్తగిరి శంకర్(కొరాపుట్), మహేశ్ కశ్యప్(బస్తర్), ఏడీఆర్ఎం శాంతారామ్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ కల్లా భోగాపురం ఎయిర్‌పోర్టు సిద్ధం!

- ప్రధానితో ప్రారంభోత్సవానికి సన్నాహాలు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

భోగాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జూన్‌కల్లా భోగాపురం అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం రెడీ అవుతుందని పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు చెప్పారు. ఇది ఉత్తరాంధ్రకు కేంద్రబిందువు కానుందన్నారు. విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయోనని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని సీఎం చంద్రబాబు ఛాలెంజ్‌గా తీసుకున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో పనులు 25శాతం పూర్తవగా, చంద్రబాబు సీఎం అయ్యాక ప్రస్తుతం 91.7శాతం పూర్తయ్యాయని చెప్పారు. విశాఖ విమానాశ్రయం కన్నా ఇక్కడ ఎక్కువగా విమానాలు రాకపోకలు సాగించేలా చేస్తున్నామన్నారు. కొన్ని ఎయిర్‌లైన్స్‌లతో సంప్రదింపులు చేస్తున్నామని తెలిపారు. వచ్చేఏడాది జూన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో దీన్ని ప్రారంభించేందుకు సీఎం సన్నాహాలు చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతానికి 5 స్టార్ హోటల్స్ కూడా వస్తున్నాయని, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ ప్రాంతానికి ఏవియేషన్ యూనివర్సిటీని తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.



లండన్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, భువనేశ్వరి

ప్రజాసేవకు దక్కిన గౌరవం

విశిష్ట ఫెలోషిప్ అవార్డు స్వీకరించిన భువనేశ్వరి

హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ హోదాలో గోల్డెన్ పీకాక్ అవార్డు కూడా..

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులు స్వీకరించారు. లండన్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్(ఐవోడీ) సంస్థ నుంచి ఈ అవార్డులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి చంద్రబాబు కూడా హాజరయ్యారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ హోదాలో డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025 అవార్డును భువనేశ్వరి స్వీకరించారు. ప్రజాసేవ, సామాజిక ప్రభావం అంశాల్లో విశిష్ట సేవలు అందించినందుకుగాను ప్రతిష్ఠాత్మక ఐవోడీ ఈ అవార్డు అందజేసింది. హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎక్స్‌లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో గోల్డెన్ పీకాక్ అవార్డును ప్రకటించగా.. హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ హోదాలో ఈ అవార్డును కూడా ఆమె స్వీకరించారు. జాతీయస్థాయిలో ఎఫ్ఎంసీజీ విభాగంలో హెరిటేజ్ ఫుడ్స్‌ను ఎక్స్‌లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు.



ఐవోడీ సంస్థ కార్యక్రమంలో ప్రతినిధులతో ముచ్చటిస్తున్న భువనేశ్వరి

విజన్ ఉంటేనే అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

మార్పు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు టెక్నాలజీ విసిరే సవాళ్లను ఎదుర్కొనేందుకు దూరదృష్టి, పక్కా ప్లానింగ్ ఉండాలని సూచించారు. '1990ల్లో ఐటీ రంగ భవిష్యత్‌పై సందేహాలున్నా.. ఉమ్మడి ఏపీ సీఎంగా బిల్‌గేట్స్‌ను ఆహ్వానించి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్‌ను స్థాపించేందుకు చొరవ తీసుకున్నాను. ఇప్పుడు భారతీయులు ప్రత్యేకించి తెలుగువారు గ్లోబల్ ఐటీ రంగంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ) చాలా వేగంగా విస్తరిస్తోంది. భవిష్యత్ మొత్తం దాని చుట్టూనే తిరగనుంది. దీనికి అనుగుణంగా ఏపీలో విధానాలను, ప్రణాళికలను రూపొందించుకుంటున్నాం. గూగుల్ తన అతిపెద్ద ఏఐ కేంద్రాన్ని అమెరికా వెలుపల విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తోంది. ఇది రాష్ట్రంలో ఇన్నోవేషన్స్, రీసెర్చ్, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి అంశాల అభివృద్ధికి దోహదపడుతుంది' అని సీఎం చెప్పారు. ఇంకా ఏం చెప్పారంటే..

టెక్నాలజీతో మెరుగైన సేవలు

టెక్నాలజీ అనేది ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి ఉపయోగపడేలా ఉండాలి. సాంకేతికతతో మెరుగైన సేవలు అందించేలా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి, మేం ఆ దిశగానే ప్రయాణిస్తున్నాం. ఇటీవల ఏపీని తాకిన మొంథా తుఫాన్ సమయంలో డేటా డ్రివెన్ రియల్ టైం గవర్నెన్స్ సిస్టమ్ వల్ల కచ్చితమైన అంచనాలు రూపొందించాం. ప్రిడిక్టివ్ అనలిటిక్స్ ద్వారా ప్రాణ, ఆస్తినష్టాన్ని తగ్గించాం. పాలనను ప్రజలకు మరింత దగ్గర చేసేలా 700కుపైగా పౌరసేవలను నేరుగా వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తెచ్చాం. ఏపీ ప్రభుత్వం రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను స్థాపించింది. కేవలం ఒక్క సంవత్సరంలోనే 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించింది. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా దేశ లక్ష్యాలను కూడా ఏపీ పంచుకుంటోంది. కొత్త రాజధాని అమరావతిని బ్లూ, గ్రీన్ సిటీ నమూనాగా రూపొందించాం.

ప్రపంచవ్యాప్తంగా వస్తున్న వాతావరణ మార్పులు దేశాలను, పౌరులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. దీనిని దీర్ఘకాలంలో పరిష్కరించుకునే సమయం మనకు లేదు. ప్రతికూల వాతావరణాలతో పెనుముప్పు ఎదుర్కోకముందే మనం మేలుకోవాలి. వసుధైక కుటుంబం అనే భారతీయ భావనతో దేశాలన్నీ కలిసి పనిచేయాలి. దేశాలు, భాషలు, సంప్రదాయాలు వేరైనా అంతా కలిసి భూమిపైనే నివసిస్తున్నాం. భావి తరాలకు మెరుగైన పరిస్థితులను కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. దీనికి ప్రభుత్వాలు, ప్రైవేటు రంగం కలిసి పనిచేయాలి. అప్పుడే భావితరం సురక్షితంగా ఉంటుంది. భారత్, యూకే నడుమ సుదీర్ఘమైన చారిత్రక బంధం ఉంది. దీనిని ఎప్పటికప్పుడు బలోపేతం చేసుకుంటూ వస్తున్నాయి. ఈ ఏడాది జూలైలో ఇరుదేశాల మధ్య కుదిరిన ఆర్థిక, వాణిజ్య ఒప్పందం ద్వైపాక్షిక సంబంధాల్లో మైలురాయి. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు వంటి వాటిలో సహకారానికి ఈ ఒప్పందం బలమైన పునాది వేసింది. భారత్ తన 100వ స్వాతంత్ర్యదినోత్సవం నాటికి ప్రపంచంలోనే నంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని ఆకాంక్షిస్తోంది.. ఆ దిశగా అడుగులు వేస్తోంది.

భువనేశ్వరికి అభినందనలు

ప్రతిష్ఠాత్మక సంస్థగా ఐవోడీకి ప్రపంచవ్యాప్తంగా పేరుంది. ఇలాంటి సంస్థ భువనేశ్వరి సేవలను గుర్తించడం చాలా సంతోషాన్నిస్తోంది. ఈ అవార్డులు దక్కించుకున్నందుకు ఆమెకు అభినందనలు.

యూకే వర్సిటీలతో ఏపీ భాగస్వామ్యం!

▸▸ లండన్‌లోని భారత్ హైకమిషనర్‌తో సీఎం చర్చ

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): లండన్‌లోని భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామితో సీఎం చంద్రబాబు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. మంగళవారం జరిగిన ఈ భేటీలో యూకేలోని వివిధ విశ్వవిద్యాలయాలతో రాష్ట్రప్రభుత్వం నాలుగు అంశాల్లో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకునే అంశంపై చర్చ జరిగింది. ఏపీలో ఆయా వర్సిటీల కేంద్రాలను ప్రారంభించడంపైన, కేంద్రం సహకారంతో జాయింట్ వెంచర్ ఏర్పాటుపైనా చర్చించారు. లండన్ వర్సిటీలు ఏపీ విద్యాసంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకునే అంశాన్ని పరిశీలించాలని, అలాగే విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల మధ్య విద్యార్థుల ఎక్స్ఛేంజ్ అంశంపై దృష్టి సారించాలని సీఎం కోరారు. లైఫ్ సైన్సెస్, బయో జెనెటిక్స్, ఖనిజాల వెలికితీత, మెటల్స్ అంశాల్లో ఏపీ, యూకే వర్సిటీల మధ్య భాగస్వామ్యాల గురించి.. ఏఐ, సెమీకండక్టర్, మెరైన్ ఇండస్ట్రీ 4.0లో సహకారంపైనా దొరస్వామితో ఆయన చర్చించారు.

1.03 లక్షల కోట్ల పెట్టుబడులు..

83 వేల ఉద్యోగాలు

కంపెనీల ప్రతిపాదనలకు ఎస్ఐపీసీ ఆమోదం.. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో భారీగా పెట్టుబడులు

- ▸▸ 22,976 కోట్లతో ఇండిచిప్ సెమీ కండక్టర్ ప్లాంట్
- ▸▸ 2,171 కోట్ల పెట్టుబడికి రహేజా ప్రతిపాదన
- ▸▸ అల్లూరి జిల్లాలో నవయుగ పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ విస్తరణ
- ▸▸ విజయనగరంలో 8,570 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంటు
- ▸▸ 7న ఎస్ఐపీబీ ఆమోదం తర్వాత క్యాబినెట్ ముందుకు ప్రతిపాదనలు

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. రూ. 1,03,389 కోట్ల పెట్టుబడులతో 83,436 మందికి ఉద్యోగాలు కల్పించే పెట్టుబడుల ప్రతిపాదనలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధ్యక్షతన మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ ఆమోదం తెలిపింది. ఇక రాష్ట్రంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచశ్రేణి సంస్థలు ముందుకు వచ్చాయి. రూ.22,976 కోట్లతో కర్నూలు జిల్లా ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ క్లస్టర్‌లో స్థాపించే ఇండిచిప్ సెమీకండక్టర్ ప్లాంట్ ఏర్పాటుకు ఎస్ఐపీసీ ఆమోదం తెలిపింది. ఈ సంస్థకు ఎకరా రూ.10 లక్షల చొప్పున 150 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు వల్ల 1,241 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఎస్ఐపీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన పెట్టుబడులను ఈనెల 7న సీఎం అధ్యక్షతన జరగనున్న రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదిస్తుంది. ఆ తర్వాత ఈ ప్రతిపాదనలనకు ఈనెల 10న ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే క్యాబినెట్ భేటీలో ఆమోదముద్ర వేస్తారు.

ఎస్ఐపీసీ ఆమోదించిన ప్రతిపాదనలు ఇలా..

- కర్నూలు జిల్లాలో 250 మెగావాట్ల డీసీ సోలార్ ప్రాజెక్టును ఎస్ఐఈఎల్ సోలార్ సంస్థ రూ. 1,728 కోట్లతో స్థాపించడం ద్వారా 860 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- అల్లూరి సీతారామరాజు జిల్లా చిట్టంవలసలో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టును 800 మెగావాట్ల నుంచి 1,800 మెగావాట్లకు రూ. 7,972 కోట్లతో నవయుగ ఇంజనీరింగ్ సంస్థ విస్తరిస్తుంది. దీంతో 2,700 మందికి ఉద్యోగాలొస్తాయి.
- అనకాపల్లి జిల్లాలో రీన్యూ ఎనర్జీ 170 మెగావాట్ల విండ్‌సోలార్ హైబ్రీడ్, 50 మెగావాట్ల విండ్, 120 మెగావాట్ల డీసీ సోలార్, 200 మెగావాట్ల బీఈఎస్ఎస్ పవర్ ప్లాంట్‌ను రూ.1,461 కోట్లతో స్థాపిస్తుంది. 775 మందికి ఉద్యోగాలు.
- రిలయన్స్ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా ఆహార ఉత్పత్తుల విక్రయం కోసం రూ. 202 కోట్లతో 436 మందికి ఉద్యోగాలు కల్పించే ప్రతిపాదన చేసింది.
- మైరాబే వ్యూ రిసార్ట్స్ రూ. 157 కోట్లతో స్థాపించే ప్రాజెక్టులో 980 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. టూరిజం పాలసీలో భాగంగా భూమి కేటాయించాలన్న అభ్యర్థనకు ఆమోదం లభించింది. అలాగే, విశ్వనాథ్ కన్సార్టియం అండ్ కన్వెన్షన్ రూ. 51 కోట్లతో చేపట్టే ప్రాజెక్టుకు, ఎస్వీన్ హోటల్స్ అండ్ రీసార్ట్సుకు, రూ. 225 కోట్లతో నిర్మించే పీవీఆర్ హోటల్స్, రూ.348 కోట్ల పెట్టుబడి పెట్టే మైలాన్ లీజర్స్‌కు భూముల కేటాయింపుల ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.
- పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలోని కాసానుపల్లిలో రూ. 1,340 కోట్లతో 360 మందికి ఉద్యోగాలను ఇచ్చే చెట్టినాడ్ సిమెంట్స్‌కు ప్రోత్సాహకాలను ఇచ్చేందుకు సంసిద్ధత.
- సుగ్నా స్పాంజ్ అండ్ పవర్ లిమిటెడ్ రూ.1,247 కోట్లతో ఏర్పాటు చేసే స్టీల్ ప్లాంట్‌కూ ఆమోదం. 1100 మందికి ఉపాధి.
- విజయనగరంలో రూ. 8,570 కోట్లతో 1,000 మందికి ఉద్యోగాలను కల్పించే సూపర్ స్మెల్టర్స్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంటు స్థాపిస్తుంది.
- నాయుడుపేటలో వోల్ట్సన్ ల్యాబ్స్ రూ.1,682 కోట్లతో 415 మందికి ఉద్యోగాలు కల్పించే సోలార్ సెల్స్ తయారీ ప్లాంట్‌కు ఆమోదం లభించింది.
- రూ.44,000 కోట్లతో ఏఎంజీ మెటల్స్ గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్స్ తయారీ కోసం 250 ఎకరాలను కేటాయించేందుకు ఆమోదం.
- నెల్లూరు జిల్లాలోని కడలూరు మండలం, బొడ్డువారిపాలెంలో 240 కోట్లతో 588 మందికి ఉద్యోగాలు కల్పించే గ్రీన్ ఫీల్డ్ ఫైబర్ బోర్డు ప్లాంట్‌కు ఎస్ఐపీసీ సమ్మతి తెలిపింది.
- రూ. 700 కోట్లతో 1,000 మందికి ఉపాధి కల్పించేందుకు ఎపిటోమ్స్ కాంపోనెంట్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు, ఎపిఎస్వీఎల్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 2,081 కోట్ల పెట్టుబడితో 600 మందికి ఉద్యోగాలు కల్పించే ప్రతిపాదనకు ఆమోదం లభించింది.
- రూ. 1,704 కోట్లతో 2,630 మందికి ఉద్యోగాలు కల్పించే ఎస్‌సీఐసీ వెంచర్స్‌కు, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ విస్తరణ ప్రతిపాదనలను గ్రీన్‌సిగ్నల్ లభించింది.
- ఫ్లుంటెగ్రిడ్ లిమిటెడ్ రూ.150 కోట్లతో 2,000 మందికి ఉద్యోగాలను ఇచ్చే ప్రతిపాదనకు, మదర్సన్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ రూ. 109.73 కోట్లతో 700 మందికి ఉపాధిని కల్పించే ప్రతిపాదనకు ఆమోదముద్ర పడింది.
- ఐస్ప్రౌట్ బిజినెస్ సెంటర్‌ను రూ. 626.9 కోట్లతో స్థాపించి 12,500 మందికి ఉద్యోగాలు కల్పిస్తానని పేర్కొంది.
- క్వార్ట్స్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 115 కోట్ల పెట్టుబడితో 2,000 మందికి ఉద్యోగాల కల్పన ప్రతిపాదనకూ ఆమోదం దక్కింది.
- కె.రహేజా కార్పొరేషన్ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 2,171 కోట్ల 9,681 మందికి ఉద్యోగాలు కల్పించే ప్రతిపాదనలకూ ఎస్ఐపీసీ ఆమోదించింది.
- ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ లిమిటెడ్ రూ. 119.18 కోట్లతో 2000 మందికి ఉద్యోగాల కల్పన ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. మొత్తంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో రూ. 32,953.81 కోట్ల పెట్టుబడితో 64,352 మందికి ఉద్యోగాలను కల్పించే ప్రతిపాదనలకు ఎస్ఐపీసీ ఆమోదించింది.

ఎవరి వైఖరి వారిదే!

- ▸▸ టీడీపీ క్రమశిక్షణ కమిటీ ముందుకు కొలికపూడి, చిన్ని
- ▸▸ నా నియోజకవర్గంలో ఎంపీకి పనేంటి?
- ▸▸ వచ్చే ఎన్నికల్లో నాకు సీటు లేదంటున్నారు
- ▸▸ తిరువూరు ఎమ్మెల్యే ఫిర్యాదు
- ▸▸ నేను ఏనాడూ గీత దాటలేదు
- ▸▸ చంద్రబాబే సుప్రీం.. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా ఓకే
- ▸▸ విజయవాడ ఎంపీ స్పష్టీకరణ
- ▸▸ నేడు రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు కమిటీ నివేదిక
- ▸▸ సీఎం లండన్ నుంచి వచ్చాక నిర్ణయం

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పంచాయితీ టీడీపీ కేంద్ర కార్యాలయానికి చేరింది. క్రమశిక్షణ కమిటీ ముందు హాజరైన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తమ తమ వాదనలను వినిపించారు. తమ వైఖరులను పునరుద్ఘాటించారు. 'తిరువూరు నియోజకవర్గంలో ఎంపీకి ఏం పని? ఆయన నా నియోజకవర్గంలో అనవసర వివాదాలు సృష్టిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో నాకు సీటు లేదని చెబుతున్నారు. ఆయన నా నియోజకవర్గంలో జోక్యం చేసుకోకుంటే నేనూ మాట్లాడను' అని కొలికపూడి చెప్పారు. అయితే పార్టీకి నష్టం కలిగించేలా తాను గీత దాటి వ్యవహరించలేదని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) స్పష్టంచేశారు. ఎమ్మెల్యే, ఎంపీ కొద్దిరోజుల కిందట పరస్పరం బహిరంగంగా ఆరోపణలు చేసుకోవడం, పార్టీ పరువుకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారంటూ సీఎం చంద్రబాబు ఆగ్రహించడం.. ఇద్దరినీ పిలిపించి వివరణ తీసుకుని తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించడం తెలిసిందే. దీంతో టీడీపీ క్రమశిక్షణ కమిటీ మంగళవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి ఇద్దరినీ పిలిపించారు. ముందుగా కొలికపూడి వచ్చి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతోపాటు క్రమశిక్షణ కమిటీ సభ్యులు కొనకళ్ల నారాయణరావు, వర్ల రామయ్య, ఎంఏ షరీఫ్, పంచుమర్తి అనూరాధ ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. సుమారు నాలుగు గంటలపాటు తన వాదనలు వినిపించారు. నివేదిక రూపంలో కమిటీకి అందజేశారు. ఆ తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చిన్నిపై తాను చేసిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను క్రమశిక్షణ కమిటీ ముందు ఉంచానని తెలిపారు. వారు అడిగిన ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు, వివరణ ఇచ్చానన్నారు. వివాదంపై పార్టీ అధినేత ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానన్నారు.

పార్టీ నిర్ణయమే శిరోధార్యం..

మరోవైపు ఎంపీ కేశినేని చిన్ని సాయంత్రం 4 గంటల ప్రాంతంలో క్రమశిక్షణ కమిటీ ముందు హాజరయ్యారు. సుమారు గంటపాటు తన వాదన వినిపించారు. ఏనాడూ పార్టీకి నష్టం కలిగించేలా గీత దాటి వ్యవహరించలేదని స్పష్టం చేశారు. 'పార్టీ కోసం 2014 నుంచీ కష్టపడుతున్నాను. పార్టీ సిద్ధాంతాలపై పూర్తి అవగాహన ఉంది. పార్లమెంటు సభ్యుడిగా నా నియోజకవర్గం పరిధిలోని ప్రతి అసెంబ్లీ సెగ్మెంటులోని కార్యకర్తలు, ప్రజల సంక్షేమం కోసం ఆలోచన చేస్తా. అందులో భాగంగానే తిరువూరులో.. అది కూడా పార్టీ అనుమతితోనే పర్యటించాను. వ్యక్తిగత ఎజెండాలతో పార్టీని నాశనం చేయాలనుకునే వారి విషయంలో నేను కఠినంగా ఉండాల్సి వస్తోంది. నా నియోజకవర్గం పరిధిలో ఎవరితోనూ విభేదాలు లేవు. ఎవరికైనా నాతో సమస్య ఉంటే నేనే ఒక అడుగు దిగి పరిష్కరించుకుంటా. పార్టీని పణంగా పెడితే మాత్రం సహించలేను' అని చెప్పారు. అనంతరం చిన్ని కూడా మీడియాతో మాట్లాడారు.. తాను చంద్రబాబుకు వీరభక్తుడినని.. తెలుగుదేశం పార్టీయే తనకు దైవమని అన్నారు. 'చంద్రబాబు నాకు సుప్రీం. ఆయన తీసుకునే ఏ నిర్ణయాన్నయినా గౌరవిస్తాను. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల మనోభావాలను గౌరవించేలా పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నాను' అని పేర్కొన్నారు. వీరిద్దరి వివరణలను క్రోడీకరించి.. తమ అభిప్రాయాలతో క్రమశిక్షణ కమిటీ సభ్యులు బుధవారం పల్లా శ్రీనివాసరావుకు నివేదిక సమర్పించనున్నారు. దీనిపై చంద్రబాబు లండన్ నుంచి వచ్చిన తర్వాత నిర్ణయం తీసుకోనున్నారు.



జగన్ షో.. జనం పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. దీంతో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు కదల్లేని పరిస్థితి ఏర్పడింది. ప్రయాణికులు, అత్యవసర పనుల మీద వెళుతున్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంబులెన్స్ చిక్కుకుపోయింది. లారీలు, ఆటోలు, కార్లు, బస్సులు, ఆఖరుకు ద్విచక్ర వాహనాలు సైతం ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఉదయం ప్రారంభించిన జగన్ రోడ్డు షో మధ్యాహ్నం 3 గంటలు దాటే వరకు కొనసాగింది. పర్యటన మార్గంలో సమీప గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జనాలను తరలించేలా చర్యలు చేపట్టారు. జగన్ దగ్గరకు వస్తున్నారనగా.. ఎక్కడికక్కడ జనాలు హైవే మీదకు దూసుకువచ్చేలా ఏర్పాట్లు చేశారు. తీసుకువచ్చిన జనాలకు జెండాలు, కండువాలు, టోపీలను ముందుగానే వైసీపీ నేతలు పంపిణీ చేశారు. ముందుగా జనాలను హైవే సెంట్రల్ డివైడర్ల మీద కూర్చోపెట్టారు. దీంతో జగన్ రోడ్ షోలో 'జనం' భారీగా కదిలారు.

ఓదార్పులో ఇదేం షో?

జగన్ తుఫాను ప్రభావిత ప్రాంతాల పరిశీలన నేపథ్యంలో, పది కార్లు, 500 మందికి మాత్రమే పోలీసులు అనుమతి ఇచ్చారు. రోడ్డుషో నిర్వహించటానికి అనుమతి ఇవ్వలేదు. కానీ జగన్ 70 కార్లతో రోడ్డు షో నిర్వహించి...వాహనదారులకు, ప్రయాణికులకు, ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగించారు. రోడ్డు షో పొడవునా డబ్బులిచ్చి తీసుకువచ్చిన జనాలతో సీఎం సీఎం అంటూ నినాదాలు చేయించారు. బాధల్లో ఉన్న రైతులను పరామర్శించటానికి వెళ్లే తీరు ఇదేనా అంటూ.. ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన ప్రయాణికులు, వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు. తాడేపల్లి నుంచి కాన్వాయ్‌లో బయలు దేరిన జగన్ హైవే మీద రోడ్డు షో నిర్వహిస్తారని పోలీసులు ఊహించలేకపోయారు. తాడేపల్లి నుంచి విజయవాడ వచ్చిన జగన్ కాన్వాయ్..పటమట, ఆటోనగర్ మధ్య ప్రాంతంలో హైవే మీద కాన్వాయ్‌ను ఉద్దేశపూర్వకంగా నిలిపారు. అక్కడికి ముందుగా పెనమలూరు వైసీపీ నాయకులు, శ్రేణులను రప్పించారు. వాహనం దిగి జగన్ వారితో మాట్లాడారు. తర్వాత జగన్ తన కారు డోర్ దగ్గర లేచి నిలబడి కార్యకర్తలకు అభివాదం చేస్తూ నిదానంగా ముందుకు కదిలారు. అప్పటికే అక్కడికి వచ్చిన కార్యకర్తలు కాన్వాయ్‌ను అనుసరించారు. ఈ హఠాత్ పరిణామంతో పోలీసులు ఖంగుతిన్నారు.

నిబంధనలు తోసిరాజని..

నాయకులు నిర్దేశించిన ప్రాంతాలకు కార్యకర్తలు, డబ్బులు తీసుకుని వచ్చిన వారు చేరుకున్నారు. హైవే మీద ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వాహనాలు స్తంభించాయని విజయవాడ - మచిలీపట్నం మధ్యన ప్రత్యామ్నాయం కూడా లేదని చెప్పినా వైసీపీ నాయకులు వినలేదు. పైగా పోలీసుల మీద వైసీపీ శ్రేణులు దౌర్జన్యం చేశాయి. కాన్వాయ్‌ను వేగంగా ముందుకు కదిలించే ఏర్పాటు చేద్దామనుకుంటే



వర్షాలకు వాలిపోయిన వరి చేలో రైతులతో మాట్లాడుతున్న జగన్

పెనమలూరు వరకు కూడా ఎక్కడకక్కడ హైవే మీదకు తరలించిన జనాన్ని నాయకులు ఎక్కించారు. దీంతో పోలీసులకు అదుపు చేయటం కష్టమైపోయింది. తొక్కిసలాటలు జరుగుతాయేమోనని భయపడాల్సి వచ్చింది. పోలీసులు కార్యకర్తలను కాన్వాయ్ సమీపానికి రాకుండా అడ్డుకున్నారు. అయినప్పటికీ జగన్ కాన్వాయ్‌లోని వాహనాలు కార్యకర్తలు అనుసరిస్తున్నారని చూడకుండా ఎలాపడితే అలా నడిపారు.

ఢీ కొట్టుకున్న కాన్వాయ్ వాహనాలు

రోడ్డు షోలో జగన్ కాన్వాయ్‌లోని రెండు వాహనాలు పరస్పరం ఢీకొట్టుకున్నాయి. ఉయ్యూరు మండలం గండిగుంట దగ్గర జగన్ కాన్వాయ్‌లోని ఆ పార్టీ నేతల కార్లు ఒకదానికొకటి గుద్దుకోవడంతో పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఇంత జరిగినా వైసీపీ శ్రేణులు, నాయకులు పోలీసు ఆంక్షలను పట్టించుకోలేదు.

హైవేను బ్లాక్ చేసి..: పెడన నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జ్ ఉప్పల రాము గూడురులో హైవే పైకి భారీగా కార్యకర్తలను తీసుకురావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గూడురు సెంటర్ లో పోలీసులతో వైసీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. హైవేకు ఆటంకం లేకుండా కార్యక్రమం నిర్వహించుకోవాలని పోలీసులు ముందుగా చెప్పినా జగన్, ఆ పార్టీ నేతలు పట్టించుకోలేదు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గుంటూరు జిల్లా రెంటపాళ్ళ పర్యటనలో సింగయ్య మృతి వంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చూసుకుంటుంటే, వైసీపీ నేతలు మాత్రం అడుగడుగునా వాగ్వాదానికి దిగారు.

పండగా.. పరామర్శా..!

అసలే రైతులు పంటలు దెబ్బతిని బాధలో ఉంటే.. వైసీపీ నాయకులు జగన్ పర్యటనను పండగలా మార్చివేశారు. ఆయనకు గజమాలలు వేశారు. అడుగడుగునా పూల వర్షం కురిపించారు. టపాసులు కాలుస్తూ స్వాగతం పలికారు. పోలీసుల ఆంక్షలను జగన్, వైసీపీ పార్టీ నేతలు, శ్రేణులు ఏ మాత్రం పట్టించుకోకుండా ఎక్కడికక్కడ ఉల్లంఘనలకు పాల్పడ్డారు. సైలెన్సర్ లేని వాహనాలతో ఆ పార్టీ కార్యకర్తలు నానా హడావిడి చేసి హైవేను బ్లాక్ చేశారు. జగన్ పర్యటనకు పోలీసులు మధ్యాహ్నం రెండు గంటల వరకే అనుమతి ఇచ్చారు. అది కూడా రామరాజుపాలెం, ఆకుమర్రు, సీతారామపురం, ఎస్ఎన్ గొల్లపాలెంలో మాత్రమే పర్యటనకు అనుమతినిచ్చారు. కానీ జగన్ మాత్రం రోడ్డు షోను సాయంత్రం వరకు కొనసాగించారు. ప్రెస్‌మీట్ పేరుతో మరింత జాప్యం చేశారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

ఎన్‌హెచ్ - 65 పై అత్యవసరంగా ప్రయాణించే పలు వాహనాలు జగన్ రోడ్ షోలో చిక్కుకుపోయాయి. ట్రాఫిక్‌లో చిక్కుకున్న ఓ అంబులెన్స్‌ను ముందుకు పంపించేందుకు పోలీసులు ఎంతో కష్టపడాల్సి వచ్చింది. పోలీసులు పదే పదే విజ్ఞప్తి చేస్తేగానీ అంబులెన్స్ ముందుకు వెళ్లడానికి దారి దొరకలేదు.

పోలీసులపై కైలే, కిట్టు వీరంగం..

జగన్ పర్యటన నేపథ్యంలో పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పోలీసుల మీద వీరంగం వేశారు. పెడన సమీపంలో ఎస్ఎన్ గొల్లపాలెం దగ్గర పేర్ని కిట్టు పోలీసులపై ఓవరాక్షన్ చేశారు.

పంటల బీమాపై జగన్ ప్రగల్భాలు!

(మొదటి పేజీ తరువాయి)

గొప్పలు చాలానే చెప్పుకొచ్చారు. తాను సీఎంగా ఉన్నప్పుడు చేసిందేమీ లేకపోయినా.. తుఫాను వస్తే సీఎం ఏం చేయాలో ఇప్పుడు ప్రవచించారు. పొలాలకు వచ్చి పంట నష్టాన్ని చూసి రైతులను ఓదార్చాలని సూక్తులు చెప్పారు. తుఫాన్ గతనెల 28న రాత్రి తీరం దాటింది. 29న గాలులు, భారీవర్షాలు కురవగా, 30న ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే చేసి, కోనసీమ జిల్లాలో రైతులతో మాట్లాడిన విషయం తెలిసిందే. తన పాలనలో తుఫాన్లు వచ్చినప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లి రైతుల్ని జగన్ పరామర్శించిన దాఖలాలే లేవు. కనీసం హెలికాప్టర్ దిగి, పంట నష్టాన్ని స్వయంగా చూసిన సందర్భాలూ అరుదే. తన హయాంలో ఉచిత పంటల బీమా అమలు చేశామని ప్రగల్భాలు పలికిన జగన్.. ఐదేళ్లలో మూడేళ్ల పాటు ఫసల్ బీమా కింద రైతు వాటా నయా పైసా చెల్లించలేదని కేంద్రం తేల్చిచెప్పింది. ఈ ఏడాది జూన్ 29న కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పార్లమెంట్ సాక్షిగా వైసీపీ పాలనలో మూడేళ్ల పంటల బీమా సొమ్ము రైతులకు ఎగనామం పెట్టిన విషయాన్ని బహిర్గతం చేశారు. 2019 ఖరీఫ్ నాటికి అధికారంలోకి వచ్చిన జగన్.. పంటల బీమా కింద రైతులతో ఒక రూపాయి ప్రీమియం కట్టించారు. మిగతా రైతు వాటాను రాష్ట్ర ఖజానా నుంచి చెల్లించినా.. ఆ ఏడాది రబీ సీజన్‌లో ఈ పథకాన్ని వినియోగించుకోకపోవడంతో రైతులకు బీమా లబ్ధి చేకూరలేదు. 2020, 2021ల్లో రెండు సీజన్లలోనూ అసలు ఫసల్ బీమా పథకాన్నే వినియోగించుకోలేదు. ఉచిత పంటల బీమా అంటూ కేవలం ఖరీఫ్ సీజన్లలో మాత్రమే విపత్తులకు పంట నష్టపోయిన రైతులకు అరకొరగా పరిహారాన్ని వైసీపీ ప్రభుత్వం అందించింది. కానీ కూటమి ప్రభుత్వం గతేడాది ఉచిత పంటల బీమాను కొనసాగించింది. గత రబీ, ముగిసిన ఖరీఫ్‌లో బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని నిర్దేశించింది. బీమా చేసిన రైతులకు పరిహారం పెండింగ్‌లో ఉండగా, ఉచిత పంటల బీమా లేక ఎకరానికి రూ.20 వేలు చొప్పున రైతులు నష్టపోతున్నారని జగన్ బాధపడిపోయారు. తన హయాంలో రబీ సీజన్లకు బీమా వర్తింపజేయని విషయాన్ని విస్మరించి.. ఇప్పుడు మాత్రం రబీ సీజన్లకూ బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జగన్ హయాంలో కేవలం వైసీపీ నేతల సిఫారసులున్న రైతులకే ఆర్బీకేలు ఎరువులు పంపిణీ చేశాయి. ఇవన్నీ విస్మరించిన జగన్.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా ఎరువులు ఇస్తుంటే.. బ్లాక్ మార్కెట్ జరుగుతోందని ఆరోపణలు చేస్తున్నారు. అయితే తుఫాన్‌కు 1.38 లక్షల హెక్టార్లలో పంటలు మునిగినట్లు ప్రాథమిక అంచనా వేసిన వ్యవసాయ శాఖ.. వారం రోజుల ఎన్యూమరేషన్‌లో దాదాపు 1.58 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు తేల్చింది. అయితే 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందంటూ జగన్ గగ్గోలు పెట్టడంపై అధికారులు అవాక్కవుతున్నారు.

పంటబీమా చెల్లించకపోవడంవల్లే రైతులకు కష్టాలు: జగన్

మచిలీపట్నం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా రైతులకు జరిగిన పంటనష్టాన్ని చంద్రబాబు ప్రభుత్వం తక్కువగా చూపిస్తోందని మాజీ సీఎం జగన్ విమర్శించారు. మంగళవారం పంటలు దెబ్బతిన్న కృష్ణాజిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పెడన నియోజకవర్గం గూడూరు మండలం రామరాజుపాలెంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 15 లక్షల ఎకరాల్లో తుఫాను కారణంగా వివిధ రకాల పంటలకు నష్టం జరిగితే 11 లక్షల ఎకరాల్లోనే పంటనష్టం జరిగినట్టు చూపడం ఎంతవరకు సమంజసమన్నారు. తక్కువ మొత్తంలో పంటనష్టం జరిగినట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు చూపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన గత 18 నెలల్లో 16 సార్లు ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయని, పంటలబీమాను చెల్లించకపోవడంతో ఆపత్కాలంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని జగన్ అన్నారు. పంట నష్టపరిహారంగా రైతులకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, పెట్టుబడి సాయంగా ఒక్కో రైతుకు రూ.20 వేలు ఇస్తామని చెప్పి, కేవలం రూ.5 వేలతోనే సరిపెట్టారన్నారు. చాపర్‌లో తిరిగితే పంటనష్టం ఎలా తెలుస్తుందని చంద్రబాబును ఉద్దేశించి జగన్ అన్నారు. నష్ట పరిహారం జాబితాలు సక్రమంగా తయారుచేయాలని, లేదంటే రైతులకు న్యాయం జరిగేవరకు పోరాడతానని జగన్ అన్నారు.



విజయవాడలోని ఆటోనగర్‌లో మంగళవారం మధ్యాహ్నం కురుస్తున్న వర్షం

నేడు దక్షిణ కోస్తా, సీమల్లో వర్షాలు

అమరావతి, విశాఖపట్నం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కోస్తా తీరానికి ఆనుకుని, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న రెండు రోజులు పలు జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని అమరావతిలోని విపత్తుల నిర్వహణసంస్థ తెలిపింది. బుధవారం కోనసీమ, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, కడప జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని తెలిపింది. కాగా, ప్రస్తుతం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో వర్షాలకు అనుకూలమైన వాతావరణం కొనసాగుతోందని విశాఖ వాతావరణశాఖ నిపుణుడొకరు తెలిపారు. తూర్పుమధ్య బంగాళాఖాతంలో ఉన్న అల్పపీడనం వాయవ్యంగా పయనించి మంగళవారానికి ఈశాన్య బంగాళాఖాతంలో ప్రవేశించే క్రమంలో తీవ్ర అల్పపీడనంగా మారిందన్నారు. ఇది బంగ్లాదేశ్ వైపు పయనిస్తున్నందున దీని ప్రభావం రాష్ట్రంపై ఉండదన్నారు.



అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలంలో బీటలు వారిన ఓ మట్టి ఇంటి గోడ

విశాఖలో భూకంపం.. రిక్టర్ స్కేల్‌పై 4.0గా నమోదు

విశాఖపట్నం, అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో భూకంపం అలజడి రేపింది. నగరంతో పాటు పరిసరాల్లో మంగళవారం తెల్లవారుజామున 4.19 గంటల సమయంలో భూమి కంపించింది. ఈ భూకంపం రిక్టర్ స్కేల్‌పై 4.0గా నమోదైంది. భీమిలి ప్రాంతంలో శబ్దాలు కూడా వచ్చినట్టు చెబుతున్నారు. తొట్లకొండ పరిసరాలు భూకంప కేంద్ర స్థానంగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలోనూ కొద్దిసేపు భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3.7గా నమోదైనట్టు నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ ప్రకటించింది. అల్లూరి జిల్లా పాడేరు పరిసరాల్లో తెల్లవారుజామున భూమి స్వల్పంగా కంపించింది. జి.మాడుగుల మండలం పులుసుమామిడి, జంగాలమెట్ట గ్రామాల్లో పలువురు గిరిజనుల ఇళ్ల గోడలు బీటలు వారాయి.

నకిలీ మద్యం కేసులో కేరళ వ్యక్తుల అరెస్టు, రిమాండ్

- గోవా నుంచి స్పిరిట్ సమకూర్చిన జినేశ్, అతని అనుచరుడు శిబు

ములకలచెరువు(అన్నమయ్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నకిలీమద్యం కేసులో కేరళకు చెందిన ఇద్దరు వ్యక్తులను మదనపల్లె ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. త్రిసూర్ జిల్లా కైపమంగళం ప్రాంతానికి చెందిన కె.ఎస్. జినేశ్(50), అతని అనుచరుడు.. కన్నూర్ జిల్లా పెరింతట్టకు చెందిన శిబు (45)ను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. జినేశ్ గోవాలో ఉంటూ స్పిరిట్‌ను సేకరించి ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన బెంగళూరుకు చెందిన బాలాజీకి పంపేవాడని తేలింది. అలాగే జినేశ్ సూచనలతో అతని అనుచరుడు, డ్రైవర్ శిబు స్పిరిట్‌ను గోవా నుంచి బెంగళూరుకు తీసుకొచ్చేవాడని గుర్తించారు. ఈ ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి కారు, 35 లీటర్ల స్పిరిట్, రూ.17,400 నగదు, 11 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయంలో విచారించిన అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం తంబళ్లపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కోర్టుకు తీసుకెళ్లి న్యాయాధికారి ఎదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించడంతో నిందితులను మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. కాగా, జినేశ్‌పై కేరళలో గతంలో స్పిరిట్ కేసులు నమోదైనట్లు ఎక్సైజ్ పోలీసుల విచారణలో తేలింది.

లారీ క్లీనర్ నుంచి నకిలీ లిక్కర్ వరకు

జినేశ్ రిమాండ్ రిపోర్టు ప్రకారం... 2018లో గోవా వెళ్లిన జినేశ్ లారీ క్లీనర్‌గా పనిచేసేవాడు. అక్కడ బాలాజీ(ఏ15)తో పరిచయమైంది. 2023లో బాలాజీ తన స్నేహితుడు అద్దేపల్లి జనార్దనరావు(ఏ1)తో కలిసి నకిలీ మద్యం తయారు చేయాలని ప్రణాళిక వేసుకున్నారు. దీనికి స్పిరిట్ సరఫరా చేయాలని బాలాజీ కోరడంతో జినేశ్ అంగీకరించాడు. డిస్టిలరీల నుంచి లీటరు రూ.125 చొప్పున స్పిరిట్‌ను కొనుగోలు చేసి బాలాజీకి రూ.180కి అమ్మేవాడు. గోవా నుంచి శిబు తన వాహనంలో స్పిరిట్ తెచ్చి బెంగళూరు సమీపంలోని బసవరాజ్ ఎస్టేట్‌లో ఉన్న రూమ్‌లో నిల్వ చేసేవాడు. కాగా, జినేశ్, శిబులను అరెస్టు చేయడంతో నకిలీ మద్యం వ్యవహారంలో నిందితుల సంఖ్య 25కు చేరింది. ఈ కేసుకు సంబంధించి మరో ముగ్గురు నిందతులు ఎక్సైజ్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

ప్రివిలేజ్ కమిటీ నోటీసులపై

జోక్యం చేసుకోలేం



- అపరిపక్వ దశలో కోర్టును ఆశ్రయించారు: హైకోర్టు
- సాక్షి ఎడిటర్, చీఫ్ రిపోర్టర్ వ్యాజ్యాలు కొట్టివేత

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ తమకిచ్చిన ఇచ్చిన షోకాజ్ నోటీసును సవాల్ చేస్తూ 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి, చీఫ్ రిపోర్టర్ బి.ఫణికుమార్ దాఖలు చేసిన వ్యాజ్యాలను హైకోర్టు కొట్టివేసింది. ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులపై ఆ పత్రిక ప్రచురించిన కథనంపై వివరణ కోరుతూ ప్రివిలేజ్ కమిటీ ఇచ్చిన షోకాజ్ నోటీసు వివిధ దశలను అధిగమించాల్సి ఉంటుందని గుర్తుచేసింది. పిటిషనర్ల వివరణను పరిగణనలోకి తీసుకుని విచారణను నిలిపివేయాలని కమిటీ శాసనసభకు సిఫారసు చేయవచ్చని తెలిపింది. ఒకవేళ పిటిషనర్లకు వ్యతిరేకంగా అది సిఫారసు చేసినప్పటికీ.. వారు సమర్పించిన ఆధారాలు, వివరణను పరిగణనలోకి తీసుకుని సభ స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవలసి ఉంటుందని గుర్తు చేసింది. రాజ్యాంగంలోని అధికరణ 194 (శాసనసభ హక్కులు), అధికరణ 19(1ఏ)(వాక్ స్వాతంత్రం) మధ్య ఉన్న పరస్పర సంబంధం తేల్చే వ్యవహారం ప్రస్తుతం సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉందనే కారణంతో ప్రివిలేజ్ కమిటీ వద్ద ప్రక్రియను నిలుపుదల చేయడానికి వీల్లేదన్న అడ్వకేట్ జనరల్(ఏజీ) వాదనతో ఏకీభవిస్తున్నట్లు ప్రకటించింది. పిటిషనర్లు అపరిపక్వదశలో కోర్టును ఆశ్రయించారని పేర్కొంటూ వ్యాజ్యాలను కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ మంగళవారం తీర్పు వెలువరించారు.

ఏం జరిగింది..?

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరి 22, 23 తేదీలలో ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే ఇవి వాయిదా పడడంతో కోట్లు రూపాయలు వృధా చేశారని పేర్కొంటూ 'కోట్లు ఖర్చు-శిక్షణ తుస్సు' అనే శీర్షికతో సాక్షి పత్రిక కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం ప్రజలను తప్పుదోవపట్టించేలా ఉందని, ప్రచురణ వెనుక దురుద్దేశం ఉందంటూ టీడీపీ ఎమ్మెల్యే జి.జయసూర్య ఫిబ్రవరి 25న స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారాన్ని స్పీకర్ ప్రివిలేజ్ కమిటీకి నివేదించారు. దీంతో ఆ కమిటీ సదరు పత్రికకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కథనం ప్రచురణపై వివరణ కోరుతూ శాసనసభ సెక్రెటరీ జనరల్ జూన్ 3న సాక్షి యాజమాన్యం, ఎడిటర్, ప్రింటర్, పబ్లిషర్‌కు లేఖ రాశారు. ప్రివిలేజ్ కమిటీ ఇచ్చిన షోకాజ్ నోటీసును, సెక్రెటరీ జనరల్ రాసిన లేఖను సవాల్ చేస్తూ ఆ పత్రిక ఎడిటర్ రక్కసి ధనంజయరెడ్డి, చీఫ్ రిపోర్టర్ బి.ఫణి కుమార్ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై కోర్టు ఇటీవల తుది విచారణ జరిపింది. వారి తరపున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. పిటిషనర్లు ప్రచురించిన కథనం సభా హక్కుల ఉల్లంఘన కిందికి రాదన్నారు. అందులో సభలో జరిగిన ప్రొసీడింగ్స్ గురించి గానీ, సభలోని సభ్యులను అవమానపరుస్తూ గానీ ఎలాంటి ప్రస్తావనలూ లేవని తెలిపారు. ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. ప్రివిలేజ్ కమిటీ షోకాజ్ నోటీసులపై ప్రాథమిక దశలో జోక్యం చేసుకోవడానికి వీల్లేదని సుప్రీం కోర్టు తీర్పులు ఉన్నాయని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి మంగళవారం నిర్ణయం వెల్లడించారు.

న్యాయసమీక్షకు లోబడే కమిటీ నిర్ణయం

ప్రివిలేజ్ మోషన్ కింద చట్ట సభల్లో తీసుకునే నిర్ణయాలు సైతం దేశంలోని చట్టబద్ధ పాలనకు లోబడి ఉండాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. 'పార్లమెంటు, శాసనసభలు, వాటి అనుబంధ కమిటీల్లో ఉన్న సభ్యులు.. చట్టసభలను తమను తాము రక్షించుకునే దీవులుగా వినియోగించుకోలేరని సీతా సొరేన్ కేసులో సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. ప్రివిలేజ్ మోషన్ కింద చట్టసభలు తీసుకునే నిర్ణయం న్యాయ సమీక్షకు లోబడే ఉంటుంది. రాజ్యాంగ సూత్రాలను దృష్టిలో ఉంచుకుని ప్రివిలేజ్ కమిటీ సదరు కథనంపై సరైన నిర్ణయం తీసుకుంటుందని విశ్వసిస్తున్నాం. కోర్టు న్యాయసమీక్ష జరిపే సమయంలో సభా హక్కుల ఉల్లంఘన జరిగిందని నిరూపించాల్సిన బాధ్యత.. తమ హక్కులకు భంగం కలిగిందని చెప్పేవారిపైనే ఉంటుంది. రాజ్యాంగంలోని 194, 19(1ఏ) మధ్య ఉన్న పరస్పర సంబంధం అంశం తేల్చే వ్యవహారం సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉందనే కారణంతో ప్రివిలేజ్ కమిటీ వద్ద ప్రక్రియను నిలుపుదల చేయడానికి వీల్లేదన్న ఏజీ వాదనతో ఏకీభవిస్తున్నాం. అపరిపక్వ దశలో వ్యాజ్యాలు దాఖలు చేశారు' అని స్పష్టంచేస్తూ పిటిషన్లను కొట్టివేశారు.

నచ్చితే ఎంతైనా..!

- ఓపీజీడబ్ల్యూ టెండరు ధర 16.77 కోట్లు పెంచేశారు
- నచ్చినవారి కోసం ట్రాన్స్‌కోలో కోట్లలో పందేరం
- కేబుళ్ల సరఫరా, ఏర్పాటుకు గతేడాది 84.95 కోట్లతో టెండరు
- పనులు అప్పగించకుండా ఏడాది జాప్యం
- అర్ధాంతరంగా పాతది రద్దు..101 కోట్లకు రీటెండరు
- పెంచిన ధరతో ఈ ఏడాది మొదట్లో పనుల అప్పగింత
- అదే పని...ఎస్ఎస్ఆర్ ధరల్లోనూ మార్పు లేదు
- కానీ టెండరు ధర మాత్రం పెరిగిపోయిన వైనం!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

హైవోల్టేజ్ ట్రాన్స్‌మిషన్ లైన్ల మీద మిగిలిన లైన్ల కన్నా పై భాగాన ఒకే ఒక్క తీగ విడిగా కనిపిస్తుంది. దాన్నే ఓపీజీడబ్ల్యూ కేబుల్ అంటారు. సాధారణంగా వీటిని 400కేవీ, 220 కేవీ, 132కేవీ ఎక్స్‌ట్రా హైవోల్టేజీ (ఈహెచ్‌వీ) ట్రాన్స్‌మిషన్ లైన్స్‌లో వాడతారు. ప్రధానంగా మెరుపుల నుంచి హెచ్‌టీ లైన్ రక్షణ కోసం, హైస్పీడ్ టెలీ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కోసం వీటిని వినియోగిస్తారు. మెరుపుల నుంచి హెచ్‌టీ లైన్లను రక్షించే ఎర్తింగ్ వైర్‌గా ఇవి పనిచేస్తాయి. అలాగే డేటా, వాయిస్, వీడియో వంటి సమాచారాన్ని ప్రసారం చేసేందుకూ ఉపయోగపడతాయి. ట్రాన్స్‌మిషన్ లైన్ల వెంట ఇప్పటికే ఉన్న రైట్ ఆఫ్ వేను ఉపయోగించుకోవడం ద్వారా భూమిని తవ్వాల్సిన పనిలేకుండా ఓపీజీ డబ్ల్యూ కేబుల్ ద్వారా కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలను నిర్మించుకోవచ్చు. నిర్దేశిత సమయంలో ఈ కేబుల్‌ను మార్చుకుంటూ ఉండాలి. ఇందులోభాగంగా ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ (ట్రాన్స్‌మిషన్) 2023 ఆగస్టులో కేబుల్ సరఫరా, ఏర్పాటుకు టెండరు పిలిచారు. 2024 జనవరిలో టెండరును కాంట్రాక్టరుకు అప్పగించినా, పనులు అప్పగించకుండా జాప్యం చేస్తూవచ్చారు. చివరకు ఆ ఏడాది ఆగస్టులో టెండరును రద్దు చేశారు. రూ.84.95 కోట్లతో పిలిచిన ఈ టెండరు రద్దుకు ట్రాన్స్‌కో అధికారులు ఎలాంటి కారణాలు చూపలేదు. మళ్లీ అదే ఏడాది డిసెంబరులో రీటెండరు పిలిచి, 2025 జనవరిలో మరో కాంట్రాక్టరుకు పనులు అప్పగించారు. ఈసారి టెండరు విలువ అమాంతం పెరిగిపోయింది. ఏడాది కాలంలో టెండరు విలువ రూ.84.95 కోట్ల నుంచి రూ.101.72 కోట్లకు పెరిగిపోయింది. సుమారు రూ.16.77 కోట్లు మేర టెండరు విలువ పెంచేసి ట్రాన్స్‌కో అధికారులు దోపిడీకి సిద్ధమయ్యారు.

విడగొట్టారు.. దోపిడీకి స్కెచ్ వేశారు..

తొలిసారి పిలిచిన టెండరులో రాష్ట్రమంతా ఒకే విభాగంగా చూపారు. ఓపీజీడబ్ల్యూ 48ఎఫ్ కేబుల్‌ను 146.63 కిలోమీటర్లు మేర వేయాలని టెండరులో పేర్కొన్నారు. 48 ఫైబర్లు ఉండే 48ఎఫ్ కేబుల్‌ను హైకెపాసిటీ డేటా ట్రాన్స్‌మిషన్‌కు ఉపయోగిస్తారు. ఓపీజీడబ్ల్యూ 24ఎఫ్ కేబుల్‌ను 3165.61 కిలోమీటర్లు మేర వేయాలని తెలిపారు. 24 ఫైబర్లు ఉండే 24ఎఫ్ కేబుల్‌ను ఆప్టికల్ పవర్ గ్రౌండ్ వైర్‌గా పేర్కొంటారు. దీన్ని ఎర్తింగ్ వైర్‌గా ఉపయోగిస్తారు. తొలిసారి పిలిచిన టెండరును రద్దుచేసిన తర్వాత, రెండోసారి పిలిచిన టెండరులో రాష్ట్రాన్ని టెలికాం సర్కిళ్లవారీగా మూడు లాట్‌ల కింద విడగొట్టినట్లు చూపారు. లాట్ 1 కింద విజయవాడ టెలికాం సర్కిల్ పరిధిలో 973 కిలోమీటర్లను చూపుతూ రూ.29.51 కోట్లకు, లాట్ 2 కింద విశాఖపట్నం సర్కిల్ పరిధిలోని 838 కిలోమీటర్లను చూపుతూ రూ.25.27 కోట్లకు, లాట్ 3 కింద కడప సర్కిల్ పరిధిలోని 1,450 కిలోమీటర్లను చూపుతూ రూ.46.93 కోట్లకు టెండరు పిలిచారు. ఈ మొత్తంలో 48ఎఫ్ కేబుల్ వేయాల్సిన కిలోమీటర్లలోగానీ.. 24 ఎఫ్ కేబుల్ వేయాల్సిన కిలోమీటర్లలో గానీ మార్పు లేదు. కేవలం టెండరు ధర మాత్రమే రూ.16.77 కోట్లకు పెరిగిపోయింది. ఎస్ఎస్ఆర్ ధరల్లో కూడా ఎలాంటి మార్పు లేదు. అయినా టెండరు ధరను ఇష్టమొచ్చినట్లు పెంచేశారు. ఎక్కువగా పిలిచిన మొత్తాన్ని కప్పిపుచ్చుకొనే ఎత్తుగడలోభాగంగా రెండోసారి పిలిచిన టెండరును మూడు లాట్‌లుగా విడగొట్టినట్లు చూపారు.

ఎవరి కోసం..?

పాత టెండరును రద్దు చేయడం.. మళ్లీ అదే టెండరును అధిక ధరకు పిలవడం వెనుక సంబంధిత శాఖ మంత్రి పేషీ నుంచి వచ్చిన ఒత్తిళ్లే కారణమని చెబుతున్నారు. గతంలో పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు 2024 జనవరిలో పనులు ప్రారంభించేందుకు సిద్ధమవ్వగా, ఎన్నికల నిర్వహణను సాకుగా చూపి అధికారులు వాటిని అప్పగించలేదు. ఆ తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పాత కాంట్రాక్టరును తొలగించేందుకు ఏకంగా టెండరునే రద్దు చేసేశారు. పోనీ ఆ తర్వాత పిలిచిన టెండరునైనా సక్రమంగా పిలిచారా అంటే రూ.16.76 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ అధిక ధరతో టెండరు పిలిచి, అయిన వారికి కట్టబెట్టారు.

కల్తీ లిక్కర్ వయా బెల్టు షాప్

వైసీపీ హయాంలో ఈ షాపులే 'నకిలీ' అడ్డాలు

- ఇబ్రహీంపట్నంతో వాటికి లింకులు
- ఆర్టీసీ కార్గో ద్వారా రాష్ట్రమంతా సరఫరా
- తాగిన వారిలో చాలామంది మృత్యువాత
- వాటిని 'కరోనా'మీదకు తోసేసిన వైనం
- జోగి అరెస్టుతో ఒక్కొక్క లింకు వెలుగులోకి..

(విజయవాడ, ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా విచ్చలవిడిగా జరిగిన కల్తీ మద్యం సరఫరా మూలాలన్నీ ఇబ్రహీంపట్నంలోనే బయటపడుతున్నాయి. ఆనాడు కరోనా మీదకు నెట్టేసిన పలు మరణాల్లోనూ ఇక్కడ తయారైన కల్తీ మద్యం తాగి మరణించిన కేసులు కూడా ఉన్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయి. గత ఎన్నికల సమయంలో ఇదే మద్యం ఆర్టీసీ కార్గోల ద్వారా రాష్ట్రమంతా పారించినట్టు కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు ఆనాడు అధికారం అండగా కల్తీ మద్యాన్ని బెల్ట్‌షాపులనే లక్ష్యంగా చేసుకుని సరఫరా చేసినట్టుగా తెలుస్తోంది. వైసీపీ మాజీ మంత్రి జోగి రమేశ్ అరెస్టు నేపథ్యంలో ఈ విషయాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. జోగి రమేశ్ సలహాతోనే వైసీపీ హయాంలో ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీని తాము ప్రారంభించామని అద్దేపల్లి సోదరులు విచారణలో తెలిపిన విషయం తెలిసిందే. తమ దందాకు వీరు బెల్టుషాపులను నాడు ఎంచుకున్నారు. నిజానికి, బెల్ట్‌షాపుల తాటతీశామని ఆనాడు చెప్పుకొన్న వైసీపీ ప్రభుత్వ హయాంలో ఊరికో బెల్ట్ షాప్ నడిచింది. ఈ బెల్ట్ షాపుల నుంచి నకిలీ మద్యాన్ని కొనుగోలుచేసి సేవించినవారిలో చాలామంది మృత్యువాత పడేవారు. దీర్ఘకాలిక రోగాలకు గురయ్యేవారు. నాడు కల్తీ మద్యం తాగి ఒక్క ఉమ్మడి కృష్ణా జిల్లాలోనే పెద్దఎత్తున మరణించారు. వీటిలో బయటకు వచ్చిన ఉదంతాలు కొన్నే. కల్తీ మద్యం కారణంగా కార్డియాక్ అరెస్టులతో చనిపోయినవారు ఎక్కువగా ఉన్నారు. అది కరోనా సమయం కావటంతో ఆ మహమ్మారి వచ్చిపోయాక శరీరంలోని వివిధ భాగాలపై ప్రభావం చూపిస్తుందన్న ప్రచారం బాగా జరిగింది. ఈ నేపథ్యంలో ఎందుకు చనిపోతున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. సరిగ్గా ఇదే సమయంలో కల్తీ మద్యాన్ని అందుబాటులోకి తీసుకురావటంతో అది తాగినవారు మృత్యువాత పడ్డారు. అయితే, లాక్‌డౌన్ కారణంగా అప్పట్లో కల్తీ మద్యం తయారీకి అవసరమైన కొన్ని రసాయనాల దిగుమతికి వీలు కాలేదు. దీంతో అందుబాటులోని స్పిరిట్‌ను బాటిల్‌లో నింపి, రంగు కలిపి వాటిని బెల్ట్‌షాపులకు తరలించినట్టుగా తెలుస్తోంది. ఈ మద్యం తాగినవారు ఎక్కువ సంఖ్యలో మృతి చెందారు. ఇబ్రహీంపట్నం కేంద్రంగా తయారై, సరఫరా అయిన కల్తీమద్యం తాగి వీరంతా చనిపోతున్నారన్న విషయం ఐదారు నెలల వరకు కూడా బయటకు తెలియలేదు. ఆకస్మిక మరణాలతో వారి కుటుంబ సభ్యులకు మొదట అనుమానం వచ్చింది. ఈ క్రమంలో అసలు 'గుట్టు' వెలుగులోకి వచ్చింది. గత ఎన్నికల సమయంలో కూడా కల్తీ మద్యాన్ని పెద్ద ఎత్తున పంపిణీ చేసినట్టుగా తెలుస్తోంది. ఎన్నికల సమయంలో కూడా కల్తీ మద్యం తాగి చనిపోయిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి.

బెయిల్ ఇప్పించండి

- కోర్టులో జోగి బ్రదర్స్ పిటిషన్లు
- కస్టడీపై విచారణ రేపటికి వాయిదా

విజయవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు రాము తమకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం కోర్టును ఆశ్రయించారు. వారి తరపు న్యాయవాది విజయవాడ ఆరో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఈ మేరకు పిటిషన్లు దాఖలు చేశారు. నకిలీ మద్యం కేసులో ఈ నెల 2న సిట్, ఎక్సైజ్ అధికారులు జోగి బ్రదర్స్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా, ఈ కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న జోగి బ్రదర్స్‌ను కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఆరో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఈ నెల ఆరో తేదీకి వాయిదా వేసింది. జోగి రమేశ్, రాము నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు వారిని పది రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఎక్సైజ్ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం జరగాల్సిన విచారణను కోర్టు గురువారానికి వాయిదా వేసింది.

జైలులో సదుపాయాల కల్పనపై వాదనలు పూర్తి

నకిలీ మద్యం తయారీ కేసులో నెల్లూరులోని కేంద్ర కారాగారంలో ఉన్న మాజీ మంత్రి జోగి రమేశ్ తనకు కుర్చీ, మంచం, ఫ్యాన్ వంటి సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఆరో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై వాదనలు పూర్తవడంతో జైళ్ల శాఖ నిబంధనల ప్రకారం ఎలాంటి సదుపాయాలు కల్పించవచ్చో పరిశీలించాలని కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌ను న్యాయాధికారి లెనిన్‌బాబు ఆదేశించారు. అదేవిధంగా కుటుంబసభ్యులను కలవడానికి తనకు వారంలో మూడు, న్యాయవాదులను కలవడానికి మూడు ములాఖత్‌లు ఇవ్వాలని కోరుతూ కూడా జోగి రమేశ్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపైనా పరిశీలించాలని జైలు సూపరింటెండెంట్‌ను న్యాయాధికారి ఆదేశించారు.

ఎక్సైజ్ కస్టడీకి ఏడుగురు నిందితులు

నకిలీ మద్యం తయారీ కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఏడుగురిని ఎక్సైజ్ కస్టడీకి ఇస్తూ విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి లెనిన్‌బాబు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. నకిరికంటి రవి, బాదల్ దాస్, ప్రదీప్ దాస్, డి.శ్రీనివాసరెడ్డి, అంగులూరి వెంకట కల్యాణ్, తాండ్ర రమేశ్ బాబు, షేక్ అల్లాబక్షు, చెక్కా సతీశ్‌కుమార్‌లను పది రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సతీశ్‌కుమార్ న్యాయవాది తప్ప మిగతా నిందితుల న్యాయవాదుల.. వాదనలు పూర్తవడంతో న్యాయాధికారి లెనిన్‌బాబు.. ఏడుగురిని ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు కస్టడీకి తీసుకుని విచారించడానికి అనుమతిచ్చారు. సతీశ్‌కుమార్ పిటిషన్‌ను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేశారు.

వివేకా హత్య కేసులో.. తదుపరి దర్యాప్తు జరపాల్సిందే!

- సునీల్ యాదవ్ సంచలన కౌంటర్
- సునీతారెడ్డి పిటిషన్‌పై దాఖలు చేసిన ఏ-2



సునీల్ యాదవ్

హైదరాబాద్, కడప, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సంచలనం చోటు చేసుకుంది. కేసులో అసలు వాస్తవాలు బయటకు వచ్చేందుకు తదుపరి దర్యాప్తు చేపట్టేలా సీబీఐకి ఆదేశాలు జారీచేయాలని ఏ-2 సునీల్ యాదవ్ మంగళవారం నాంపల్లి ప్రత్యేక కోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. ఇదే కోరుతూ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన కోర్టు.. కౌంటర్ వేయాలని నిందితులందరికీ నోటీసులు జారీచేయడం తెలిసిందే. మిగతా నిందితులు తదుపరి విచారణ అవసరం లేదని నివేదించగా.. సునీల్ యాదవ్ మాత్రం తదుపరి దర్యాప్తు చేపట్టాలని కోరడం విశేషం. 'ఈ హత్యలో సునీతారెడ్డి కుటుంబ సభ్యుల పాత్ర కూడా ఉందని ఆరోపణలున్నాయి. దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి భార్య తులశమ్మ వారిపై ప్రైవేటు ఫిర్యాదు చేశారు. ఈ హత్య ద్వారా పిటిషనర్ కుటుంబ సభ్యులు, వారి విస్తృత కుటుంబసభ్యుల అక్రమ చర్యలు, ఇస్లామిక్, క్రిస్టియన్ అతివాదుల చర్యలు సైతం బయటపడ్డాయి. వివేకా జీవితంలో ఇతర అంశాలను సీబీఐ పట్టించుకోలేదు. అక్రమ సంబంధాలు, సెటిల్‌మెంట్ వ్యవహారాలు, అక్రమ సంబంధాలున్న వారితో వివేకా ఆర్థిక లావాదేవీలు, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి కుటుంబంతో ఉన్న రాజకీయ కక్షలు, రాజశేఖర్‌రెడ్డి కుటుంబంలోని సభ్యులకే కడప ఎంపీ టికెట్ ఇవ్వాలని వివేకా పట్టుబట్టడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. వివేకా ఓ ముస్లిం మహిళను రహస్యంగా వివాహం చేసుకుని ఓ బిడ్డకు తండ్రి కూడా అయ్యారు. మరో ముస్లిం యువతితో సంబంధం కలిగి ఉన్నారు. వారిద్దరినీ సీబీఐ ఎందుకు ప్రశ్నించడం లేదు? ఆయన్ను లవ్ జిహాద్ ట్రాప్‌లో పడేశారు. ఈ నేపథ్యంలో ఎన్ఐఏ సహాయం తీసుకుని సీబీఐ పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలి. అన్ని కోణాల్లో తదుపరి దర్యాప్తు చేపట్టే విధంగా సీబీఐకి ఆదేశాలు జారీచేయాలి' అని సునీల్ యాదవ్ కోరారు. విచారణను కోర్టు 10వ తేదీకి వాయిదా వేసింది.

ఈ రోజు నుంచి నాకు ముప్పు: సునీల్‌యాదవ్

వివేకా హత్య కేసులో సీబీఐ తదుపరి విచారణ కొనసాగించాలంటూ ఆయన కుమార్తె చేసిన అభ్యర్థన తనకు సమ్మతమేనని సునీల్‌యాదవ్ వెల్లడించారు. మంగళవారం రాత్రి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' నిర్వహించిన డిబేట్‌లో ఆయన మాట్లాడారు. 'ఇవాళ 13 పేజీల కౌంటర్ పిటిషన్ దాఖలు చేశాను. దీంతో అందరికీ శత్రువుగా మారాను. ఈ రోజు నుంచి నాకు కచ్చితంగా ముప్పు ఉంటుంది. నాపై రకరకాలుగా కక్ష గట్టి ఉన్నారు. ఇప్పటికి ఆరుగురు సాక్షులు అనుమానాస్పదంగా మృతి చెందారు' అని చెప్పారు. 'వాళ్ల వద్ద తలొంచితే ఒకలా, వంచకపోతే మరోలా ఉంటుంది. నేను తప్పు చేశాననడం లేదు.. చేయలేదనీ అనడం లేదు. తదుపరి విచారణకు మాత్రమే సునీతమ్మకు సపోర్ట్ చేస్తున్నాను. మిగితా నిందితులు ఏ1, ఏ3 ఎలాంటి కౌంటర్లూ వేయకుండా ఉన్నారు. వారి లాయర్లు ఎవరు? వీళ్ల మొబైల్లో ఎవరెవరికి ఫోన్ చేస్తున్నారు.. ఎవరెవరిని మేనేజ్ చేస్తున్నారో తెలియాలి. పైనున్న ప్రముఖులను కచ్చితంగా విచారించాల్సిందే' అని సునీల్ యాదవ్ స్పష్టం చేశారు.

మరో ట్రావెల్ బస్సు దూకుడు!

(మొదటి పేజీ తరువాయి)

ఎనిమిది మంది గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. పోలీసులు, ప్రయాణికుల కథనం మేరకు.. జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన ఎన్ఎల్ 01, బి33382 నంబరు గల స్లీపర్ కోచ్ బస్సు సోమవారం రాత్రి 30 మంది ప్రయాణికులతో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. అర్ధరాత్రి 1.55 గంటల సమయంలో (మంగళవారం తెల్లవారుజామున) దామాజిపల్లి హైవే జంక్షన్ వద్దకు రాగానే ముందు వెళుతున్న ఐషర్ వాహనాన్ని బస్సు బలంగా ఢీకొట్టి బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని, స్థానికుల సాయంతో బస్సులో ఉన్నవారిని బయటకు తీశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సురక్ష(32)ను ఆస్పత్రికి తరలిస్తుండగా కన్నుమూశారు. గాయపడిన ఆమె భర్త వినీత్, మూడేళ్ల కూతురు నిధి, వినోద్, ముజఫర్ ఖాన్, అసలా, వెంకట్, శిరీష గౌడ్, మాలిని అనంతపురం, చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. భార్య మృతిచెందడంతో వినీత్ తీవ్ర విషాదంలో మునిగిపోయారు. స్వల్పంగా గాయపడిన కూతురిని భుజాన వేసుకుని, ఆస్పత్రిలో విషణ్ణవదనంతో కూలబడిపోయారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు, ప్రయాణికులు తెలిపారు. జబ్బార్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్లు ఇర్ఫాన్, మాలిక్‌లతోపాటు, వ్యాన్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి భర్త వినీత్ ఫిర్యాదు మేరకు ట్రావెల్ బస్సు ఇద్దరు డ్రైవర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు.



శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం దామాజిపల్లి వద్ద బోల్తా పడిన ప్రైవేటు ట్రావెల్ బస్సు

హైదరాబాద్‌కు మకాం మార్చే క్రమంలో..

బెంగళూరుకు చెందిన వినీత్ హైదరాబాద్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సీనియర్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ప్రమాదంలో మృతిచెందిన ఆయన భార్య సురక్ష ఇన్ఫోసిస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న ఆమె, ఇటీవల కంపెనీ నుంచి వర్క్‌ఫ్రం హోం అనుమతి తీసుకున్నారు. అందరూ హైదరాబాద్‌లో ఉండాలని నిర్ణయించుకుని జబ్బార్ ట్రావెల్ బస్సులో బయలుదేరారు. ఇన్నాళ్లూ అక్కడొకరు, ఇక్కడొకరు గడిపిన దంపతులు ఇకపై ఒక్కచోట ఉండాలని సంతోషంగా వెళుతుండగా ఈ దారుణం జరిగిందని వారి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఆందోళన కలిగిస్తున్న బస్సు ప్రమాదాలు

తెలుగు రాష్ట్రాల్లో వరుస బస్సు ప్రమాదాలు ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రధానంగా 44వ నంబరు జాతీయ రహదారిపై ప్రయాణమంటేనే భయపడుతున్నారు. ప్రతి రోజూ ఈ హైవేపై హైదరాబాద్-బెంగళూరు మధ్య 250కిపైగా ప్రైవేటు బస్సులు నడుస్తున్నాయి. ఇటీవల కర్నూలు జిల్లా చిన్న టేకూరు వద్ద బస్సు ప్రమాదానికి గురై 19 మంది సజీవ దహనయ్యారు. అలాగే, తెలంగాణలోని చేవెళ్లలో ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొట్టడంతో సోమవారం 19 మంది మృతిచెందారు. అదేరోజు ఏలూరులో ఓ ప్రైవేటు బస్సు బోల్తా పడింది. తాజాగా చెన్నేకొత్తపల్లి వద్ద బస్సు ప్రమాదానికి గురైంది. మితిమీరిన వేగం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

పెద్దిరెడ్డికి 'పుంగనూరు పుడింగి' పేరు కరెక్టే: పట్టాభిరాం

పుంగనూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సెల్ఫ్ డబ్బా కొట్టుకుంటూ దద్దమ్మ పనులు చేసిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డికి పుంగనూరు పుడింగి అన్న పేరు కరెక్టేనని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం అన్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో మంగళవారం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ పాలనలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి దాడులు, దౌర్జన్యాలతో పుంగనూరును దోచుకుతిన్నారు. చెత్తమీద పన్ను వేసి పుంగనూరులో 23 వేల టన్నుల చెత్తను వదిలేసిన చెత్త ఎమ్మెల్యే పెద్దిరెడ్డి. కూటమి ప్రభుత్వం పుంగనూరును అభివృద్ధి చేస్తుంటే తప్పుడు సమాచారంతో ఎంపీ మిథున్‌రెడ్డి కేంద్రానికి లేఖలు రాస్తున్నారు' అని పట్టాభి విమర్శించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.